

పెరిగిన జీఎస్టీ వసూళ్లు

గత 10 నెలల్లో ఫిబ్రవరిలోనే అత్యధికం
రాష్ట్రంలో పుంజుకున్న ఆర్థిక కార్యకలాపాలు
12

www.andhrajyothy.com పేజీలు: 14
వెల (Price) : Rs. 6.50
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 319

బుధవారం | 5-3-2025
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, పాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: షష్ఠి మ.12:52 తదుపరి సప్తమి, నక్షత్రం: కృత్తిక రా.1:08 తదుపరి రోహిణి, వర్జ్యం: మ.1:53-3:23, అమృతఘడియలు: రా.10:53-12:23, దుర్ముహూర్తం: మ.12:03-12:50, రాహుకాలం: మ. 12:00-1:30, సూర్యోదయం: 6:34, సూర్యాస్తమయం: 6:19
| విజయవాడ సిటీ**
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



కోహ్లీ (84)

ఫైనల్లో భారత్

చాంపియన్స్ ట్రోఫీ సెమీఫైనల్లో
ఆస్ట్రేలియాపై రోహిత్ సేన ఘన విజయం

వరల్డ్‌కప్ ఫైనల్‌లో ఎదురైన ఓటమికి ప్రతీకారం
కోహ్లీ మరోసారి మాస్టర్ ఛేజ్
రాణించిన అయ్యర్, రాహుల్, పాండ్యా
బంతితో కంగారూలను దెబ్బతీసిన షమి, వరుణ్
నాలుగు వికెట్లతో భారత్ విజయం

స్పోర్ట్స్ పేజీలో..

మ్యాచ్‌కు ముందు ఏదో అనుమానం.. గతం తాలూకు భయాలు.. అయినా ఆల్ రౌండ్ షోతో అదరగొట్టిన భారత్.. చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. విరాట్ కోహ్లీ (84)తోపాటు శ్రేయాస్ అయ్యర్ (45), కేఎల్ రాహుల్ (42 నాటౌట్), హార్దిక్ పాండ్యా (28) రాణించడంతో.. ఉత్కంఠభరితంగా జరిగిన సెమీస్‌లో టీమిండియా.. ఆస్ట్రేలియాపై 4 వికెట్ల తేడాతో గెలిచింది. 2023 వరల్డ్‌కప్ ఫైనల్లో ఓటమికి బదులు తీర్చుకొంది. రోహిత్ మరోసారి టాస్ ఓడడంతో.. అభిమానుల్లో ఒక్కసారిగా ఆందోళన రేగింది. మరో ఆలోచన లేకుండా బ్యాటింగ్ ఎంచుకొన్న కంగారూలు మానసికంగా పైచేయి సాధించే ప్రయత్నం చేశారు. టీమిండియాకు విలన్ ట్రావిస్ హెడ్ ఆరంభంలోనే ఎడాపెడా షాట్లతో గుబులు పుట్టించాడు. ఈ సమయంలో రోహిత్ తెలివిగా స్పిన్నర్ వరుణ్ చక్రవర్తికి బంతి అందించడం మాస్టర్ స్ట్రోక్‌గా



పరిణమించింది. హెడ్‌ను చక్రవర్తి బోల్తా కొట్టించాడు. స్మిత్ తన కళాత్మక ఆటతో జట్టును ఆదుకోవడంతో.. ఒకానొక దశలో ఆసీస్ స్కోరు 300 దాటేలా కనిపించింది. కానీ, మధ్య ఓవర్లలో బౌలింగ్‌కు వచ్చిన షమి ఫుల్‌టాస్ బంతితో స్మిత్‌ను బౌల్డ్ చేశాడు. ప్రమాదకరంగా మారిన అలెక్స్ క్యారీని అయ్యర్ మెరుపు ఫీల్డింగ్‌తో రనౌట్ చేయడంతో.. ఆస్ట్రేలియాను భారత్ ఊహించిన దానికంటే తక్కువ స్కోరుకే కట్టడి చేయగలిగింది. అయితే, అనుభవం లేని బౌలర్లున్నా.. కంగారూలు అంత తేలిగ్గా వదల్లేదు. కోహ్లీ ఏమాత్రం ఆందోళనపడకుండా.. స్ట్రయిక్ రొటేట్ చేస్తూ కూల్‌గా భాగస్వామ్యాలు నిర్మించాడు. దీంతో భారత్ ఐదోసారి ఈ టోర్నీ తుది పోరుకు చేరుకొంది. దక్షిణాఫ్రికా-న్యూజిలాండ్ జట్ల మధ్య బుధవారం జరిగే రెండో సెమీఫైనల్ విజేతతో భారత్ ఆదివారం ఫైనల్లో తలపడుతుంది.

దొరికిన దొంగలు!

ఉపగ్రహ చిత్రాల సాక్షిగా బయటపడ్డ ఇసుక దోపిడీ



పల్నాడు జిల్లాలో కృష్ణా నదిలో జరిగిన అక్రమ తవ్వకాలను కళ్లకు కట్టే ఉపగ్రహ చిత్రాలివి. ఇందులో... పసుపు గీతల మధ్య ఉన్నది అధికారిక రీచ్. ఆకుపచ్చ రంగు గీతల మధ్య ఉన్నది అక్రమంగా తవ్వకాలు జరిగిన ప్రాంతం. భారీ యంత్రాలతో ఇసుక తవ్వుతున్న దృశ్యాలూ ఉపగ్రహం కంటికి చిక్కాయి.



జగన్ జమానాలో విశృంఖలంగా ఇసుక తవ్వకాలు

మూడేళ్లలో 3.91 కోట్ల టన్నులు దోచేశారు
మొత్తం 794 చోట్ల ఇసుక తవ్వి.. తరలింపు
85 పాయింట్లు మాత్రమే అధికారికం
హెక్టారుకు అనుమతిస్తే 40 హెక్టార్లలో 'స్వాహా'
సుప్రీం ఆదేశాలతో రంగంలోకి గనులశాఖ
గూగుల్ మ్యాప్స్, ఉపగ్రహ చిత్రాలతో అధ్యయనం
ఏపీఎస్ఏసీ ద్వారా గనుల శాఖ నివేదిక
ఇసుక సొమ్ము ఎవరి జేబుల్లోకి చేరినట్లు?

జగన్ జమానాలో మూడేళ్లలో 794 పాయింట్లలో 4.11 కోట్ల టన్నుల ఇసుక తవ్వారు. అందులో అనుమతులున్న పాయింట్లు 85 మాత్రమే!

అధికారిక అనుమతులతో తవ్విన ఇసుక 19.69 లక్షల టన్నులు. అనధికారికంగా తవ్వింది 3.91 కోట్ల టన్నులు.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైఎస్ జగన్ జమానాలో సాగిన ఇసుక దోపిడీ... ఉపగ్రహ చిత్రాల సాక్షిగా రుజువైంది. తవ్వాల్సింది రవ్వంత... తవ్వుకుని తరలించింది కొండంత అని తేలిపోయింది. అనుమతించిన రీచ్‌లలో తవ్విన ఇసుక సుమారు 20 లక్షల టన్నులు! కానీ... అనధికారికంగా, అక్రమంగా తవ్వుకున్నది ఏకంగా 3.91 కోట్ల టన్నులు! కళ్లుబైర్లు

మిగతా 2వ పేజీలో...



రాజ్యసభకు నాగబాబు!

మండలికి కాకుండా ఢిల్లీ పంపాలని జనసేన ప్రతిపాదన
ఆమోదించిన సీఎం చంద్రబాబు
సాయిరెడ్డి వైదొలగిన స్థానంలో ఎంపిక?
అక్కడ బీజేపీ పోటీచేస్తుందని ప్రచారం
ఒకవేళ నాగబాబుకే ఇస్తే బీజేపీకి ఎమ్మెల్సీ!
అటు టీడీపీలో భారీగా ఆశావహులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సోదరుడు కె.నాగబాబుకు రాజ్యసభ సీటు ఇవ్వనున్నారు. ఆయన్ను కేబినెట్‌లోకి తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో ప్రకటించారు. దీంతో ఆయనకు తొలుత ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి ఇస్తారని నిన్నటివరకు అంతా భావించారు. అనూహ్యంగా ఇప్పుడు ఎమ్మెల్సీ కాకుండా రాజ్యసభ సీటు ఇవ్వాలన్న ప్రతిపాదన జనసేన నుంచే రావడంతో టీడీపీ అధినేత ఆమోదం తెలిపినట్లు సమాచారం. ప్రస్తుతం ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. వాటిలో ఒక స్థానం

మిగతా 14వ పేజీలో...


ఎమ్మెల్సీలుగా గెలిచిన ఆలపాటి, పేరాబత్తులను అభినందిస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన మంత్రి లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్

వైసీపీ ఆటలు సాగనివ్వను

వారి గురించి మాట్లాడడం టైం వేస్ట్: చంద్రబాబు
రాజకీయాలను కలుషితం చేశారు
మనవాళ్లకూ లంచాలిచ్చి పబ్బం గడుపుకొనే యత్నం
వారితో లాలూచీ పడొద్దు
రాజధాని పేరుతో 3 ముక్కలాట
అమరావతిని శ్మశానమన్నారు
రాజధానిని సర్వనాశనం చేశారు
మనం తిరిగి గాడిన పెడుతున్నాం
విశాఖ స్టీల్‌ప్లాంటుకు ప్యాకేజీ, రైల్వే జోన్ సాధించాం
3 పార్టీల ఐక్యత శాశ్వతం కావాలి
విజయోత్సవ సభలో చంద్రబాబు
రెడ్ బుక్ తన పని తాను చేసుకుపోతోంది: లోకేశ్

అమరావతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల గురించి మాట్లాడి సమయం వృథా చేసుకోవడం తనకిష్టం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. 'వారితో ఎవరూ లాలూచీపడొద్దు. వారు రాజకీయాలను కలుషితం చేశారు. మన వాళ్లకూ లంచాలిచ్చి పబ్బం గడుపుకొనే ప్రయత్నం చేస్తున్నారు. వారి ఆటలు సాగనివ్వను' అని తేల్చిచెప్పారు. పట్టభద్రుల ఎమ్మెల్సీల

మిగతా 12వ పేజీలో...

కూటమి కుమ్మేసింది!

4 ఉమ్మడి జిల్లాలు.. 67 నియోజక వర్గాల పరిధిలో 'పట్టభద్ర' పోలింగ్
'అసెంబ్లీ'కన్నా పెరిగిన ఓట్ల శాతం
నాడు 58 శాతం ఓటు షేరు.. నేడు 65 శాతానికిపైగా ఓట్లు


13

బెదిరించినట్టు ఎక్కడ ఉంది?

వీసీల రాజీనామా లేఖల్లో ఆ పదం చూపించగలరా?
మండలిలో బొత్సకు మంత్రి లోకేశ్ సవాల్
వీసీల అంశంపై మరోసారి మంటలు
సభా హక్కుల నోటీసు ఇచ్చిన లోకేశ్

ఉద్యోగ వయోపరిమితి 42 ఏళ్లు
12

యూనిఫాం సర్వీసులకు రెండేళ్లు పెంపు
ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం


2

ప్రముఖ గాయని కల్పన ఆత్మహత్యాయత్నం!

నిద్రమాత్రలు మింగి అపస్మారక స్థితిలోకి
2 రోజులుగా తలుపులు తెరవకపోవడంతో భర్తకు సమాచారమిచ్చిన సెక్యూరిటీ
ఆయన ఫోన్‌తో రంగంలోకి పోలీసులు
ఆస్పత్రికి తరలింపు.. వెంటిలేటర్‌పై చికిత్స

పిల్లల కిట్లలోనూ కొట్టేశారు

నాటి వైసీపీ ప్రభుత్వ అడ్డగోలు దోపిడీ



కమీషన్ల కోసం అదనపు ధరలకు కాంట్రాక్టులు
గతేడాదితో పోలిస్తే ఇప్పుడు 64 కోట్లు ఆదా
ప్రభుత్వంపై తగ్గిన భారం 9.44 శాతం
ఈ లెక్కన గత ఐదేళ్లలో దోపిడీ 300 కోట్లపైనే
బూట్లు, బెల్టులు, బ్యాగులు అన్నీ ఎక్కువ రేట్లకే
ఒక్క నోట్ పుస్తకాల్లోనే 36.5 శాతం వ్యత్యాసం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

మద్యంలో కమీషన్లు దండుకున్నారు. గనుల లీజుల్లో వాటాలు దక్కించుకున్నారు. ఇవన్నీ ఒకెత్తు! చివరికి బడి పిల్లలకు ఇచ్చే స్టూడెంట్ కిట్లనూ గత జగన్ ప్రభుత్వంలో వైసీపీ పెద్దలు వదిలిపెట్టలేదు. చిన్న పిల్లలకు ఇచ్చిన బ్యాగులు, బెల్టుల్లోనూ 'మాకేంటి' అంటూ చేతివాటం ప్రదర్శించారు. ఐదేళ్లలో రూ.300 కోట్లకు పైగా దోపిడీ చేశారు. విద్యార్థుల కిట్ల(జగనన్న విద్యా కానుక) కొనుగోలులో అత్యంత పారదర్శకత పాటించామని అప్పటి ప్రభుత్వం మభ్యపెట్టే ప్రయత్నం చేయగా... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన తొలి కిట్ల కొనుగోలుతో అసలు విషయం బయటపడింది. గతంలో ఇచ్చిన వాటితో పోలిస్తే కిట్లలో కొంతమేర నాణ్యత పెంచినా అనూహ్యంగా ధర 9.44శాతం తగ్గిపోయింది. ఫలితంగా రూ.63.79 కోట్లు ప్రభుత్వానికి

మిగతా 14వ పేజీలో...

సుంకాల యుద్ధం

అమెరికా ఉత్పత్తులపై చైనా, కెనడా ప్రతీకార పన్నులు
ట్రంప్‌నకు తగిన సమాధానం చెప్పి తీరుతాం: ట్రూడో
సుంకాల వ్యవహారం ఒకరకంగా యుద్ధమే: వారెన్ బఫెట్



వాషింగ్టన్, బీజింగ్, మార్చి 4: అమెరికా, చైనా, కెనడా, మెక్సికో నడుమ సుంకాలు, ప్రతిసుంకాల యుద్ధం జోరందుకుంది! చైనాపై ఇప్పటికే విధిస్తున్న 10 శాతం సుంకాన్ని రెట్టింపు చేయడంతోపాటు.. మెక్సికో, కెనడాలపై విధించిన 25% సుంకాల అమలు మంగళవారం నుంచే మొదలవుతుందని ట్రంప్ చేసిన ప్రకటనకు ఆయా దేశాలు

మిగతా 2వ పేజీలో...

ఉక్రెయిన్‌కు సైనిక సాయం నిలిపివేత

అమెరికా నిర్ణయం.. తక్షణం అమల్లోకి
2

రష్యాతో చర్చలకు సిద్ధపడితేనే నిర్ణయం వెనక్కి: వైట్‌హౌస్
ట్రంప్ నేతృత్వంలో నడుస్తాం.. ఖనిజాల ఒప్పందానికి సిద్ధం
తొలుత గగనతలంలో శాంతి.. ఎక్స్‌లో జెలెన్‌స్కీ ప్రకటన


14


పీటీ వారెంట్‌పై కర్నూలుకు పోసాని

ఆదోనిలో గత నవంబరు 14న కేసు నమోదు
జనసేన పట్టణ అధ్యక్షుడు రేణువర్మ ఫిర్యాదు
గుంటూరు జిల్లా జైలు నుంచి తరలింపు

అనుమానం వస్తే చాలు.. ఆన్‌లైన్ అంతా జల్లెడ
2

ఐటీ అధికారులకు విస్తృత అధికారాలు
సోషల్, ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్, ఈమెయిల్ ఏ ఖాతాలనైనా తనిఖీ చేసేందుకు పవర్
కొత్త ఐటీ బిల్లులో ఈ మేరకు నిబంధనలు
పార్లమెంటు ఆమోదిస్తే వచ్చే ఏడాది అమలు

సింహాలతో సయ్యాట!



వంతారాలో సరదాగా గడిపిన ప్రధాని మోదీ

వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం ప్రారంభం

అహ్మదాబాద్, మార్చి 4: ప్రపంచంలోనే అతిపెద్ద వన్యప్రాణి సంరక్షణ, పునరావాస కేంద్రమైన వంతారాను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. గుజరాత్ పర్యటనలో భాగంగా ఆయన జామ్‌నగర్ జిల్లాలో 3,500 ఎకరాల విస్తీర్ణంలో అధునాతన వసతులతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని సందర్శించారు. రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ తనయుడు అనంత్ అంబానీ ఏర్పాటు చేసిన ఈ వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలో 1.5 లక్షలకు పైగా జంతువులు, పక్షులను సంరక్షిస్తున్నారు. నిపుణుల సంరక్షణలో అరుదైన, అంతరించిపోతున్న జాతులను కాపాడుతున్నారు. ఈ కేంద్రానికి వచ్చిన ప్రధాని మోదీకి.. ముకేశ్ అంబానీ కుటుంబ సమేతంగా స్వాగతం పలికారు. వంతారాను ప్రారంభించిన అనంతరం అనంత్ అంబానీతో కలిసి ప్రధాని వంతారా మొత్తం కలియదిరిగారు. ఈ కేంద్రంలో పునరావాసం పొందుతున్న వివిధ రకాల జంతువులతో సరదాగా గడిపారు. సింహం పిల్లలు, చిరుతపులి పిల్లలకు పాలు పట్టారు. ఏనుగులు, జిరాఫీలకు ఆహారం అందించారు. జంతువుల కోసం ఏర్పాటు చేసిన ఎంఆర్ఐ, సిటీ స్కానింగ్ సెంటర్లను, ఐసీయూ వంటి అధునాతన సౌకర్యాలతో కూడిన మల్టీ స్పెషాలిటీ వైల్డ్ లైఫ్ హాస్పటల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఆర్ఐ స్కానింగ్ తీయించుకుంటున్న ఆసియా సింహాన్ని గమనించారు. ప్రమాదంలో గాయపడిన చిరుతపులికి శస్త్రచికిత్స చేస్తున్న ఆపరేషన్ థియేటర్‌ను సందర్శించారు. ఏనుగులు త్వరగా కోలుకోవడానికి ఉపయోగపడే హైడ్రోథెరపీ పూల్‌ను పరిశీలించారు. జీబ్రాలతో కలిసి నడిచారు. చింపాంజీలతో ఫొటోలు దిగారు. పెద్ద కొండ చిలువలు, రెండు తలల పాములు, రెండు తలల తాబేళ్లు, మొసళ్లు, సీల్స్‌తో సహా ప్రపంచంలోని కొన్ని అరుదైన జాతులను వంతారాలో సంరక్షిస్తున్నారు.

అనంత్ మనసు గొప్పది: మోదీ

పర్యావరణ సుస్థిరతను, వన్యప్రాణుల సంక్షేమాన్ని ప్రోత్సహిస్తూనే జంతువులకు సురక్షితమైన ఆవాసాన్ని కల్పిస్తున్న వంతారాను ప్రారంభించడం ఆనందంగా ఉందని ప్రధాని మోదీ అన్నారు. ఇంతటి దయగల పనిచేస్తున్న అనంత్ అంబానీ, అతని బృందాన్ని అభినందిస్తున్నానని చెప్పారు. వంతారాలో పనిచేస్తున్న వైద్యులు, సహాయక సిబ్బంది, కార్మికులతో ప్రధాని మోదీ మాట్లాడారు.



చిరుతపులి కూనకు పాలు తాగిస్తున్న ప్రధాని మోదీ

లోకం తీరు



సుంకాల యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

అంతే ఘాటుగా స్పందించాయి. అమెరికా నుంచి తాము దిగుమతి చేసుకునే చికెన్, గోధుమలు, మొక్కజొన్న, పత్తి వంటి ఉత్పత్తులపై అదనంగా 15% సుంకాన్ని విధిస్తున్నట్టు చైనా ప్రకటించింది. అలాగే సోయాబీన్స్, పంది మాంసం, బీఫ్, పండ్లు, కూరగాయలు, పాల ఉత్పత్తులపై 10 శాతం అదనపు సుంకాన్ని వసూలు చేస్తామని పేర్కొంది. అంతేకాదు.. అమెరికాపై ప్రపంచవాణిజ్య సంస్థలో చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్టు వెల్లడించింది. తాము విధించిన అదనపు సుంకాలు మార్చి 10 నుంచి అమల్లోకి వస్తాయని చైనా కస్టమ్స్ టారిఫ్ కమిషన్ తెలిపింది. ఈ చర్యలతోపాటు.. అమెరికాకు చెందిన 10 కంపెనీలను 'విశ్వసనీయం కాని సంస్థల జాబితా'లో చేర్చాలని చైనా నిర్ణయించింది. అమెరికాకు చెందిన రక్షణ, ఏఐ, వైమానిక, ఐటీ రంగాలకు చెందిన కంపెనీలు ఈ జాబితాలో ఉన్నాయి. మరోవైపు.. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ట్రంప్ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు. దీనికి తాము తగిన సమాధానం చెప్పి తీరుతామని హెచ్చరించారు. అమెరికా తన నిర్ణయాన్ని వెనక్కితీసుకోకపోతే.. ఆ దేశం నుంచి కెనడాకు దిగుమతయ్యే ఉత్పత్తులపై 25% సుంకాలను విధిస్తామని, మంగళవారం అర్ధరాత్రి నుంచే ఈ సుంకాలు అమల్లోకి వస్తాయని ఆయన వెల్లడించారు. మరోవైపు మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ మాత్రం.. అమెరికా సుంకాలపై తాము ఆచితూచి వ్యవహరిస్తామని, అగ్రరాజ్యం తీసుకునే ఎటువంటి వాణిజ్యపరమైన చర్యలనైనా ఎదుర్కోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

ప్రముఖ గాయని కల్పన ఆత్మహత్యాయత్నం!

- వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్న వైద్యులు



హైదర్‌నగర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ప్రముఖ నేపథ్య గాయని కల్పన ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కల్పన బహుభాషా నేపథ్య గాయని. 27 ఏళ్లుగా పాటలు పాడుతున్నారు. మహాశివరాత్రి రోజున సంగారెడ్డిలో నిర్వహించిన సంగీత విభావరిలో పాల్గొని పాటలు పాడారు. ఆమె హైదరాబాద్‌లోని నిజాంపేటలో ఉన్న వర్టెక్స్ ప్రివిలేజ్ విల్లాస్‌లో నివాసం ఉంటున్నారు. రెండు రోజులుగా ఇంటి తలుపులు తెరుచుకోకపోవడంతో అనుమానం వచ్చిన సెక్యూరిటీ సిబ్బంది ఇచ్చిన సమాచారంతో అసోసియేషన్ సభ్యులు ఆమె భర్తకు ఫోన్ చేసి విషయం చెప్పారు. చెన్నైకి చెందిన ఆమె భర్త ప్రసాద్ కూడా మంగళవారం ఉదయం నుంచి ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఆయన ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఇంటి వెనక వంట గది నుంచి లోపలికి వెళ్లారు. అప్పటికే కల్పన అపస్మారక స్థితిలో మంచంపై పడి ఉన్నారు. ఆమె నిద్ర మాత్రలు మింగినట్లు గుర్తించారు. హుటాహుటిన కల్పనను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నామని.. ఆమె పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు.

రూ.27 అదనంగా వసూలు చేస్తే 27 లక్షలు ఫైన్

- హైదరాబాద్‌లోని హోటల్‌కు కాకినాడ వినియోగదారుల కమిషన్ షాక్

కాకినాడ క్రైం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం గంగనాపల్లికి చెందిన నున్న కుసుమ కల్యాణ్ 2023, డిసెంబరు 8న హైదరాబాద్‌లోని హోటల్ తులిప్స్ గ్రాండ్‌లో బిర్యానీ, డ్రింకులు, మూడు మినరల్ వాటర్ బాటిల్స్‌కు రూ.3,083 చెల్లించి కొన్నారు. హోటల్ యాజమాన్యం రూ.20 ఎంఆర్‌పీ గల మంచినీళ్ల సీసా రూ.29 వసూలు చేసింది. మూడు బాటిళ్లకు కలిపి రూ.27 ఎక్కువ వసూలు చేసింది. దీనిని గుర్తించిన కల్యాణ్ హోటల్ యాజమాన్యాన్ని ప్రశ్నించారు. వారి నుంచి సమాధానం రాలేదు. దీంతో కాకినాడ వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. సాక్ష్యాధారాలను పరిగణనలోకి తీసుకున్న కమిషన్ తీర్పు చెపుతూ... హోటల్ యాజమాన్యం, కల్యాణ్‌కు నష్టపరిహారంగా రూ.25,000 వేలు, కోర్టు ఖర్చుల నిమిత్తం రూ.2,000, తెలంగాణ సీఎం సహాయ నిధికి రూ.27 లక్షల భారీ జరిమానా చెల్లించాలని పేర్కొంది.

ఉక్రెయిన్‌కు సైనిక సాయం బంద్

అమెరికా నిర్ణయం.. తక్షణం అమల్లోకి.. 100 కోట్ల డాలర్ల ఆయుధ సామగ్రి సరఫరాపై ప్రభావం

- ట్రంప్ నాయకత్వంలో నడుస్తాం
- ఖనిజాలు అప్పగించేందుకూ సిద్ధం
- ఎక్స్‌లో జెలెన్‌స్కీ ప్రకటన
- వైట్ హౌస్‌లో వాగ్వాదంపై పశ్చాత్తాపం



ఓవల్ ఆఫీసులో జెలెన్‌స్కీ, ట్రంప్ వాగ్వాదం(ఫైల్)

వాషింగ్టన్, మార్చి 4: రష్యాతో యుద్ధంలో ఉన్న ఉక్రెయిన్‌కు గత కొన్నేళ్లుగా అందిస్తున్న సైనిక సాయాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయం తక్షణం అమల్లోకి వస్తుందని, 100 కోట్ల డాలర్లకుపైగా (రూ.8,722 కోట్లు) విలువైన ఆయుధ సామగ్రి సరఫరా మీద ప్రభావం పడుతుందని అమెరికా సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. అంతేగాక, 'ఉక్రెయిన్ సెక్యూరిటీ అసిస్టెన్స్ ఇనిషియేటివ్' కింద అమెరికా కంపెనీల నుంచి ఆయుధాలను కొనుగోలు చేయటానికి ఉక్రెయిన్‌కు అందిస్తున్న లక్షలాది డాలర్ల సాయం కూడా నిలిచిపోనుందన్నారు. జాతీయ భద్రతకు సంబంధించిన పలువురు అధికారులతో సమగ్రంగా చర్చించిన తర్వాతే అధ్యక్షుడు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రష్యాతో శాంతి చర్చలకు ఉక్రెయిన్ కట్టుబడి ఉందని ట్రంప్ నిర్ధారించుకునేంతవరకూ ఈ నిర్ణయం అమల్లో ఉంటుందన్నారు. అమెరికా అంతర్గతవ్యవహారాల శాఖ ప్రకారం.. రష్యా ఆక్రమణ మొదలైన తర్వాత 2022 ఫిబ్రవరి 24 నుంచి ఇప్పటి వరకూ ఉక్రెయిన్‌కు అమెరికా 6,590 కోట్ల డాలర్ల (రూ.5,74,811 కోట్లు) సైనిక సాయాన్ని అందించింది. ఇటీవల అమెరికాను సందర్శించిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీసులో వాగ్వాదానికి దిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే, ఉక్రెయిన్‌కు ట్రంప్ సైనికసాయాన్ని నిలిపివేయటం గమనార్హం.

ముగింపు లేని యుద్ధం కోరుకోవడం లేదు

సైనిక సాయం నిలిపివేస్తున్నట్లు అమెరికా ప్రకటించిన గంటల వ్యవధిలోనే జెలెన్‌స్కీ స్పందిస్తూ.. ఉక్రెయిన్‌లో సుస్థిర శాంతి నెలకొనేందుకు ట్రంప్ దృఢమైన నాయకత్వంలో పనిచేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. "శుక్రవారం వైట్‌హౌజ్‌లో జరిగిన మా సమావేశం అనుకున్న రీతిలో సాగలేదు. అందుకు చింతిస్తున్నా. పరిస్థితులను చక్కదిద్దాల్సిన సమయం ఆసన్నమైంది" అని పేర్కొన్నారు. "ముగింపులేని యుద్ధం కొనసాగాలని ఎవరమూ కోరుకోవడం లేదు. శాంతి కావాలని ఉక్రెయిన్లకు తప్ప ఇంకెవరికి ఉంటుంది? సుస్థిరమైన శాంతి సాధన కోసం అధ్యక్షుడు ట్రంప్ సమర్థ నాయకత్వంలో నేను, నా బృందం కలిసి నడుస్తాం" అంటూ అమెరికాకు అనుకూలంగా అభిప్రాయాలను వెల్లడించారు. తొలుత గగనతలంలో శాంతి నెలకొల్పడమే తమ లక్ష్యమని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. "యుద్ధాన్ని ముగించడం కోసం సత్వరమే ప్రయత్నాలు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నాం. ఒప్పందంలో భాగంగా తొలిదశలో ఖైదీలను విడుదల చేస్తాం. గగనతలంలో శాంతి నెలకొనేలా చూస్తాం. క్షిపణులు, దీర్ఘశ్రేణి డ్రోన్లు, ఇంధన వనరులు, పౌర సదుపాయాలపై బాంబుల ప్రయోగాన్ని నిషేధిస్తాం. తరువాత సముద్రంపై జరుగుతున్న యుద్ధానికి సంబంధించి సంధి కుదుర్చుకుంటాం. రష్యా కూడా ఇలాగే చేస్తే అనంతర దశలపై కూడా సత్వర చర్యలు తీసుకుంటాం. అమెరికాతో కలిసి పనిచేసి బలమైన తుది ఒప్పందాన్ని కుదుర్చుకుంటాం" అని వివరించారు. ఇంతవరకు అమెరికా చేసిన సహాయానికి కృతజ్ఞతలు చెబుతూ ఖనిజాల విషయమై ఒప్పందాన్ని కుదుర్చుకుంటామని తెలిపారు. "ఉక్రెయిన్ సార్వభౌమ అధికారం, స్వాతంత్ర్యం పరిరక్షణకు అమెరికా అందించిన సాయాన్ని గౌరవిస్తున్నాం" అన్నారు.

రష్యాపై అమెరికా ఆంక్షల ఎత్తివేత!

రష్యాపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని ట్రంప్ భావిస్తున్నారు. ఏయే అంశాలపై ఆంక్షలను తగ్గించవచ్చో జాబితా రూపొందించాలంటూ అధ్యక్షుడి కార్యాలయమైన శ్వేత సౌధం నుంచి ఆర్థిక శాఖకు సమాచారం అందించింది. కొన్ని వస్తువులతోపాటు, వ్యక్తులపై విధించిన ఆంక్షలను కూడా తగ్గించనుంది. ఆ దేశ ప్రభుత్వంపై ప్రభావం చూపే సంపన్నుల (కులీనులు)పై ఉన్న ఆంక్షలను కూడా ఎత్తివేసే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇందుకు ప్రతిగా ఏమి ఆశిస్తున్నారన్నది ఇంకా తెలియరాలేదు.

అమౌంట్ స్థానంలో అకౌంట్ నంబర్..

కస్టమర్ ఖాతాలోకి రూ. 52,314 కోట్లు

వాషింగ్టన్, మార్చి 4: బ్యాంకు ఉద్యోగులు చేసే చిన్న చిన్న పొరపాట్లతో ఒకరి ఖాతాలో జమవ్వాల్సిన డబ్బులు మరొకరి ఖాతాలో పడుతుంటాయి. అమెరికన్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ దిగ్గజం సిటీ గ్రూపులో కూడా ఇలాంటి పొరపాటే జరిగింది. ఏకంగా రూ. 52,314 కోట్ల నగదు పొరపాటున ఒకరి ఖాతాలోకి జమయింది. 2023 ఏప్రిల్‌లో సిటీ గ్రూపు ఉద్యోగి ఓ కస్టమర్ ఖాతాలోకి నగదు జమ చేయబోయి.. పొరపాటున అమౌంట్ స్థానంలో కస్టమర్ అకౌంట్ నంబరు కొట్టారు. దాంతో సంబంధిత కస్టమర్ ఖాతాలోకి రూ. 52,314 కోట్లు జమయ్యాయి. తర్వాత జరిగిన పొరపాటును గుర్తించి, నగదును వెనక్కు తీసుకుని హమ్మయ్య అనుకున్నారు.

సీఏ ఇంటర్ ఫలితాల్లో టాపర్‌గా హైదరాబాద్ అమ్మాయి

- 86 శాతం స్కోర్‌తో రెండో స్థానంలో నిలిచిన విజయవాడ అబ్బాయి

హైదరాబాద్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన సీఏ ఇంటర్ పరీక్షల ఫలితాల్లో హైదరాబాద్‌కు చెందిన దీపాన్షీ అగర్వాల్ జాతీయ స్థాయిలో టాపర్‌గా నిలిచారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) మంగళవారం విడుదల చేసిన ఈ ఫలితాల్లో దీపాన్షీ 86.63 శాతం స్కోర్‌తో 600 మార్కులకు 521 మార్కులు సాధించి జాతీయస్థాయిలో తొలిస్థానం సాధించి సత్తా చాటారు. విజయవాడకు చెందిన తోట సోమనాథ్ శేషాద్రి నాయుడు 86 శాతం స్కోర్‌తో రెండో స్థానంలో నిలిచారు.

ఐటీ ఎగ్గొట్టారని అనుమానం వస్తే చాలు..

మీ మెయిల్‌నూ తనిఖీ చేస్తారు

- ఐటీ అధికారులకు విస్తృత అధికారాలు
- సోషల్, ఇన్వెస్ట్‌మెంట్, ఈ మెయిల్ ఇలా ఏ ఖాతాలనైనా తనిఖీ చేసేందుకు పవర్
- కొత్త ఐటీ బిల్లులో ఈ మేరకు నిబంధనలు
- పార్లమెంటు ఆమోదిస్తే వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి కొత్త చట్టం



న్యూఢిల్లీ, మార్చి 4: మీరు ఆదాయపు పన్ను(ఐటీ)ను ఎగ్గొడుతున్నారన్న అనుమానం వస్తే చాలు.. ఐటీ అధికారులు మీ సోషల్ మీడియా ఖాతాలను, వ్యక్తిగత మెయిళ్లను, బ్యాంక్ అకౌంట్లను, ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్ ఖాతాలను తనిఖీ చేయవచ్చు. కేంద్ర క్యాబినెట్ ఇటీవల ఆమోదించిన కొత్త ఐటీ బిల్లు ఇందుకు అధికారం కల్పిస్తోంది. లెక్కల్లో చూపించని నగదు, నగలు, ఇతర విలువైన వస్తువులు, పత్రాలు మీ దగ్గర ఉన్నట్లు భావించినా కూడా అధికారులు వీటన్నింటినీ తనిఖీ చేసేలా ఈ బిల్లు విస్తృత అధికారాలను కట్టబెడుతోంది. ప్రస్తుతం అమల్లో ఉన్న ఐటీ చట్టం-1961 ప్రకారం.. ఎవరైనా పన్ను ఎగవేస్తున్నారన్న అనుమానం, సమాచారం ఉంటే వారి ఇండ్లు, ఆఫీసులు, లాకర్లు, అల్మారాల తాళాలు పగలగొట్టి సోదాలు నిర్వహించేందుకు మాత్రమే ఐటీ అధికారులకు అధికారం ఉంది. కానీ, కొత్తగా తీసుకురానున్న చట్టంలో 'వర్చువల్ డిజిటల్ స్పేస్'ను కూడా తనిఖీ చేయవచ్చని పేర్కొన్నారు. ఐటీ బిల్లులోని 247వ క్లాజులో వర్చువల్ డిజిటల్ స్పేస్ కిందకు ఏమేం వస్తాయన్న దానిపై వివరణ ఇస్తూ.. ఈ మెయిళ్లు, ట్రేడింగ్ ఖాతాలు, సోషల్ మీడియా అకౌంట్లను, క్లౌడ్ సర్వర్లను ఆ జాబితాలో చేర్చారు. అయితే, ఈ నిబంధనలపై ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. వీటి వల్ల వ్యక్తిగత గోప్యతకు భంగం కలుగుతుందన్న వాదనలున్నాయి. కొత్త ఐటీ బిల్లును ఫిబ్రవరి 7న కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది. పార్లమెంటు ఆమోదించాల్సి ఉంది. పార్లమెంటు ఆమోదించి రాష్ట్రపతి సంతకం చేస్తే ఆ బిల్లు చట్టంగా మారి వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుంది.

'జనరంజకం' ఏముంది?

- జగన్ హయాంలో అప్పుల కుప్పగా రాష్ట్రం
- కార్పొరేషన్ల మాటున రూ.లక్షల కోట్ల దొంగ అప్పులు
- పారిశ్రామిక, సేవా రంగాలూ తిరోగమనంలోనే...
- అయినా గత ఐదేళ్లలో గణనీయ ప్రగతి అంటూ బాకా
- సామాజిక ఆర్థిక సర్వేకు రోతపత్రిక సొంత భాష్యం
- వాస్తవాల నుంచి ప్రజలను ఏమార్చే ఎత్తుగడ

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సామాజిక ఆర్థిక సర్వేలో వాస్తవాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు జగన్ రోతపత్రిక విఫల యత్నం చేసింది. ప్రభుత్వం విడుదల చేసిన సర్వేలోని వివరాలనే రాస్తూ 'జగన్‌దే జనరంజక పాలన' అంటూ సంబంధం లేని శీర్షికతో ఏమార్చేందుకు ప్రయత్నించింది. గత ఐదేళ్లలో రాష్ట్రం గణనీయ ప్రగతి సాధించిందంటూ అబద్ధాల కథనాలు వండి వార్చింది. నిజంగా అంత జనరంజకమే అయితే ఇప్పుడు కూడా అధికారంలోనే ఉండేవారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. జగన్ హయాంలో చేసిన అప్పులు రూ.9.75 లక్షల కోట్లపైనే ఉంటాయని, ఇంకా తవ్వాల్సిన అప్పులు ఉన్నాయంటూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే శ్వేతపత్రం విడుదల చేసింది. అయితే, సామాజిక, ఆర్థిక సర్వేలో వెల్లడించిన అప్పుల వివరాలను మాత్రమే రోతపత్రిక ప్రామాణికంగా తీసుకుంది. ఇవి కేవలం కేంద్రం అనుమతితో ఎఫ్ఆర్‌బీఎం చట్టానికి లోబడి తెచ్చిన అప్పులు. ఇవికాకుండా కేవలం రుణాల కోసమే వైసీపీ ప్రభుత్వం కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, రూ.లక్షల కోట్ల దొంగ అప్పులు తెచ్చింది. ఆ విషయాన్ని దాచిపెట్టి, 2024 మార్చి 31నాటికి ప్రభుత్వ అప్పు రూ.4.91లక్షల కోట్లేనని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ అప్పు రూ.5.64 లక్షల కోట్లకు పెరిగిందంటూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసింది. అయితే, 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.73,000 కోట్ల అప్పులు తెస్తున్నట్టు ప్రభుత్వం బడ్జెట్‌లోనే ప్రకటించింది. వైసీపీ ప్రభుత్వం తెచ్చినట్టుగా కేంద్రం అనుమతి లేకుండా కార్పొరేషన్లను అడ్డంపెట్టుకుని దొంగ అప్పులు తేలేదు. కార్పొరేషన్ల పేరుతో అప్పులు తెచ్చి వాటిని ప్రభుత్వ అవసరాలకు వాడలేదు. జగన్ హయాంలో రాష్ట్రం నుంచి పరిశ్రమలు పారిపోవడమే తప్ప కొత్తగా ఒక్కటీ రాలేదు. పారిశ్రామిక, సేవా రంగాలు తిరోగమనంలో ఉన్నాయని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ కూడా నివేదికలు ఇచ్చింది. వ్యవసాయ రంగానికి వైసీపీ హయాంలో కేంద్రం సహకారంతో ఇచ్చి రైతుభరోసా తప్ప రైతులను ఏ రకంగానూ ఆదుకోలేదు. అయినా జగన్ హయాంలో ఆ రంగంలో వృద్ధి చూపించేవారు. అయితే, ఆ వృద్ధి మత్స్యరంగానికి సంబంధించినది. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఆ రంగంలో నిరంతరం వృద్ధి నమోదవుతూనే ఉంటుంది. గత ఐదేళ్ల నుంచీ నిత్యావసరాల ధరలు నిరంతరం పెరుగుతూనే ఉన్నాయి. సామాజిక, ఆర్థిక సర్వే నివేదిక ఇదే విషయాన్ని పేర్కొంది. అయినా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే రేట్లు పెరిగాయంటూ ప్రచారం చేయడం రోతగా ఉంది. రెవెన్యూ లోటు భారీగా పెరిగిందంటూ ఏడుపు మొదలుపెట్టారు. కానీ, జగన్ హయాంలో రెవెన్యూ లోటు రూ.48,000 కోట్లకు చేరింది. ఇప్పుడు రూ.33,000 కోట్లే. పాత అప్పులపై అసలు, వడ్డీ కలిపి ఏడాదికి రూ.60,000 కోట్లు ప్రభుత్వం చెల్లిస్తోంది. జగన్ హయాంలో ఎక్కువ వడ్డీరేట్లకి అప్పులు తేవడం వల్లే ఇప్పుడు రాష్ట్రంపై ఈ భారం పడింది. మార్కెట్లో 8శాతానికే అప్పులు దొరుకుతున్నా వైసీపీ హయాంలో 13శాతానికి పైగా వడ్డీకి అప్పులు తెచ్చారు. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం రెవెన్యూ లోటును రూ.33వేల కోట్లకే పరిమితి చేయడం ఆహ్వానించదగిన పరిణామమని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు.

దొరికిన దొంగలు!

(మొదటి పేజీ తరువాయి)

కమ్మేలా సాగిన విచ్చలవిడి ఇసుక దోపిడీ ఇది! జగన్ సర్కారు హయాంలో ఇసుక తవ్వకాల కాంట్రాక్టును జేపీ వెంచర్స్‌కు కట్టబెట్టిన సంగతి తెలిసిందే! ఆ తర్వాత... అసలు సంస్థ తెరవెనక్కు వెళ్లిపోయింది. వైసీపీ పెద్దలే రంగంలోకి దిగి... జిల్లాల వారీగా ఇసుకను తమ నేతలకు కట్టబెట్టారు. 2021లో జేపీ వెంచర్స్ తవ్వకాలు మొదలైనప్పుడే పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించారన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై గుంటూరుకు చెందిన నాగేంద్ర అనే వ్యక్తి ఎన్జీటీలో కేసులు వేశారు. ఇసుక అక్రమ తవ్వకాలు నిజమే అని ఎన్జీటీ నిర్ధారించి... జేపీ వెంచర్స్‌కు కోట్లలో జరిమానా విధించింది. తీర్పును జేపీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. జరిమానా వసూలుపై స్టే విధించినప్పటికీ... కేసు విచారణ కొనసాగుతోంది. జగన్ సీఎంగా ఉండగా ఇసుక తవ్వకాలపై గనుల శాఖ అటు ఎన్జీటీ, ఇటు సుప్రీంకోర్టుకు పదేపదే తప్పుడు నివేదికలు ఇచ్చింది.

వాస్తవాలను తవ్వి తీశారు...

కూటమి ప్రభుత్వం వచ్చాక మాత్రమే... అసలు నిజాలు బయటపడ్డాయి. జగన్ ప్రభుత్వంలో ఇసుక తవ్వకాల్లో అక్రమాలు, పర్యావరణ ఉల్లంఘన జరిగిందని 2024 ఆగస్టులో సుప్రీంకోర్టులో ప్రత్యేక అఫిడవిట్ దాఖలు చేసింది. దీంతో అక్రమ తవ్వకాలపై శాటిలైట్ ఇమేజెస్ (ఉపగ్రహ చిత్రాలు), గూగుల్ ఎర్త్ మ్యాప్స్ ఆధారంగా అధ్యయనం చేయాలని సుప్రీం కోర్టు ఏపీ సర్కారును ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఇసుక తవ్వకాలు జరిగిన రీచ్‌లపై ఆంధ్రప్రదేశ్ స్పేస్ అప్లికేషన్ సెంటర్ (ఏపీఎస్‌ఏసీ) ద్వారా గనులశాఖ అధ్యయనం చేయించింది. ఇసుక తవ్వకాలు జరిగిన నదుల పరిధిలోని 794 పాయింట్ల శాటిలైట్ చిత్రాలను ఏపీఎస్‌ఏసీ అధ్యయనం చేసింది. ఇందులో.. అనుమతించిన రీచ్‌ల పరిధిలో జరిగిన తవ్వకాలు, బయట అక్రమంగా జరిగిన తవ్వకాలు, భారీ యంత్రాలను ఉపయోగించి ఇసుక మైనింగ్ చేసిన నదీతీరాల ఫొటోలను స్పష్టంగా బయటకు తీసింది. మొత్తం 283 శాటిలైట్ చిత్రాలను విశ్లేషించి... వాస్తవాలను బయటపెట్టింది.

అంతటా అక్రమ తవ్వకమే...

కృష్ణా, గోదావరి, పెన్నా, వంశధార, నాగావళి తదితర నదుల్లో జరిగిన ఇసుక తవ్వకాలపై సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఉపగ్రహ చిత్రాల ద్వారా అధ్యయనం చేశారు. అనుమతించిన రీచ్‌లకు, అక్కడ జరిగిన తవ్వకాలకు అసలు పొంతనే లేదని నిర్ధారించారు. ఒక హెక్టారుకు అనుమతి ఇచ్చిన చోట 40 హెక్టార్ల పరిధిలో తవ్వకాలు జరిపినట్లు తేల్చారు. కృష్ణా, గోదావరి పరిధిలో... కొన్ని చోట్ల ప్రవాహ దిశలే మారేలా అక్రమ తవ్వకాలు జరిపారు. 2021 నుంచి 2024 మే వరకు... మూడేళ్ల వ్యవధిలో 794 ఇసుక తవ్వకాల పాయింట్లను ఉపగ్రహ చిత్రాల ద్వారా పరిశీలించారు. వీటిలో 85 మాత్రమే అనుమతించిన, అధికారిక రీచ్‌లు. ఈ పాయింట్ల వద్ద తీసిన ఇసుక 19.69 లక్షల టన్నులు. ఇక, నిబంధనలు ఉల్లంఘించి నదీగర్భాలను కూడా కలిపి తవ్వేసిన పాయింట్లు 709. వీటిల్లో ఏకంగా 3.91 కోట్ల టన్నుల ఇసుకను అక్రమంగా తవ్వి తరలించారు. జగన్ పాలనలో ఇసుక అమ్మకాల ద్వారా తొలి రెండేళ్లకు సర్కారుకు రూ.1500 కోట్ల ఆదాయం వచ్చిందని గొప్పగా చెప్పారు. అందులో జేపీ వెంచర్స్ ఇంకా 800 కోట్ల బకాయి ఉంది. నిబంధనలకు లోబడి 85 శాండ్ పాయింట్లలో తవ్విన ఇసుక సొమ్మును మాత్రమే ప్రభుత్వానికి ఇచ్చిందనుకుంటే.. మరి మిగిలిన 709 పాయిట్లలో తవ్వితీసిన 3.91 కోట్ల టన్నుల ఇసుక ద్వారా వచ్చిన సొమ్ము ఏమైంది? అది ఎవరి జేబుల్లోకి వెళ్లింది? ఇసుక టెండర్లు, అక్రమాలపై ఇటు సీఐడీ, అటు ఏసీబీ విచారణ చేస్తున్నాయి. అక్రమ తవ్వకాలపై సుప్రీంకోర్టులో సాగుతున్న విచారణ కోసం గనులశాఖ సమర్పించిన డాక్యుమెంట్‌పై మంగళవారం సీఎం వద్ద చర్చ జరిగినట్లు తెలిసింది.

> సగటున ఒక హెక్టారులో ఇసుక తవ్వకాలకు అనుమతి ఇస్తే... 40 హెక్టార్లలో తవ్వేశారు.
>
> అక్రమంగా, చట్టవిరుద్ధంగా, రీచ్‌ల పరిధులు దాటి తవ్వేసి తీసుకెళ్లిన ఇసుక సొమ్ము ఎంత? అది ఎవరి జేబుల్లోకి వెళ్లింది? ఇది సీఐడీ విచారణలోనే తేలాల్సి ఉంది.

అంశాలు	మొత్తం ఇసుక తవ్వకాలు జరిగిన ప్రాంతాలు	తవ్వకాలు జరిగిన విస్తీర్ణం(హెక్టార్లు)	తవ్వి తీసిన ఇసుక టన్నుల్లో
ఇసుక తవ్వకాలు జరిగిన ప్రాంతాలు	794	2743.03	4,11,45,490
తవ్వకాలకు అనుమతించిన ప్రాంతాలు	85	131.29	19,69,419
అనుమతి లేకున్నా తవ్వకాలు జరిగిన పాయింట్లు	709	2611.74	3,91,76,071



నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కల్వటాల గ్రామంలో పొలంలో బోల్తాపడ్డ ఆర్టీసీ బస్సు

సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్!

- ఆర్టీసీ బస్సు బోల్తా.. 16 మందికి గాయాలు
- నంద్యాల జిల్లాలో ఘటన

కొలిమిగుండ్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కల్వటాల గ్రామ సమీపంలో మంగళవారం ఆర్టీసీ అద్దె బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో మొత్తం 16 మందికి గాయాలు కాగా, నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. డ్రైవర్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడమే ప్రమాదానికి కారణమని బస్సులోని ప్రయాణికులు ఆరోపించారు. కడప జిల్లా జమ్మలమడుగు డిపోకు చెందిన ఏపీ 39 యూవీ 4299 నంబరు గల ఆర్టీసీ బస్సు 34 మంది ప్రయాణికులతో కొలిమిగుండ్ల మీదుగా అనంతపురం జిల్లా తాడిపత్రికి బయల్దేరింది. కొలిమిగుండ్ల మండలం కల్వటాల సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కనే పదడుగుల లోతున ఉన్న పొలంలోకి దూసుకెళ్లింది. దీంతో ఒక్కసారిగా ప్రయాణికులు హాహాకారాలు చేశారు. పక్కనే పొలాల్లో పనిచేస్తున్న కూలీలతో పాటు, అదే రహదారిలో వెళ్తున్న వారు అప్రమత్తమై బస్సు అద్దాలను పగలగొట్టి ప్రయాణికులను సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు. నందిపాడుకు చెందిన సుబ్బలక్ష్మమ్మ, రామలక్ష్మమ్మ, డ్రైవర్ మహబూబ్ బాషా, మరో మహిళకు తీవ్ర గాయాలు కాగా, మరో 12 మందికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను కొలిమిగుండ్ల ప్రభుత్వ వైద్యశాలకు, అక్కడి నుంచి 11 మందిని మెరుగైన వైద్యం కోసం అవుకు క్లస్టర్ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన సుబ్బలక్ష్మమ్మ, రామలక్ష్మమ్మలను కర్నూలు జీజీహెచ్‌కు తరలించినట్లు కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు తెలిపారు. ఘటనపై రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డితో పాటు, రవాణా శాఖ మంత్రి మండిపల్లి ప్రసాద్‌రెడ్డి ఆరాతీశారు. స్థానిక ఆర్టీసీ అధికారులతో పాటు వైద్యాధికారులతో మాట్లాడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మంత్రులు పోలీసులను ఆదేశించారు.

కియ కార్ల రవాణా కోసం గూడ్స్ రైలు ప్రారంభం



డబుల్ డెక్కర్ గూడ్స్ రైలును ప్రారంభిస్తున్న రైల్వే అధికారులు, కియ ప్రతినిధులు

పెనుకొండ రూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కియ కార్లను రవాణా చేసేందుకు శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ రైల్వే స్టేషన్‌లో గూడ్స్ రైలును కియ ప్రతినిధులు, రైల్వే అధికారులు మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కియ ఇండియా సీనియర్ వైస్ ప్రిసిడెంట్, సేల్స్ అండ్ మార్కెటింగ్ హెడ్ హర్దీప్ సింగ్ బ్రార్ మాట్లాడుతూ ఆటోమొబైల్ రంగంలో దిగ్గజమైన కియ పరిశ్రమ నుంచి ఇతర రాష్ట్రాలకు ఎస్‌యూవీ కార్లను తరలించడానికి డబుల్ డెక్కర్ గూడ్స్ రైలును ప్రారంభించామని తెలిపారు. ఈ డబుల్ డెక్కర్ గూడ్స్ రైలులో ఒక్కసారికి 264 కార్లను తరలించగలమని తెలిపారు.

జగన్‌కు బుద్ధి రావాలని దేవుడిని ప్రార్థించా

- కేఏ పాల్

విశాఖపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి బుద్ధి రావాలని దేవుడిని ప్రార్థించానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కేఏ పాల్ చెప్పారు. విశాఖలోని కేఏ పాల్ ఫంక్షన్ హాలులో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...జగన్ అసెంబ్లీకి వెళ్లాలని, ప్రజల సమస్యలపై పోరాటం చేయాలని దేవుడిని కోరానన్నారు. రెడ్‌బుక్ ప్రకారం చూసుకుంటే త్వరలో కొడాలి నాని, రోజాలను అరెస్టు చేస్తారన్నారు. బూతులు తిట్టిన వారిపై కేసులు పెట్టి లోపల వేస్తున్నారన్నారు. జగన్‌ను కూడా అరెస్టు చేసి లోపల వేసే అవకాశం ఉందన్నారు.

శ్రీవారి ఆలయాల కోసం స్థలం ఇవ్వండి

- అన్ని రాష్ట్రాల సీఎంలకు టీటీడీ చైర్మన్ లేఖ

తిరుమల, మార్చి4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయం నిర్మాణానికి ఉచితంగా స్థలం కేటాయించాలని కోరుతూ అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు లేఖలు రాశారు. 'దేశాభివృద్ధిలో టెంపుల్ టూరిజం ప్రత్యేక పాత్ర పోషిస్తుంది. మన సంస్కృతి, వారసత్వ పరిరక్షణకు దేవాలయాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి' అంటూ లేఖలో పేర్కొన్నారు.

అలిపిరి నడకదారిలో చిరుత

తిరుమల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల అలిపిరి కాలినడక మార్గంలో చిరుత సంచారం మరోసారి కలకలం సృష్టించింది. గాలిగోపురం వద్ద తెల్లవారు జామున 1.09 గంటల సమయంలో ఓ దుకాణానికి సమీపంలో పిల్లిని నోట కరుచుకుని అడవిలోకి పరుగులు తీసింది. సీసీ కెమెరాలో ఈ దృశ్యాలు కనిపించాయి. అధికారులు ఘటనా ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు.



సీసీ కెమెరాలో రికార్డయిన చిరుత

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బిహార్‌లో ఎన్నికల వేడి

బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌కు మా చెడ్డ కోపం వచ్చింది. మీ నాన్నను రాజకీయాల్లోకి తెచ్చిందీ, ఉద్ధరించిందీ నేనే, నాముందా నీ కుప్పిగంతులు అంటూ లాలూ యాదవ్ కుమారుడిమీద మంగళవారం అసెంబ్లీలో వీరంగం వేశారు. ఆదాయం ఆవగింజంత పెరగకున్నా, బడ్జెట్‌ని మాత్రం భారీగా వండేస్తున్నారని విమర్శిస్తూ తన తండ్రి ఏలుబడిలో రాష్ట్రం వెలిగిందనీ, ఇప్పుడన్నీ గారడీలేనని ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్ వ్యాఖ్యానించడంతో నితీశ్ కోపం నసాళానికి అంటింది. మీ నాన్నను తయారుచేసిందీ, పెంచిందీ నేను.. మీ నాన్న ఏలుబడిలో అసలేం ఉంది, అంతా చీకటి, సాయంత్రమైతే బయటకు రావడానికి జనం జడుసుకొనేవారు, అప్పుడు నువ్వు పిల్లాడివి, పోయి ఆ జనాన్ని అడుగు నిజాలు తెలుస్తాయి అని నితీశ్ ఆగ్రహించారు. లాలూ సొంతకులానికి చెందినవారే ఆయన ఎదుగుదలను వ్యతిరేకిస్తుంటే, తాను మాత్రం ఆయనను పైకి తీసుకొచ్చానని నితీశ్ చెప్పుకొచ్చారు. మరో తొమ్మిదినెలల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందున రాబోయే రోజుల్లో ఇటువంటి దృశ్యాలు చాలా చూడాల్సి ఉంటుంది.

లాలూ ఏలుబడిలో బిహార్‌లో ఆటవిక రాజ్యం కొనసాగిందని నితీశ్‌తో పాటు, ప్రధాని నరేంద్రమోదీ కూడా ఆ రాష్ట్ర ప్రజలకు గుర్తుచేశారు. పది రోజుల క్రితం ఆయన బిహార్‌లో చేసిన పర్యటనతో ఎన్నికల ప్రచారం మొదలు పెట్టేసినట్టుగా కనిపించింది. అన్నదాతలకు పెట్టుబడిసాయం అందించే పీఎం కిసాన్ పథకం 19వ విడత నిధుల విడుదల కార్యక్రమానికి ప్రధాని బిహార్‌లోని భాగల్పూర్‌ను ఎంచుకున్నారు. నిధుల విడుదలతో పాటుగా, లాలూ కుటుంబాన్ని పేరెత్తకుండా విమర్శించారు. పశువుల దాణాను బుక్కేసినవారికి రైతు సంక్షేమం పట్టదన్నారు. కుంభమేళా మీద లాలూ ప్రసాద్ చేసిన విమర్శలను ప్రత్యేకంగా ప్రస్తావించి, జంగల్‌రాజ్‌ను నమ్ముకున్నవారు మన ఘనమైన వారసత్వాన్ని, విశ్వాసాలను అవమానిస్తారంటూ విరుచుకుపడ్డారు. మహాశివరాత్రికి రెండురోజుల ముందు జరిగిన ఈ సదస్సులో మహాకుంభ్‌ను అవమానించినవారిని రాష్ట్రప్రజలు కఠినంగా శిక్షించాలని కూడా మోదీ పిలుపునిచ్చారు. యూపీ మాదిరిగా బిహార్‌లో మతరాజకీయాలు చెల్లవన్నది అందరూ నమ్ముతున్నమాట. ఈ భాగల్పూర్ నుంచే మూడునెలల క్రితం కేంద్రమంత్రి హిందూ స్వాభిమాన్ యాత్ర చేస్తే జనం పెద్ద పట్టించుకోలేదు. అయినప్పటికీ, ఘనమైన రామమందిర నిర్మాణాన్ని జీర్ణించుకోలేనివారు మహాకుంభ్‌ని ఆడిపోసుకుంటున్నారని, ప్రజలే వీరిని శిక్షించాలని మతాన్ని సమపాళ్ళలో మేళవిస్తూ మోదీ చేసిన ఈ వ్యాఖ్య కచ్చితంగా హిందూ ఓబీసీలను, మహిళలను తాకుతుందని బీజేపీ నాయకుల ఆశ. రాబోయే రోజుల్లో బిహార్‌లో బీజేపీ సాగించబోయే ఎన్నికల ప్రచారం ఏ విధంగా ఉండబోతున్నదో ఊహించుకోవచ్చు.

ముఖ్యమంత్రి ఎవరో ముందుగా చెప్పకుండా, మోదీ మొఖాన్ని ముందుపెట్టుకొని ఎన్నికల ప్రచారం సాగించే సంప్రదాయానికి కూడా ఈ మారు తెరపడింది. కేంద్రంలో తమకు వెన్నుదన్నుగా ఉన్న నితీశ్‌నే ముఖ్యమంత్రి అభ్యర్థిగా తేల్చిచెప్పి, బీజేపీ ఆయన వెంటే నడుస్తోంది. నితీశ్ ఇటీవల చేపట్టిన మంత్రివర్గ విస్తరణలో మొత్తం ఏడుగురినీ బీజేపీ నుంచే చేర్చుకున్నారు. దీనితో 36మంది మంత్రుల్లో నితీశ్ సహా జేడీయూకు చెందినవారు 13మంది ఉంటే, బీజేపీ నుంచి ఎనిమిది మంది అధికం. బీజేపీతో మరింత బలమైన బంధానికి ఇది నిదర్శనమని, రెట్టించిన ఉత్సాహంతో ఎన్నికల ప్రచారానికి దిగబోతున్నామని జేడీయూ నాయకులు చెప్పుకుంటున్నారు. ఐదేళ్ళనాటి అసెంబ్లీ ఎన్నికల్లో 115 స్థానాల్లో పోటీచేసిన జేడీయూ 43 మాత్రమే గెలుచుకుంటే, 110కి 74నెగ్గి బీజేపీ మంచి స్కోర్‌నీ, రన్‌రేట్‌నీ సాధించింది. దీనితో నాలుగు దశాబ్దాల తరువాత బీజేపీ పెద్దన్న స్థానాన్ని ఆక్రమించి నితీశ్‌కు ఆశీస్సులు అందించింది. ఆయననే కుర్చీలో కొనసాగనిచ్చి కొత్త సమస్యలు రాకుండా జాగ్రత్తపడింది. ఈ సమయాన్ని బీజేపీ ఎంతో చక్కగా వినియోగించుకొని బిహార్‌లో మరింతగా విస్తరించిందని అంటారు. మహారాష్ట్రలో చిన్న భాగస్వామిగా ఉంటూ గుట్టుచప్పుడు కాకుండా ఎదిగి అంతిమంగా శివసేనను మింగేసిన వైనం తెలిసిందే. కానీ, ఆరునూరైనా కుర్చీనుంచి దిగకుండా ఉండటం కోసం ఇప్పటికే పలుమార్లు బీజేపీ, ఆర్జేడీలను అటూ ఇటూ మార్చిన నితీశ్ ప్రస్తుతానికి చేయగలిగింది కూడా ఏమీ లేదు. తొమ్మిదిసార్లు సీఎం అయినా ఒక్కసారి కూడా నేరుగా ప్రజలనుంచి నెగ్గలేదంటూ ఆయనను పల్టూరామ్‌గా హేళన చేసిన ఆర్జేడీ నాయకుడు సునీల్‌కుమార్‌సింగ్‌ను శాసనమండలి బహిష్కరించడం, సుప్రీంకోర్టు ఆయనను తిరిగి సభలోకి అనుమతించడం తెలిసిందే. ప్రజలు ఈ మారు ఆయనను బాహుబలినే చేస్తారో, మరింత బలహీనపరుస్తారో చూడాలి.

ఉత్తరప్రదేశ్ యువతి షహేజాదీ వలే గల్ఫ్ నాట కొందరు తెలుగు మహిళలూ తీవ్ర అభియోగాలు ఎదుర్కొన్నారు. వారికి ఎలాంటి న్యాయ సహాయం అందలేదు. అసలు మరణ శిక్షను ఎదుర్కొనే వారికి కనీస న్యాయ సహాయం లేదా మార్గదర్శకం చేసే వ్యవస్థ భారతీయ ఎంబసీలలో లేదు. షహేజాదీ ఉదంతంతో తెలుగు రాష్ట్రాలు అప్రమత్తం కావల్సిన అవశ్యకత ఉంది.

షహేజాదీలు ఎందరో!

వెలిగిపోతూ వికసిస్తున్న నవ భారతదేశంలో ఉపాధి లేమితో ఏ రకంగానైనా విదేశీగడ్డకు వెళ్ళి తామూ అభ్యున్నతి సాధించాలని ఆరాటపడుతున్న యువజనులకు కొదవలేదు, ఈ విషయంలో యువతులు, యువకులు అనే తేడా లేదు. ఈ క్రమంలో కొందరు అమెరికాకు వెళ్ళి చేతులు, కాళ్ళకు బేడీలతో తిరిగి వస్తుండగా మరి కొందరు ఎడారి దేశాలలో దీనంగా దినాలు గడుపుతున్నారు. ఈ అభాగ్య భారతీయుల గురించి మన పాలకులు పెద్దగా పట్టించుకున్న సందర్భాలు లేవు. తాజాగా ఎడారినాట ఒక భారతీయ మహిళకు అమలుపరిచిన మరణ శిక్ష ఉదంతమే అందుకు నిదర్శనం.


పరాయి గడ్డపై ఒక భారతీయ వనిత మరో తోటి భారతీయ వనిత క్రూర మరణానికి కారణం కాగా క్షేత్రస్థాయిలో సామరస్య

గల్ఫ్ లేఖ

పూర్వకంగా ఈ విపత్కర పరిస్థితిని పరిష్కరించవల్సిన సమాజం ఫేస్ బుక్‌కు మాత్రమే పరిమితమై మిన్నకుండిపోయింది! గ్రామ పంచాయితీ స్థాయి నుంచి రాష్ట్రపతి భవన్ దాకా ఆ నిర్భాగ్య ప్రవాస భారతీయురాలి తల్లిదండ్రులు తమ కుమార్తెను రక్షించుకునేందుకు చేసిన ప్రయత్నాలు వ్యర్థమయ్యాయి.. వారి రోదనలు అరణ్యరోదనలయ్యాయి. సమాజం చూపిన ఉపేక్ష మరణాన్ని మించిన బాధకరమైన అనుభవం. పైగా తోటి భారతీయుల కారణాన ఆ దీన ప్రవాసురాలు ప్రాణాలు కోల్పోవడం మరింత బాధాకరం.

గల్ఫ్ దేశాలలో ఖద్దమా లేదా సేవకురాలు అనే ఉద్యోగం చేయడానికి ప్రతి రోజూ కొన్ని వందల మంది భారతదేశం నుండి వస్తుంటారు. ఈ వచ్చేవారిలో అత్యధికులు పేదరికం నుంచి బయట పడి తమ కుటుంబాలకు బంగారు భవిష్యత్తునివ్వాలని స్వప్నించే వారే. ఈ రకంగా వచ్చే వారిలో అత్యధికులు ఆంధ్రప్రదేశ్, తమిళ నాడు రాష్ట్రాలకు చెందినవారే ఉండడం కద్దు. ఉత్తరాది నుండి వచ్చే వారు బహు అరుదు.

నాలుగేళ్ళ క్రితం ఉత్తరప్రదేశ్ నుండి 30 ఏళ్ళ షహేజాదీ అనే యువతి యునైటెడ్ అరబ్ ఏమిరేట్స్‌కు ఒక లక్ష్యంతో వచ్చింది, బాల్యంలో ప్రమాదవశాత్తు పడిన వేడి నీళ్ళ కారణాన చర్మం కాలిపోయి ముఖంపై శాశ్వత మచ్చలు మిగిలిపోవడంతో, వాటిని తొలగించుకునేందుకు అవసరమైన ప్లాస్టిక్ సర్జరీ చేయించుకోవాలని ఆమె నిర్ణయించుకుంది. అయితే ఆ వైద్యం చేయించుకునేందుకు కావాల్సిన డబ్బును సంపాదించుకునేందుకే అమె ఆ గల్ఫ్ దేశానికి వచ్చింది. అయితే విధి వంచితురాలు అయింది. తోటి భారతీయులు అందునా



తోటి రాష్ట్రీయులు, పైగా తనను సిఫార్సు చేసిన వ్యక్తి కరోనా మహమ్మారిలో పేదలకు అన్నదానం చేసిన వాడు కావడంతో అమె ఎక్కడా ఏ కోశాన కూడ సంకోచించకుండా ఎడారి బాట పట్టింది. ఆగ్రాకు చెందిన విద్యాధికుల కుటుంబీకురాలు పైగా ఆబుధాబి విశ్వవిద్యాలయంలో ఆచార్యురాలు తన కాబోయే యాజమానురాలు కావడంతో షహేజాదీ తన భవిష్యత్తు అంతా సవ్యమని భావించింది.

షహేజాది వచ్చిన తర్వాత మాత్రమే ఆమె యాజమానురాలు గర్భం దాల్చి 2022 ఆగస్టులో మగ బిడ్డకు జన్మనిచ్చింది. అప్పటి వరకు తల్లి కావడాన్ని ఆ విద్యాధికురాలు వాయిదా వేసుకున్న విషయం ఇక్కడ గమనార్హం. తన ఉద్యోగం సక్రమంగా చేయకుండా వేతనం విషయమై కక్షపూరితంగా వ్యవహరించి షహేజాది తన బిడ్డకు ఊపిరాడకుండా చేసి తన చిన్నారి మరణానికి కారణమయిందని పోలీసులకు ఆ యాజమానురాలు ఫిర్యాదు చేసింది. విచారణ జరిపిన న్యాయస్థానం అందుబాటులో ఉన్న సాక్ష్యాధారాల ప్రాతిపదికన అమెను దోషిగా నిర్ధారిస్తూ 2023 జూలై 31న తీర్పు ఇచ్చింది. ఏడాదిన్నర కాలంగా షహేజాది తండ్రి పోలీసులు, పార్లమెంటు సభ్యులు, మంత్రులు, స్థానిక కోర్టులు, హై కోర్టులు, ప్రధానమంత్రి, చివరకు రాష్ట్రపతి వరకు ప్రతి ఒక్కరి వద్దకు వెళ్లి తమకు న్యాయ సహాయం చేయవల్సిందిగా అభ్యర్థించారు. చివరకు డిల్లీ హైకోర్టులో ఆమె తండ్రి వేసిన పిటిషన్‌కు సమాధానంగా అమెను కాల్చి చంపి మరణ శిక్షను అమలు చేసినట్లుగా యు.ఏ.ఇ అధికారులు తమకు ఫిబ్రవరి 28న సమాచారం అందించారని ఎమిరేట్స్‌లోని భారతీయ ఎంబసీ పేర్కొంది.

ఇదే ఆబుధాబి ఏమిరేట్ పరిధిలో రెండు దశాబ్దల క్రితం ఫిలిప్పీన్స్ జాతీయురాలయిన సారా బాల్బగస్‌కు స్థానిక ఇమరాతీ జాతీయుడయిన తన యాజమానిని 34సార్లు దారుణంగా కత్తితో పొడిచి హత్య చేసినందుకు మరణ శిక్ష విధించారు. ఫిలిప్పీన్స్ ప్రభుత్వం చాకచక్యంగా అమె మరణ శిక్షను హతుడి కుటుంబం చేత రద్దు చేయించి రాజీ చేయించి స్వల్ప జైలు శిక్ష అనంతరం అమెను విడిపించుకుని తన దేశానికి తీసుకుని వెళ్ళింది. ఈ రకమైన ఉద్యోగాలకు పెద్ద సంఖ్యలో తమ మహిళలను పంపించే ఫిలిప్పీన్స్‌తో పాటు శ్రీలంక, ఇండోనేషియా దేశాలు ఇటువంటి కేసులలో గల్ఫ్ దేశాలలోని షరియా చట్టాలకు అనుగుణంగా తమ జాతీయులకు న్యాయ సహాయం అందిస్తూ అండగా నిలుస్తుంటాయి. అయితే ఇక్కడి అటువంటి అభాగ్య భారతీయులకు అటువంటి అండ అందని చందమామే!

ఉన్నత స్థాయి పర్యటనలు, పెట్టుబడులు, యోగా తరగతులు అంటూ మురిసిపోయే మనం.. మనకు అత్యంత సన్నిహిత దేశంలో మన జాతీయురాలికి మరణ శిక్ష అమలు చేసిన తర్వాత కూడ ఆ విషయం తెలుసుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్నాము. అదే రాజకీయ అవసరాల కొరకు, విదేశాలలో శవాల నుండి రక్త పరీక్ష నమూనాలను గంటలలో సేకరించడంలో చూపే ఆసక్తిలో ఏ కొంచెమైనా షహేజాదీ లాంటి అభాగ్యురాళ్ళ విషయంలో చూపితే బాగుండేది.

షహేజాదీ ఎదుర్కొన్నటువంటి అభియోగాలను గల్ఫ్ నాట కొందరు తెలుగు మహిళలూ ఎదుర్కొన్నారు. అయితే వారికి సైతం ఎలాంటి న్యాయ సహాయం అందలేదు. అసలు మరణ శిక్షను ఎదుర్కొనే వారికి కనీస న్యాయ సహాయం లేదా మార్గదర్శకం చేసే వ్యవస్థ భారతీయ ఎంబసీలలో లేదు. షహేజాదీ ఉదంతంతో తెలుగు రాష్ట్రాలు అప్రమత్తం కావల్సిన అవశ్యకత ఉంది.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

సైద్ధాంతిక స్పష్టతే బీజేపీ బలం



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'ఏమండీ, మనం కూడా కుంభమేళాకు ఎందుకు పోకూడదు...' అని ఇటీవల ఒక ప్రముఖ ప్రగతిశీలవాదిగా గుర్తింపు పొందిన ప్రొఫెసర్‌ను ఉదయాన్నే డైనింగ్ టేబుల్ వద్ద ఆయన సతీమణి అడిగారట. 'ఏముంది అక్కడ, మురికి నీళ్లు, జనం చచ్చిపోతున్నారు.' అని అయన జవాబిచ్చారు. 'మీకేం తెలుసండీ.. అన్ని కోట్ల మంది ప్రజలు అక్కడకు వెళుతున్నారంటే వారు పిచ్చివాళ్లనా మీ అభిప్రాయం? దేశ సంప్రదాయాలను వ్యతిరేకించే వారి దుష్ప్రచారానికి మీరు లోనవుతున్నారు..' అని భార్య విసురుగా వంటింట్లోకి వెళ్లిపోయిందట. ఈ విషయం ఆయనే చెప్పారు. 'మా ఇంట్లో కూడా హిందూత్వవాదులు ప్రవేశించారు. నేనేమి చేయను?' అని ఆ ఆచార్యులవారు వాపోయారు. కుంభమేళాకు వచ్చిన అనేకమంది ప్రముఖులు అక్కడ చేరిన కోట్లాది ప్రజల మధ్య తాము పొందిన అవస్థల గురించి చెప్పారు. ఘాట్ 14 కిమీ దూరంలో ఉన్నప్పటికీ కేంద్ర సాహిత్య అకాడమీ ఉపాధ్యక్షురాలు దాదాపు 14 గంటలు కారులోనే గడపాల్సి వచ్చిందట. ఆఖరుకు అల్పాహారం చేసేందుకు కూడా గంటసేపు లైనులో నిలుచోవాల్సి వచ్చింది. ఢిల్లీలో తొక్కిసలాట జరిగిన తర్వాత ప్రయాగ్‌రాజ్ రైల్వే స్టేషన్‌ను కొద్ది రోజుల పాటు మూసివేయాల్సి వచ్చింది.


భారతదేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితి ఇది. కుంభమేళాపై వ్యతిరేక వ్యాఖ్యలు చేసినవారు హిందూ మతాన్ని ద్వేషిస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్రంగా విమర్శించారు. భారతదేశ మత వారసత్వ సంపదను తక్కువ అంచనా వేసేవారు బానిసమనస్తత్వంతో ఉన్నారని ఆయన అన్నారు. ప్రధాని ఈ వ్యాఖ్యలు చేసిన క్షణాల్లోనే దేశంలో కోట్లాది వాట్సాప్ గ్రూపుల్లో ఆయన వీడియోలు ప్రత్యక్షమయ్యాయి. కొన్ని లెఫ్టిస్టు గ్రూపులను మినహాయిస్తే ఇవాళ ఏ వాట్సాప్ గ్రూప్ చూసినా సగానికిపైగా భారతదేశంలో హిందూమత గొప్పతనాన్ని వివరించే సందేశాలు కనపడుతున్నాయి. ప్రజల సామూహిక చేతనలో మతం ఇంత గణనీయమైన పాత్ర వహించడం గతంలో ఎప్పుడూ లేదు.

ఈ పరిణామాల్ని విస్మరించగలమా? అసలు ఎందుకు విస్మరించాలి? పోనీ ఈ పరిణామాల్ని ఏ రకంగా విశ్లేషించాలి? భారతీయ జనతా పార్టీ రాజకీయంగా విస్తరించే ముందు సామాజికంగా విస్తరిస్తోందన్న విషయంలో సందేహం లేదు. సమాజంలో ఉవ్వెత్తున ఒక ఊపును నిర్మించిన తర్వాత దాన్ని రాజకీయంగా సంఘటితం చేసుకునేందుకు బీజేపీకి అవకాశాలు లభిస్తున్నాయి. ఢిల్లీ ఎన్నికల్లో విజయం తర్వాత ఇక 'బెంగాల్ కీ బారీ..' అని ఆ పార్టీ నేతలు వెంటనే ప్రకటించారు. మరో ఏడాదిలో ఎన్నికలు జరిగే బిహార్, పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి, కేరళ, తమిళనాడులలో తమ పార్టీని విస్తరించేందుకు బీజేపీ ఎప్పుడో సన్నాహాలు ప్రారంభించింది. అస్సాంలో బీజేపీకి ఇప్పటికే ప్రభుత్వం ఉన్నది. బెంగాల్‌లో 2021 ఎన్నికల్లో బీజేపీ ప్రధాన ప్రతిపక్షంగా మారింది. బీజేపీకి, తృణమూల్‌కు కేవలం 3 శాతం ఓట్ల తేడా మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ ఫలితాలు బెంగాల్‌లో పునరావృతం అయినా ఆశ్చర్యం లేదు. బిహార్‌లో ఈ ఏడాది ఆఖరులో తనంతట తాను మెజారిటీ సీట్లు సాధించేందుకు బీజేపీ తప్పనిసరిగా ప్రయత్నిస్తుంది. హరియాణా, మహారాష్ట్ర, ఢిల్లీ ఎన్నికల్లో సాధించిన ఫలితాల ఊపు రాబోయే ప్రతి రాష్ట్రంలోనూ బీజేపీ కొనసాగించేందుకు శాయశక్తులా కృషి చేస్తుందనడంలో సందేహం లేదు.

రాజకీయంగా బీజేపీని ఎదుర్కోవడమే వివిధ రాజకీయ పక్షాల లక్ష్యం. అందుకు అనేక రాజకీయ వ్యూహాలు పన్నేందుకు అవి సిద్ధంగానే ఉన్నాయి. కాని బీజేపీ, దానికి మద్దతునిచ్చే వందలాది సంస్థలు సమాజంలో నిర్మిస్తున్న మతపరమైన భావోద్వేగాలను ఎదుర్కోవడం అంత సులభం కాదు. బీజేపీని సకల విపక్షాల నేతలతో పాటు వామపక్ష మేధావులూ రకరకాలుగా విమర్శిస్తూనే ఉన్నారు. కార్పొరేట్ల అనుకూల పార్టీ అని, రాజ్యాంగ సంస్థల్ని ధ్వంసం చేస్తోందని, ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తోందని, నిరుద్యోగాన్ని, పెరుగుతున్న ధరలను అరికట్టలేకపోతోందని ఎన్నో విమర్శలు గుప్పిస్తూనే ఉన్నాయి. రోజుకు వందలాది సెమినార్లు, సభలు జరుగుతూనే ఉన్నాయి. కాని ఈ సభల్లో పాల్గొనే వారెవరూ విస్తరిస్తోన్న బీజేపీ ప్రభావాన్ని అరికట్టలేకపోతున్నారు. బీజేపీని అత్యధికంగా విమర్శించిన రాష్ట్రాల్లోనే ఆ పార్టీ ఓట్ల శాతాన్ని పెంచుకుంటోంది. అందుకు కారణం బీజేపీ, దాని అనుబంధ సంస్థలు, అభిమాన సంస్థల ప్రచారం ముందు బీజేపీ వ్యతిరేకులు చేస్తున్న ప్రచారం వెలవెలబోవడమే.

సీపీఐ(ఎం) పశ్చిమ బెంగాల్, త్రిపుర రాష్ట్రాల్లో ఓడిపోయిన తర్వాత భారతదేశంలో ఆ పార్టీ భవిష్యత్ అగమ్యగోచర పరిస్థితిలో పడిందని అనేకమంది మేధావులు అంచనా వేశారు. ప్రజల నుంచి ఆ పార్టీ దూరమైందని, తన రాజకీయ అజెండాపై ఆత్మవిమర్శ చేసుకోవాలని ఆ పార్టీ సానుభూతిపరులైనవారే విశ్లేషించారు. విచిత్రమేమంటే బెంగాల్‌లో గత 14 ఏళ్లలో సీపీఎం తన పునాదిని రోజురోజుకూ కోల్పోవడమే కాక బీజేపీ విస్తరణను అడ్డుకోలేకపోయింది. ఇప్పుడు వచ్చే ఏడాది కేరళ అసెంబ్లీ ఎన్నికలలో మూడోసారి ఆ పార్టీ అధికారంలోకి రాలేకపోతే దేశవ్యాప్తంగా అస్తిత్వ సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. అస్తిత్వ సంక్షోభం అనేది సీపీఎంకే కాదు, రకరకాల రూపాల్లో ఉన్న వామపక్ష శక్తులన్నిటికీ ఇప్పుడు ఏర్పడుతున్న సవాలు. తాము ఎంత ప్రచారం చేసినా, ఎన్ని సభలు నిర్వహించినా, ఎన్ని పుస్తకాలు రాసినా ప్రజలు తమకు అనుకూలంగా ఎందుకు స్పందించడం లేదు అని ఈ శక్తులు ఒక్కసారి స్వేచ్ఛగా చర్చించుకున్నా వారికి జవాబు వచ్చేదేమో. కాని వీరెవరూ తమది తప్పుడు పంథా అని, తాము క్షీణిస్తున్నామని, తమ మూలంగా యువత త్యాగాలు వృథా అవుతున్నాయని ఆత్మవిమర్శ చేసుకునేందుకు బహిరంగంగా సిద్ధం కావడం లేదు. పైగా బీజేపీ, మోదీపై కురిపిస్తున్న తిట్ల వర్షం వారికే నష్టం చేకూరుస్తోంది.

తమ అస్తిత్వ సంక్షోభం వల్ల ఏర్పడిన అయోమయం వారి సిద్ధాంతీకరణల్లో కూడా కనిపిస్తోంది. బీజేపీని, మోదీని ఇంతకాలం వామపక్షాలు ఫాసిస్టు శక్తులుగా అభివర్ణించాయి. తాజాగా సీపీఎం పోలిట్ బ్యూరో సమన్వయకర్త, మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కారత్ బీజేపీని తాను ఫాసిస్టు అని కానీ, నయా ఫాసిస్టు అని కానీ అనడం లేదని, అయితే నయా ఫాసిస్టు మార్గంలో బీజేపీ పయనిస్తోందని విశ్లేషించారు. అదే పార్టీ ముసాయిదా తీర్మానంలో ప్రతిఫలించింది. విచిత్రమేమంటే మూడేళ్ల క్రితం 2022లో ఆమోదించిన రాజకీయ తీర్మానంలో కూడా బీజేపీ స్పష్టంగా ఫాసిస్టు



ఒక సైద్ధాంతిక పార్టీగా అస్తిత్వాన్ని, కాంగ్రెస్ 1970ల తరువాత కోల్పోవడం ప్రారంభమయింది. బీజేపీకి సైద్ధాంతిక ప్రత్యామ్నాయంగా ఎందుకు మారాలో కాంగ్రెస్ స్పష్టమైన అవగాహన ఏర్పర్చుకోనంత వరకూ ఆ పార్టీ అడుగులు తడబడుతూనే ఉంటాయి. సిద్ధాంతం ప్రజలలో పట్టుబిగించనంతవరకూ అది భౌతికశక్తిగా మారదని, భౌతికశక్తిని భౌతిక శక్తే తొలగించగలదని కారల్ మార్క్స్ 'క్రిటిక్ అఫ్ హెగెల్ ఫిలాసఫీ'లో చెప్పిన విషయం బీజేపీకి అర్థం అయినంత బాగా ఈ దేశంలో మరే పార్టీకి అర్థం కావడం లేదు.

సంస్థ అని సీపీఎం విమర్శించింది. ఇటీవల మరణించిన పార్టీ ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి కూడా తన 'ఐడియా ఆఫ్ ఇండియా' అన్న వ్యాసంలో భారతదేశంలో ఫాసిస్టు శక్తుల మతతత్వ అజెండా గురించి విశ్లేషించారు. సీపీఐ, సీపీఐ(ఎంఎల్) ఇప్పటికే బీజేపీని ఫాసిస్టు శక్తిగా అభివర్ణించాయి. కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ మోదీని ఫాసిస్టు అని అనేకసార్లు ప్రకటించారు.

మోదీ ఫాసిస్టా, నయా ఫాసిస్టా లేక ఫాసిస్టు అయ్యే క్రమంలో ఉన్నారా, హిట్లర్, ముస్సోలినీ కంటే మోదీ భిన్నమైన వ్యక్తా అన్న చర్చ జరగడమే ఒక అసంబద్ధంగా అనిపిస్తోంది. మోదీని, బీజేపీని ఎదుర్కొనే ప్రత్యామ్నాయ సామాజిక సిద్ధాంతాలు లేనప్పుడు అవతలి సంస్థలను, వ్యక్తులను ఏదో ఒక పేరుతో విమర్శించడం, లేదా సిద్ధాంతీకరణ చేయడం వల్ల ప్రయోజనం ఏమిటి? సీతారాం ఏచూరి దేశంలో దేశభక్తి గల అన్ని ప్రజాస్వామిక శక్తులు ఐక్యమయి బీజేపీని అధికారం నుంచి తొలగించడం గురించి రాశారు. కాని కనీసం వామపక్ష శక్తులైనా సిద్ధాంతాల అయోమయం లేకుండా కలిసి పనిచేసే అవకాశాలున్నాయా? ఇక మిగతా శక్తులు కలిసి పనిచేసేందుకు మోదీ వ్యతిరేక ఎజెండా తప్ప వాటిని ఐక్యంగా బంధించే సామాజిక సిద్ధాంతం అంటూ ఏమైనా ఉన్నదా?

ఇవాళ దేశంలో బీజేపీ ఒక్కటే స్పష్టమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ సైద్ధాంతిక లక్ష్యంతో అడుగులు ముందుకు వేస్తున్నట్లు కనిపిస్తోంది. ప్రతిపక్షాలను హిందూమత విద్వేషకులన్నా, అర్బన్ నక్సల్స్ అన్నా మోదీకి ఒక సైద్ధాంతిక స్పష్టత ఉన్నది. అదే సమయంలో సంఘ్ పరివార్ శక్తులు ఒక స్పష్టమైన అవగాహనతో పనిచేస్తున్నాయి. ప్రజల్లోకి భావోద్వేగాలు చొచ్చుకుపోతున్నాయి. కుంభమేళా వంటి కార్యక్రమాలు ప్రజలను స్వచ్ఛందంగా హిందూత్వ భావజాలం దిశగా ఆకర్షితులను చేస్తున్నాయి. దేశ భక్తినీ, భారతదేశ ఆధ్యాత్మిక, సాంస్కృతిక చరిత్ర పట్ల గౌరవాన్ని పెంపొందించే దిశగా కళారూపాలు తయారవుతున్నాయి. ఆ రకమైన సినిమాలు హిట్ అవుతున్నాయి. వాటిలో సహేతుకతను ప్రశ్నించినవారే ఆత్మరక్షణలో పడాల్సి వస్తోంది. రాజకీయ ప్రయోజనాలకోసమైనా హిందూత్వను ఆమోదించినట్లు ప్రదర్శించేవారు అంతటా కనపడుతున్నారు. ఇది గత పదేళ్లపై నుంచి మోదీ ప్రభుత్వం అధికారంలో ఉన్నందువల్ల సాధించిన విజయం అని చెప్పక తప్పదు.


స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న చరిత్ర గల కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొన్నేళ్ల వరకూ ఆ స్ఫూర్తిని కొనసాగించింది. కాని ఆ ప్రభావాన్ని ఎక్కువ కాలం కొనసాగించడంలో విఫలమైంది. వెనుకబడిన వర్గాలకోసం, దళితుల కోసం ఏర్పడ్డాయనుకున్న సమాజ్‌వాదీ పార్టీ, బహుజన సమాజ్ పార్టీలు తమ లక్ష్యాలకు దూరమయ్యాయి. ఒక సైద్ధాంతిక పార్టీగా అస్తిత్వాన్ని, తన సంప్రదాయ ఓటు బ్యాంక్‌ను కాంగ్రెస్ 1970ల తరువాత కోల్పోవడం ప్రారంభమయింది. ఇవాళ ఆ పార్టీ నేత రాహుల్‌గాంధీ కులగణన, రాజ్యాంగం, బడుగు బలహీన వర్గాల గురించి మాట్లాడుతున్నారు. ఒక సైద్ధాంతిక పార్టీగా కాంగ్రెస్‌కు పూర్వ వైభవాన్ని కల్పించే కృషి ఉధృతంగా జరగాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. తాము బీజేపీకి ప్రత్యామ్నాయంగా ఎందుకు మారాలో కాంగ్రెస్ స్పష్టమైన అవగాహన ఏర్పర్చుకోనంత వరకూ ఆ పార్టీ తడబడుతూ అడుగులు వేస్తూనే ఉంటుంది. సిద్ధాంతం ప్రజలలో పట్టు బిగించనంతవరకూ అది భౌతిక శక్తిగా మారదని, భౌతికశక్తిని భౌతికశక్తే తొలగించగలదని కారల్ మార్క్స్ 'క్రిటిక్ అఫ్ హెగెల్ ఫిలాసఫీ'లో చెప్పిన విషయం బీజేపీకి అర్థం అయినంత బాగా ఈ దేశంలో మరే పార్టీకి అర్థం కావడం లేదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ప్రపంచ చరిత్ర.. మరొక్కసారి!

ప్రజాప్రతినిధులైన వాళ్ళు పాలనలోని నియమ నిబంధనలు తెలుసుకోకుండా రాష్ట్ర, దేశ, ప్రపంచ స్థితిగతులు, మానవ అభివృద్ధి పరిణామం చరిత్ర గురించి అవగాహన లేకుండా ఉండటం సిగ్గుపడే అంశమని నా అభిప్రాయం. నా వరకు నేను కొద్దో గొప్పో చదువుకుని మంచి కుటుంబ నేపథ్యంలో వ్యక్తిగా ఉండి, చెడు అనిపించుకోకపోయినా... మరొక విషయంలో మాత్రం నేను లోపభూయిష్టుడుగా భావించేవాడిని. అది ఏమంటే.. చరిత్ర, పాలనలకు సంబంధించిన విషయం గురించి అవగాహన లేకపోవడం... ఇవి తెలియని వ్యక్తి ప్రజాప్రతినిధిగా ఉండటానికి ఎంత మాత్రం అర్హుడు కాడనేది నా అభిప్రాయం. ఈ విషయాలన్నీ దృష్టిలో ఉంచుకుని నాలాగా ఎంతోమంది ప్రజాప్రతినిధులు చరిత్ర చదవకుండా, చరిత్ర తెలియకుండా, రాజకీయాల్లో ఉన్న విషయాన్ని గమనించి ముందు నన్ను నేను ప్రక్షాళన చేసుకుని జ్ఞానవంతుడు అవ్వటం నా బాధ్యత అని భావించాను. అందుచేత 1983లో నేను మొట్టమొదటిసారిగా శాసనసభ్యుడిని అయినప్పటి నుంచి పుస్తకాలు ముఖ్యంగా చరిత్ర, దేశాల పాలనలు, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ప్రముఖుల జీవిత చరిత్రలు సేకరించేవాడిని. కానీ నాకున్న సమయాభావం వల్ల వాటిని క్షుణ్ణంగా చదివే అవకాశం లేకపోయింది. వీలైనప్పుడల్లా ఆ పుస్తకాలు చదువుతూ కొంతమేర అవగాహన ఏర్పరచుకొన్నాను. నేను తెలుసుకొన్న విషయాలు నాలాంటి వారికి, ఇతరులకు అందుబాటులోకి తెస్తే మంచిది అన్న అభిప్రాయం కలిగి, 2009 నుంచి రచనలు ప్రారంభించాను.

నాలాగా ఎంతోమంది ప్రజాప్రతినిధులు చరిత్ర చదవకుండా రాజకీయాల్లో ఉన్న విషయాన్ని గమనించి, ముందు నన్ను నేను ప్రక్షాళన చేసుకుని జ్ఞానవంతుడు కావటం నా బాధ్యత అని భావించాను. నేను తెలుసుకొన్న విషయాలు నాలాంటి వారికి, ఇతరులకు అందుబాటులోకి తెస్తే మంచిది అన్న అభిప్రాయం కలిగి, 2009 నుంచి రచనలు ప్రారంభించాను.



నేను స్వయంగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత జరిగిన పరిణామాలను 'ఒక చరిత్ర – కొన్ని నిజాలు' అనే నామకరణంతో నా మొదటి రచన చేశాను. దీనిని పాఠకులు బాగా ఆదరించారు.

తరువాత 2014లో ఆంధ్ర రాష్ట్ర విభజన జరిగి తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలుగా ఏర్పడిన సందర్భంలో అసలు తెలుగు వారు ఎప్పటివారు, పాలకులు ఎవరు అని, భిన్న రాష్ట్రాలుగా, భిన్న ప్రాంతాలుగా పరిపాలన సాగిన విషయాన్ని ప్రజాప్రతినిధులకు, పాఠకులకు వీలైనంత క్లుప్తంగా తెలియజేయాలని ఈ రచన కొనసాగించాను 'తెలుగువారి చరిత్ర.. వేర్పాటువాదం' అనే పేరుతో. ఇది కూడా పాఠకుల మన్ననలు పొందింది.

ఇక మూడవది 'ప్రపంచతత్త్వం–నాయకత్వం' చరిత్రలో... క్రీ.పూ. 500 సంవత్సరాల నుంచి క్రీ.శ. 2000 సంవత్సరాల వరకు కాలంలో తత్త్వవేత్తలు, ప్రజానాయకులు అనేక దేశాల ఆవిర్భావాలకు, ఆయా దేశాల ప్రగతికి కారణభూతులయ్యారు. వారిలో 50 మందిని ఎంచుకుని క్లుప్తంగా వారి చరిత్ర గురించి పుస్తక రచన కొనసాగించగా, పాఠకుల ఆదరణకు నోచుకుంది.

తరువాత నాలుగవ రచనగా 'ప్రపంచ దేశాలు పాలనా వ్యవస్థలు' అనే పేరుతో ప్రపంచంలో ఉన్న అనేక రకాలైన పరిపాలన వ్యవస్థలను ఒకేచోటుకు చేర్చి క్లుప్తంగా రచించగా, ప్రజాపాలనలో ఉన్నవారికి ఎంతో ఉపయోగపడింది.

ఇకపోతే ప్రస్తుత రచన 'ప్రపంచ చరిత్ర' ఆది నుంచి నేటి వరకు వచ్చేటప్పటికి...

ఈ గ్రంథంలో చెప్పిన విషయాలు ఇంతకు ముందు అనేక మంది పెద్దలు గ్రంథస్థం చేసినవే. నేను కొత్తగా ఏమీ సృష్టించలేదు. కొత్త కోణం కూడా కాదు. కాకపోతే అనేక రచనలుగా ఉన్న ప్రపంచ చరిత్రలోని అనేక భాగాలైన... భూమి, నీరు ఎలా ఏర్పడ్డాయి దగ్గర నుంచి, ఖగోళం, రాతియుగం, జీవి పుట్టుక, ఆదిమానవుడు, ప్రాచీన నాగరికతలు, రోమ్, గ్రీక్ సంస్కృతులు, వివిధ మతాల ఆవిర్భావం, మతకలహాలు, రాజ్యాలు ఏర్పడటం, అవి పతనమవటం, రాజ్యపాలనలు, సాంస్కృతిక పునరుజ్జీవనం, పారిశ్రామిక విప్లవం, ఫ్రెంచ్, రష్యా ఇతర విప్లవాలు, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, వలస రాజ్యాలు, ప్రపంచ యుద్ధాలు, రష్యా, అమెరికా వైరాలు, వివిధ దేశాల స్వాతంత్ర్య పోరాటాలు, సాంస్కృతిక- సైన్సు ఆవిష్కరణలు, భారత్ చైనా లాంటి దేశాల చరిత్ర, ఇంకా అనేకం కలిపి ఇందులో క్లుప్తంగా క్రోడీకరించాను. చివరిగా కరోనా గురించి, భవిష్యత్ దర్శినిని కూడా చేర్చి ముగించాను.

వేటికి వాటిగా ప్రత్యేక రచనలుగా ఉన్న విభిన్న అంశాలను ఒకచోట చేర్చడం ఈ రచనలోని ప్రధాన అంశం. దీనితోబాటు గత రెండు వందల సంవత్సరాల్లో జరిగిన సాంస్కృతిక విజ్ఞాన ఆవిష్కరణలయిన అచ్చుయంత్రం, ఆవిరియంత్రం, కరెంటు, రేడియో, మోటార్ కారు, రైలు, విమానం, టెలిఫోన్, కంప్యూటర్, టీవీ, సెల్ ఫోన్ వంటి వాటి వివరాలు చెప్పుకున్నాం. ఎక్కడో దేశాంతరంలో ఉన్న వారితో ఫోన్‌లో చూస్తూ మాట్లాడటం, ఇంటి నుంచే పాఠాలు, ఉద్యోగం, వ్యాపారం చేయటం ప్రపంచ సమాచారాన్ని మొత్తం గూగుల్ ద్వారా చిటికెలో అందుబాటులోకి తెచ్చుకోవడం, వైద్య రంగంలో అనేక ఆవిష్కరణలు, వ్యాధి నివారణలో అత్యాధునిక విజ్ఞానం అందుబాటులోకి వచ్చాయి. వందలకొద్దీ శాటిలైట్లను అంతరిక్షంలోకి పంపి కొత్త చరిత్ర సృష్టించబడింది. ఇవన్నీ మన కళ్లముందు మనం జీవించిన కాలంలో ఆవిష్కరించబడ్డ అద్భుతాలయితే, వీటిలో కొన్నింటిని దార్శనికులు కొంతమంది ముందే ఊహించారు. హెచ్.జి వెల్స్ అనే మేధావి 19వ శతాబ్దంలో ఊహించి తన రచనలలో కొన్ని ఊహతో జరిగే పరిణామాలను పొందుపరచగా, 20వ శతాబ్దంలో చాలావరకు అవి నిజమయ్యాయి.

■ డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు

డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు రచించిన 'ప్రపంచ చరిత్ర (ఆదినుండి నేటివరకు– ఆ తరువాత)' పుస్తకంలోని 'నామాట' నుంచి కొన్ని భాగాలు ఇవి. గ్రంథావిష్కరణ కార్యక్రమం రేపు ఉదయం 10.30 గంటలకు విశాఖపట్నంలోని గీతం యూనివర్సిటీ ఆడిటోరియంలో జరుగుతుంది. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముఖ్య అతిథి. మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు తెలుగు పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు, ఇంగ్లిష్ అనువాదం 'ద గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ'ని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఆవిష్కరిస్తారు. పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

ఆందోళన అర్థవంతమే!

నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాలు నష్టపోవచ్చుననే భయం అర్థరహితం కాదు, సహేతుకమే. నష్టపోతారని ఎవరూ భయపడనక్కరలేదంటూ, పార్లమెంటులో ఈ రాష్ట్రాలు ఏ మాత్రం సీట్లు కోల్పోవడం జరగదని ఈ మధ్య తమిళనాడులో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ పద్ధతిలో, ఇలా చేయొచ్చు అని చూచాయగానైనా ఆయన, కేంద్ర ప్రభుత్వం వివరిస్తే తప్ప, ఈ ఆందోళన సమసిపోదు. దానికి ముఖ్య కారణం ఇప్పుడు అమల్లో ఉన్న ఏ విధానం తీసుకున్నా, ఫలితాలు వ్యతిరేకంగానే వస్తాయి.

వాస్తవానికి పదేళ్లకోసారి జరిగే ప్రతీ జనాభా లెక్కల తర్వాత పార్లమెంటు స్థానాల డీలిమిటేషన్ ప్రక్రియ జరగాలి. కానీ మూడుసార్లు మాత్రమే జరిగాయి. కారణం జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచినప్పుడు, జనాభా నియంత్రణ చక్కగా అమలుపరిచిన రాష్ట్రాలు నష్టపోతున్నాయి. అలా జరగరాదని 1971 జనాభా లెక్కల ప్రకారమే సంఖ్య నిర్ధారించి, 2026 వరకూ పెంచకుండా పార్లమెంటులో రాజ్యాంగ సవరణ ద్వారా ఫ్రీజ్ చేశారు. 2026 తర్వాత వచ్చే జనాభా లెక్కల ప్రాతిపదికన కొత్తగా డీలిమిటేషన్ జరగాల్సి ఉంది. అది 2031 సెన్సస్‌కి వర్తించాల్సింది. కానీ 2021లో కరోనా కారణంగా వాయిదా పడిన లెక్కలు 2026కి అందుబాటులోకి వస్తాయి కనుక, అవే తాజా ప్రాతిపదిక అవుతాయి. పార్లమెంటు ద్వారా ఏర్పడబోయే డీలిమిటేషన్ కమిషన్ వాటినే గమనంలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

ఇక్కడ సమస్య ఏమిటంటే ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా విపరీతంగా పెరిగి, దక్షిణాది రాష్ట్రాల్లో తక్కువ పెరిగింది. పార్లమెంటు సీట్లను అలాగే 543గానే ఉంచి, నియోజకవర్గాలను జనాభా నిష్పత్తి ప్రకారం మారిస్తే తమిళనాడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కేరళ చెరో ఎనిమిదేసి సీట్ల చొప్పున కోల్పోతాయి. అలా కాకుండా ఇంత జనాభాకు ఒక నియోజకవర్గం అంటూ మొత్తం సీట్లను 840కి పైగా పెంచాల్సి వస్తే, దక్షిణాది రాష్ట్రాలకు పది చొప్పున పెరిగితే, ఉత్తరప్రదేశ్‌కు ఏకంగా 65 పెరుగుతాయి. ఏ రకంగా చూసినా నష్టమే కనబడుతున్నది. కాబట్టి కేంద్రం, పార్లమెంటు ఈ అసమానతలు లేకుండా మార్గాంతరం చూడాలి. వీలైతే సీట్ల పెంపుదలపై ఫ్రీజింగ్ కొనసాగించి, రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్లు పెంచుకోవాలి. అప్పుడు కూడా రాజ్యసభకి రాష్ట్రాల ప్రాతినిధ్యంలో అసమానతలు ఏర్పడకుండా చూడాలి. సామాజిక న్యాయం, ప్రాంతాల ప్రాతినిధ్యం సరిగ్గా ఉన్నప్పుడే ప్రజాస్వామ్యానికి అందం, బలం.

— డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ



గుంటూరులోని కౌంటింగ్ కేంద్రం వద్ద విజయ చిహ్నాన్ని చూపిస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ (ఇన్‌సెట్‌లో) నగరంలోని వన్‌టౌన్‌లో స్వీట్లు తినిపించుకుంటున్న టీడీపీ శ్రేణులు

ఆలపాటి

ఘన విజయం

'కూటమి'కే జైకొట్టిన కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రులు

- కేఎస్ లక్ష్మణరావుపై 82,230 ఓట్లతో గెలుపు
- మొత్తం సాధించిన ఓట్లు 1,45,057
- ఉమ్మడి కృష్ణాలోనూ తిరుగులేని ఆధిక్యత
- రాజధాని ప్రాంతం అభివృద్ధికే యువత మొగ్గు

కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపర్చిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయభేరి మోగించారు. సమీప ప్రత్యర్థి, పీడీఎఫ్ బలపర్చిన అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుపై 82,230 ఓట్ల మెజారిటీ సాధించారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలోనూ తిరుగులేని ఆధిక్యత ప్రదర్శించారు. అమరావతి రాజధాని ప్రాంతం అభివృద్ధికే యువత మొగ్గుచూపినట్టు ఈ ఫలితాలు రుజువు చేశాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆద్యంతం కూటమి బలపర్చిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ హవానే కొనసాగింది. తొలి రౌండ్ నుంచే ఆధిక్యం ప్రదర్శించిన ఆయన 82,230 ఓట్ల మెజారిటీతో సమీప ప్రత్యర్థి, పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుపై తిరుగులేని విజయం సొంతం చేసుకున్నారు. ప్రతి రౌండ్‌లోనూ భారీ మెజారిటీని సాధించారు. ఆలపాటి ఘన విజయంతో ఉమ్మడి కృష్ణాజిల్లాలో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి.

వ్యూహాత్మకంగా అడుగులు

అమరావతి రాజధాని ప్రాంతంలో జరుగుతున్న అత్యంత ప్రతిష్ఠాత్మక ఎన్నికలు కావటంతో కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. విజయమే లక్ష్యంగా శ్రేణులకు దిశానిర్దేశం చేసింది. అందుకు అనుగుణంగానే క్షేత్ర స్థాయిలో నేతలు, కార్యకర్తలు పనిచేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచే టీడీపీ అధిష్ఠానం తమ నాయకులను అప్రమత్తం చేసింది. ప్రధానంగా ప్రజా ప్రతినిధులపై కీలక బాధ్యతలను పెట్టింది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నామినేటెడ్ పదవులు పొందిన వారు ఇలా ప్రతి ఒక్కరికీ ఆయా ప్రాంతాల్లో బాధ్యతలు అప్పగిస్తూ భాగస్వాములను చేసింది. జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో పార్టీ నాయకత్వానికి పోల్ మేనేజ్‌మెంట్ బాధ్యతలను అప్పగించింది. నూరు శాతం పార్టీకి చెందిన వారి ఓట్లు పడేలా చర్యలు తీసుకుంది. పట్టభద్ర ఓటర్లను చేర్పించటంలోనూ టీడీపీ శ్రేణులు విజయవంతమయ్యాయి. ఓట్లను చేర్పించటం ఒక ఎత్తు అయితే నూటికి నూరు శాతం ఓట్లు వేయించగలిగేలా పోల్ మేనేజ్‌మెంట్‌ను చాలా చక్కగా నిర్వహించింది. మంత్రి నారా లోకేశ్ వార్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. వార్ రూమ్ ద్వారా లోకేశ్ ఎంతో పకడ్బందీగా పోల్ మేనేజ్‌మెంట్‌ను నిర్వహించారు. దీంతో కూటమి శ్రేణుల ప్రతి ఓటు నమోదైంది.

మిగతా 6లో..

స్కార్పియో బీభత్సం

- వేగంగా వచ్చి బీఆర్‌టీఎస్ రోడ్డులో నిద్రపోతున్న వారిపైకి..
- ఇద్దరికి తీవ్ర గాయాలు, మరో ఇద్దరికి స్వల్పంగా..
- ఎస్ఎన్ పురం పీఎస్‌లో కేసు నమోదు

8లో

కనకదుర్గమ్మకు కానుకల ఆదాయం రూ.4 కోట్లు

- 26 రోజులకు దుర్గగుడి హుండీల లెక్కింపు


6లో

సహజ సాగుతో మానవ మనుగడ

ఖరీఫ్ వర్క్‌షాప్‌లో కలెక్టర్ లక్ష్మీశ

6లో

రంజాన్ వేళలు



ఇఫ్తార్ (సాయంత్రం) : 6-15 (బుధ)
సహర్ (ఉదయం) : 5-11 (గురు)

● ఆటల్లోనూ 'రాణి'స్తాం..



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్జీవో రాష్ట్ర మహిళా విభాగం ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ స్టేడియంలో మంగళవారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఉద్యోగులు ఆటపాటల్లో మునిగితేలారు.

6లో

జోరుగా బెట్టింగ్

- ఇండియా-ఆస్ట్రేలియా మ్యాచ్‌కు భారీగా..
- హైదరాబాద్ నుంచి నడుపుతున్న బుకీలు
- అనుచరుల ద్వారా కార్యకలాపాలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : క్రికెట్ బుకీలు మళ్లీ పురివిప్పారు. నగరంలోని ఓ బుకీ సంపూర్ణంగా ఈ వ్యవహారాలు నడిపిస్తున్నాడు. ప్రస్తుతం వరల్డ్ చాంపియన్ ట్రోఫీ జరుగుతున్న నేపథ్యంలో జోరుగా బెట్టింగ్‌లు జోరందుకున్నాయి. మంగళవారం ఇండియా, ఆస్ట్రేలియా మధ్య జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో ఉమ్మడి కృష్ణాజిల్లాలో భారీ సంఖ్యలో బెట్టింగ్ డెన్‌లు నిర్వహించినట్టు తెలిసింది. శివారు ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ఇళ్లలో, లాడ్జీల్లో ఈ బెట్టింగ్ జరిగిందని సమాచారం. సత్యనారాయణపురంలో ఓ ప్రముఖ బుకీ కనుసన్నల్లో జోరుగా బెట్టింగ్‌లు జరిగాయని తెలిసింది. ఇంతముందు పోలీసులు కొంతమంది బుకీలను అరెస్టు చేశారు. ప్రధాన బుకీలు మాత్రం మూడో కంటికి తెలియకుండా రహస్య ప్రదేశాల్లో తలదాచుకుంటున్నారు. అక్కడి నుంచే

మిగతా 6లో..

మెట్రోకు భూమి సేకరించండి

కలెక్టర్ లక్ష్మీశకు ప్రభుత్వ ఆదేశాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ మెట్రో ప్రాజెక్టు మొదటి దశ పనులకు అవసరమైన భూములను తక్షణం సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం కలెక్టర్ లక్ష్మీశను ఆదేశించింది. ఫేజ్-1లో గన్నవరం నుంచి ఎన్‌హెచ్-16 మీదుగా రామవరప్పాడు రింగ్ రోడ్డు, ఏలూరు రోడ్డు మీదుగా రైల్వేస్టేషన్, పీఎన్‌బీఎస్ వరకు మెట్రో స్టేషన్లకు, పీఎన్‌బీఎస్ దగ్గర ప్రధాన స్టేషన్‌కు, కేసరపల్లిలో కోచ్ డిపోలకు 100 ఎకరాల భూములు అవసరమని ఇంతకుముందు ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. దీనిపై ప్రభుత్వం ఇంతకుముందే భూ సేకరణకు సంబంధించి చర్యలు తీసుకోవాలని మౌఖిక ఆదేశాలు ఇచ్చింది. ఆ తర్వాత ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ (ఏపీఎంఆర్‌సీఎల్) ఎండీ ఎన్‌పీ రామకృష్ణారెడ్డితో కలెక్టర్ లక్ష్మీశ భేటీ అయ్యారు. భూ సేకరణ ఎంతమేర చేయాలో తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం

మిగతా 6లో..

ఐటీ రిటర్న్



బెజవాడకు మళ్లీ ఐటీ కంపెనీల రాక

ఐటీ రంగానికి పూర్వవైభవం వస్తోంది. ఐదేళ్ల వైసీపీ పాలన ముగియడంతో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉమ్మడి కృష్ణాజిల్లా కేంద్రంగా అంకుర సంస్థలు ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నాయి. రాష్ట్ర విభజన అనంతరం టీడీపీ హయాంలో ఓ వెలుగు వెలిగిన ఐటీ రంగం ఇన్నాళ్లకు కూటమి ప్రభుత్వంలో మళ్లీ ఊపిరిపోసుకుంటోంది. కొంతకాలంగా ఐటీ అనుబంధ రంగాలకు చెందిన ప్రతినిధులు తరచూ హైదరాబాద్ నుంచి విజయవాడ వస్తున్నారు. ఐటీ పరిశ్రమల ప్రోత్సాహం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇన్సెంటివ్‌లను పునరుద్ధరించడంతో కంపెనీలు మొదలుపెట్టేందుకు పలు సంస్థలు అడుగులు వేస్తున్నాయి.

- ఎస్‌టీపీఐ ఇంక్యుబేషన్ సెంటర్‌కు సాఫ్ట్‌వేర్ సంస్థల క్యూ
- సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఐటీ సంస్థలే ఎక్కువగా..
- విన్‌సిటీని సిద్ధం చేస్తున్న ఎస్‌టీపీఐ అధికారులు
- వైసీపీ హయాంలో తరలిపోయిన కీలక పరిశ్రమలు
- ఖాళీగా మేథ టవర్, నగరంలోని ఐటీ కాంప్లెక్స్‌లు
- కూటమి ప్రభుత్వం రాకతో పూర్వవైభవం
- ఇన్సెంటివ్‌ల పునరుద్ధరణకు బడ్జెట్‌లో కేటాయింపులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడతో పాటు ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలోని పలు ప్రాంతాల్లో ఐటీ పరిశ్రమల స్థాపన కోసం అడుగులు పడుతున్నాయి. హైదరాబాద్ నుంచి అనేకమంది సాఫ్ట్‌వేర్ ప్రతినిధులు విజయవాడలోని సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) దగ్గరకు వచ్చి ఇంక్యుబేషన్ సెంటర్‌లో ఉన్న అవకాశాల గురించి తెలుసుకుంటున్నారు. దీంతో విన్‌సిటీ నిర్వాహకులు కూడా ఐటీ పరిశ్రమలకు వీలుగా టవర్‌లో సౌకర్యాలను సిద్ధం చేస్తున్నారు. అలాగే, దాదాపు ఖాళీ అయిన కేసరపల్లిలోని మేథ టవర్, నగరంలో అపార్ట్‌మెంట్స్ వంటి వాటిని కూడా ఔత్సాహికులు పరిశీలిస్తున్నారు. ఐటీ పరిశ్రమలకు ఎంతమేర స్పేస్ ఉందన్న వివరాలు తెలుసుకుంటున్నారు.

రారండోయ్ విన్‌సిటీకి..

విన్‌సిటీ టవర్ స్టార్టప్స్ (అంకుర సంస్థలు)కు స్వాగతం పలుకుతోంది. సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ పార్క్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) అనేది కేంద్ర ఐటీ మంత్రిత్వశాఖ పరిధిలో పనిచేసే సంస్థ. ఈ ఎస్‌టీపీఐ నేతృత్వంలోని ఇంక్యుబేషన్ కేంద్రాలు అంకుర సంస్థలతో పాటు ఇప్పటికే ఏర్పాటైన ఐటీ కంపెనీలకు కూడా స్పేస్‌ను ఇస్తున్నాయి. నగరంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఎస్‌టీపీఐకి చెందిన ఇంక్యుబేషన్ సెంటర్ ఉంది. పాత ఇంక్యుబేషన్ సెంటర్‌తో పాటు 2015లో ఏర్పాటుచేసిన విన్‌సిటీ టవర్ కూడా స్టార్టప్స్‌కు ఆహ్వానం పలుకుతోంది. ప్రస్తుతం విజయవాడలోని ఎస్‌టీపీఐ ఇంక్యుబేషన్ సెంటర్‌లోని పాత క్యాంపస్‌లో అద్దె ప్రాతిపదికన (షేర్ ఇట్ స్పేస్) టేబుల్ స్పేస్ ఇస్తున్నారు. ఒక టేబుల్, సౌకర్యవంతమైన కుర్చీ, కంప్యూటర్, నిరంతరాయ విద్యుత్, యూపీఎస్, సెంట్రలైజ్డ్ ఏసీ, వేగవంతమైన ఇంటర్నెట్‌ను కల్పిస్తున్నారు. ఒకటి, రెండు, మూడు.. ఇలా స్టార్టప్స్ అవసరాలను బట్టి స్పేస్‌ను ఇస్తారు. ఇదే ప్రాంగణంలో ఏర్పాటుచేసిన నూతన

మిగతా 6లో..

7న పవన్ గన్నవరం రాక

6లో



హుండీలలో కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

కనకదుర్గమ్మకు కానుకల ఆదాయం

రూ.4,07,39,829

ఇంద్రకీలాద్రి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గా మల్లేశ్వర దేవస్థానంలో మహామండపంలో మంగళవారం కానుకల లెక్కింపులో 26రోజులకుగాను రూ.4,07,39,829లు నగదు రూపంలో సమకూరింది. 700 గ్రాముల బంగారం, 6,550 గ్రాముల వెండి లభించాయి. ఆన్‌లైన్ ద్వారా ఈ-హుండీలో 26 రోజులకు గాను రూ.2,81,386లు వచ్చాయి. ఆలయ ఈవో కె.రామచంద్ర మోహన్, ఉప కార్యనిర్వహణాధికారి ఎం.రత్నరాజు లెక్కింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. దేవదాయ శాఖ సిబ్బంది, వన్‌టౌన్ పోలీసులు, ఎస్‌పిఎఫ్ పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులతో ప్రమాణం చేయిస్తున్న కమిషనర్ కన్నబాబు

కార్మికుల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

» సీఆర్‌డీఏలో జాతీయ భద్రతా వారోత్సవాలు

కలెక్టరేట్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : 54వ జాతీయ భద్రతా వారోత్సవాలు విజయవాడలోని ఏపీ సీఆర్‌డీఏ ఆఫీసులో కమిషనర్ కె.కన్నబాబు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ విభాగం నిర్వహిస్తున్న భద్రత, ఆరోగ్య వారోత్సవాల పతాకాన్ని అదనపు కమిషనర్లు మల్లారపు నవీన్, సూర్యసాయి ప్రవీణ్ చంద్ ఆఫీసు ఆవరణలో ఎగురవేశారు. అనంతరం ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మల్లారపు నవీన్ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో అమరావతి నగర నిర్మాణం కోసం వేలాది మంది కార్మికులు వలస వస్తారని వారికి సంబంధించిన భద్రత, ఆరోగ్యం సీఆర్‌డీఏ బాధ్యత అని గుర్తుచేశారు. మరో అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ మాట్లాడుతూ, నేడు చాలాచోట్ల పరిశ్రమల్లో అనేక ప్రమదాలు జరుగుతున్నాయని, అందుకు సరైన అవగాహన, జాగ్రత్త లేకపోవడమే కారణమన్నారు. సీఆర్‌డీఏ ఇంజినీరింగ్ సిబ్బందికి సీపీఆర్, ఫస్ట్ ఎయిడ్ వంటి వాటిపై అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వారంరోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో సిబ్బంది కోసం క్విజ్, ఎమర్జెన్సీ మాక్ డ్రిల్ వంటివి నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సీఆర్‌డీఏ ఓఎం వల్లభనేని శ్రీనివాస్, జాయింట్ డైరక్టర్లు అజయ్, రామరాజు, లేబర్ అసిస్టెంట్ కమిషనర్ చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణ తేజ, కలెక్టర్ బాలాజీ

7న పవన్ గన్నవరం రాక

» స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్ ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం

గన్నవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్‌లో స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్‌ను ఈనెల 7న ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధిశాఖ మంత్రి పవన్ కళ్యాణ్ లాంఛనంగా ప్రారంభిస్తారని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్, డైరెక్టర్ ఎం.కృష్ణతేజ, తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు, జేసీ గీతాంజలిశర్మ తదితరులతో కలిసి పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణాన్ని సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న వెబ్‌సైట్ ప్రారంభోత్సవానికి సంబంధిత అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో పూర్తిచేసిన రహదారులు, గోకులాలు, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, పొడి, తడి చెత్త, సంపద తయారీ కేంద్రాలు, ఇ-చేస్ట్, స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమాల ప్రదర్శన ఏర్పాటు చేయాలని సూచించారు. జడ్పీ సీఈవో కె.కన్నమ్మనాయుడు, గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రమణ్యం, డీపీవో జె.అరుణ, డ్వామా పీడీ శివప్రసాద్, తహసీల్ధారు కేవీ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

14న ఏకసభ్య కమిషన్ తిరుపతికి రాక

» తొక్కిసలాట ఘటనపై ఆ 16 మందిని రెండోసారి విచారించనున్న జస్టిస్ సత్యనారాయణమూర్తి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి బైరాగిపట్టెడ వద్ద జనవరి 8న జరిగిన తొక్కిసలాటపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ సత్యనారాయణమూర్తి ఏకసభ్య న్యాయ విచారణ కమిషన్ ఈ నెల 14న 3వ దశ విచారణ చేపట్టడానికి తిరుపతికి రానున్నట్టు తెలిసింది. ఆ తొక్కిసలాట ఘటనలో ఆరుగురు మృతిచెందగా, 44 మంది గాయపడిన విషయం విదితమే. ఇందులో 40 మందికిపైగా బాధిత కుటుంబాలను వర్చువల్ విధానంలో జస్టిస్ సత్యనారాయణమూర్తి విచారించారు. వైజాగ్, తమిళనాడు, అన్నమయ్య జిల్లాలకు చెందిన 16మంది తొక్కిసలాటలో గాయపడిన బాధితులు మాత్రం టీటీడీ, పోలీసుశాఖ సమన్వయం లేకనే తొక్కిసలాట జరిగిందని, వారి నిర్లక్ష్యం కారణంగా తీవ్రంగా గాయపడ్డామని కమిషన్ దృష్టికి వర్చువల్ విధానంలో తీసుకువచ్చారు. ఈ క్రమంలో ఈ నెల 18నుంచి మూడు రోజుల పాటు ఆ 16మందిని తిరుపతి కలెక్టరేట్‌లో విచారణకు హాజరు కావాలని ఏకసభ్య న్యాయవిచారణ కమిషన్ మంగళవారం నోటీసులు పంపించారు. ఆ 16మంది మళ్లీ ఇచ్చే వాంగ్మూలమే తొక్కిసలాట ఘటనలో అత్యంత కీలకం కానుంది. 17న కలెక్టర్ వెంకటేశ్వర్, టీటీడీ ఈవో శ్యామలరావు, తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజును విచారించనున్నారు. పూర్తి స్థాయి రికార్డులను తీసుకురావాలని కమిషన్ ఇప్పటికే వారికి నోటీసులు జారీ చేసింది.

సీఏ ఇంటర్‌లో విజయవాడ విద్యార్థి ప్రతిభ

ఆంధ్రజ్యోతి, విజయవాడ : ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అక్కౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) సీఏ ఇంటర్ పరీక్షలలో విజయవాడకు చెందిన తోట సోమనాథ్ శేషాద్రి నాయుడు జాతీయస్థాయిలో రెండో ర్యాంకు సాధించాడు. హైదరాబాద్‌కు చెందిన దీపాన్షి అగర్వాల్ 86.63 శాతం మార్కులతో మొదటి స్థానంలో నిలిచింది. విజయవాడకు చెందిన తోట సోమనాథ్ శేషాద్రినాయుడు 86శాతం మార్కులు సాధించాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సర్థార్ అగర్వాల్ 85.83 శాతం మార్కులతో మూడో ర్యాంకులో నిలిచాడు.

సహజ సాగుతో మానవ మనుగడ

» ప్రకృతి సేద్యంలో జిల్లాను అగ్రస్థానంలో నిలుపుదాం

» సేంద్రియ ఉత్పత్తుల మార్కెటింగ్‌లోనూ రైతులకు అవగాహన కల్పించాలి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



టెలికాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మానవ మనుగడకు కీలకమైన ప్రకృతి వ్యవసాయ ఉద్యమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, దశల వారీ కార్యాచరణతో సహజ సాగులో జిల్లాను నెం.1గా నిలిపేందుకు సమష్టి కృషి అవసరమని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. మంగళవారం లయోలా కళాశాల ఎదురుగా వున్న రైతు సాధికారత సంస్థ ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో రిసోర్స్‌పర్సన్లు, యూనిట్ ఇన్‌చార్జిలు, మోడల్ మేకర్ ట్రైనర్లు తదితరులకు ప్రకృతి వ్యవసాయం-ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికపై వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయంపై అన్నదాతల్లో వున్న అపోహలను తొలగించి, ఆరోగ్యకర ఉత్తత్తులతో సమాజానికి మేలు కలిగించే సాగు విధానాలపై అవగాహన కల్గించాలన్నారు. దీనికోసం ర్యాలీలు, పొలం సందర్శనలు వంటివి నిర్వహించాలన్నారు. రసాయన పురుగు మందులు, ఎరువులు మనిషి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని, సాగులో సేంద్రీయ ఎరువులు, జీవ ఉత్ప్రేరకాలు, కషాయాలు/ద్రావణాలు తదితరాల వినియోగం వల్ల ఆరోగ్యకరమైన వ్యవసాయ ఉత్పత్తులు చేతికందుతాయని కలెక్టర్ వివరించారు.

ప్రకృతి సాగుమేవ జయతే

ప్రకృతి సాగు అనేది ఓ సత్యమని, అందుకే అది తప్పక జయిస్తుందని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయి సిబ్బంది ప్రతి రైతుకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచాలని, దశల వారీగా ప్రకృతి వ్యవసాయ విస్తీర్ణాన్ని పెంచుతూ జిల్లాను ఆదర్శవంతంగా నిలుపుదామని పిలుపునిచ్చారు. రాష్ట్రప్రభుత్వం సహజ సాగుకు అత్యంత ప్రాధాన్యమిస్తోందని, స్వర్ణాంధ్ర విజన్-2047లోనూ ప్రకృతి సాగు భాగంగా వుందని వివరించారు. అలాగే ఉత్పత్తుల మార్కెటింగ్‌లోనూ రైతులకు తోడుగా నిలవాల్సిన అవసరముందని కలెక్టర్ పేర్కొన్నారు. వర్క్‌షాపుకు హాజరైన వారితో ఆయన ప్రకృతి సేద్యం ప్రతిజ్ఞ చేయించారు. 2018 నుంచి రెండెకరాల్లో ప్రకృతి సాగుచేస్తూ ఏడాదికి దాదాపు రూ.1.30 లక్షలు ఆదాయం పొందుతూ, పత్తిలో అంతర పంటలనూ సాగుచేస్తూ అదనపు ఆదాయాన్ని అందుకుంటూ తమ కుటుంబాన్ని ఏ విధంగా ఉన్నతంగా తీర్చిదిద్దుకుంటున్నానే విషయాన్ని కంచికచర్ల మండలం, బత్తినపాడు మహిళ కలక మైసమ్మ వివరించారు. కుమారుడు ఐఐఎంలో చదువుకొంటున్నాడని, అమ్మాయి ఏరోస్పేస్ ఇంజినీరింగ్ పూర్తిచేసిందని, మరో అమ్మాయి నర్సింగ్ చేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి, ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ డీఎంఎఫ్ విజయకుమారితో పాటు ట్రైనర్లు డి.రవికుమార్, ఎ.వాణి, సీహెచ్.అంజిరెడ్డి, పి.రాజశ్రీ, వి.సింధు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడండి

కలెక్టరేట్ : జిల్లాలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటికి సంబంధించి ఒక్క ఫిర్యాదు కూడా రాకుండా అధికారులు కృషి చేయాలని, ఈనెల 15 నాటికి 100 శాతం తాగునీటి సరఫరా పథకాలు క్రియాశీలం కావాలని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. వేసవిలో తాగునీటి సరఫరా కార్యాచరణపై కలెక్టర్ మంగళవారం ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీరాజ్, విస్తరణాధికారులు, గ్రామీణ నీటి సరఫరా ఇంజినీర్లు తదితరులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 286 గ్రామాల్లో రక్షిత పథకాల పునరుద్ధరణ, మరమ్మతుల పనులు తక్షణమే పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు మండల కమిటీలు చొరవ చూపాలన్నారు. నీటి ఎద్దడి ఉంటే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు సిద్ధంగా వుండాలన్నారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పశుపక్షాదులకు కూడా తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. విజయవాడలో అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయని, దీనిని దృష్టిలో వుంచుకొని బస్టాండ్లు, ఆసుపత్రులు, రహదారుల కూడళ్లు తదితరాల వద్ద తప్పనిసరిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. నరేగా పని ప్రదేశాల్లో నీడ సౌకర్యంతో పాటు తాగునీటి సౌకర్యం కల్పించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర, గ్రామీణ నీటి సరఫరా సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎస్.విద్యాసాగర్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

పదోతరగతి హాల్‌టికెట్లు విడుదల

» వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు : కేవీ శ్రీనివాసులు రెడ్డి

జి.కొండూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి పబ్లిక్ పరీక్ష హాల్ టికెట్లు విడుదలయ్యాయని, హాల్ టికెట్లు ఆయా పాఠశాలల హెచ్.ఎం లాగిన్‌లో అందుబాటులో ఉన్నాయని పరీక్షల విభాగం డైరెక్టర్ కేవీ శ్రీనివాసులు రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'వాట్సాప్-మన మిత్ర' ద్వారా విద్యార్థులు నేరుగా డౌన్‌లోడ్ చేసుకునేలా తొలిసారిగా ప్రక్రియ ప్రారంభించామన్నారు.

వాట్సాప్‌లో డౌన్‌లోడ్ ఇలా..

విద్యార్థులు 9552300009కి హాయ్ అని సందేశాన్ని పంపి షూజ్ సరీస్ లేదా సేవను ఎంచుకుని దానిపై క్లిక్ చేయాలి. ఎడ్యుకేషన్ సర్వీసెస్ లేదా విద్యాసేవలు అని ఎంచుకోవాలి. ఎస్ఎస్‌సీ హాల్ టికెట్‌ను ఎంచుకోవాలి. అప్పుడు విద్యార్థి అప్లికేషన్ నంబరు, చైల్డ్ ఐడీ, పుట్టిన తేదీని నమోదు చేసి స్ట్రీమ్‌ను ఎంచుకుని కన్ఫర్మ్‌పై క్లిక్ చేయాలి. అనంతరం వివరాలు సరి చూసుకోవాలి. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హాల్‌టికెట్‌లో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, మాధ్యమం, ఫోటో, సంతకం, సబ్జెక్టులు తదితర వివరాలన్నీ పూర్తిగా సరిచూడాలన్నారు. వివరాల్లో సబ్జెక్టు సరిపోలకపోతే సంబంధింత హెచ్.ఎం వెంటనే డిఐఆర్-జీవోవిఈఎక్స్‌ఏఎమ్ఎస్ ఎట్ ది రేట్ ఆఫ్ యాహూ డాట్ కామ్ లేదా డిఐఆర్-జీవోవిఈఎక్‌పిఎమ్ఎస్ ఎట్‌దిరేట్ ఆఫ్ ఏపీఎస్‌సీహెచ్‌ఓఓఎల్‌ఈడీయు.ఇన్ ఇమెయిల్ ద్వారా సంతకం చేసి డైరెక్టర్ ప్రభుత్వ పరీక్షల విభాగం ఆంధ్రప్రదేశ్ వారి దృష్టికి తీసుకురావాలని శ్రీనివాసులు పేర్కొన్నారు.



బెలూన్లు ఎగరవేసి పోటీలు ప్రారంభిస్తున్న మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి, కలెక్టర్ జి.లక్ష్మీశ

క్రీడలతో మానసిక దృఢత్వం

» మంత్రి రాంప్రసాద్ రెడ్డి

విజయవాడ(స్పోర్ట్స్), మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : నిత్యం కటుంబ, ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగుల మానసిక స్వాంతన కోసం, శారీరక దృఢత్వం కోసం క్రీడా పోటీలు ఎంతో అవసరమని రాష్ట్ర రవాణా, క్రీడలు, యువజన శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్జీవో రాష్ట్ర మహిళా విభాగం ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ స్టేడియంలో మంగళవారం క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వం క్రీడా రంగాన్ని ప్రోత్సహిస్తున్నదని, రెండు శాతం ఉన్న క్రీడల కోటాను మూడు శాతానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ప్రకటించారని గుర్తుచేశారు. ప్రతి మహిళా ఏడాదిలో కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించాలని, క్రీడల నిర్వహణకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు కేవీ.శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్, మహిళా ఉద్యోగుల సంఘం చైర్ పర్సన్ వి.నిర్మల కుమారి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వ్యాయామం, క్రీడలు అవసరం : కలెక్టర్ జి.లక్ష్మీశ

సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మహిళలు వ్యాయమం వైపు మొగ్గు చూపుతున్నారని, ప్రతి ఒక్కరూ వ్యాయామంతో పాటు క్రీడల్లో పాల్గొనాలన్నారు. క్రీడలతో మహిళా ఉద్యోగులు మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పొందుతారని అన్నారు. అనంతరం పలు పోటీలను కలెక్టర్ ప్రారంభించారు.

ఎమ్మెల్సీ దువ్వాడపై జనసైనికుల ఫిర్యాదు

మచిలీపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : శాసన మండలి సమావేశాల్లో ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌పై వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ చేసిన ఆరోపణలు విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని, దువ్వాడపై తగుచర్యలు తీసుకోవాలని కోరుతూ గుడివాడ, అవనిగడ్డ పోలీస్‌స్టేషన్‌లతో పాటు, మచిలీపట్నం డీఎస్పీకి జనసేన నాయకులు మంగళవారం ఫిర్యాదు చేశారు. గుడివాడతాలూకా పోలీస్‌స్టేషన్‌లో నియోజకవర్గ జనసేన కార్యదర్శి కొదమల గంగాధర్, తదితరులు ఫిర్యాదు చేశారు. అవనిగడ్డ స్టేషన్‌లో జనసేన మండల అధ్యక్షుడు గుడివాక శేషబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు మత్తివెంకటేశ్వరరావు, లీగల్ సెల్ కార్యదర్శి నాంచారయ్య, పలువురు జనసేన నాయకులు ఫిర్యాదు చేశారు. పెడన నియోజకవర్గ నాయకులు శింగలూరి శాంతిప్రసాద్, బత్తిన హరిరామ్, సిద్దినేని సాయిబాబు తదితరులు మచిలీపట్నం డీఎస్పీ రాజాకు ఫిర్యాదు చేశారు. దువ్వాడపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జనసేన నేతలు ఫిర్యాదుల్లో కోరారు.



దువ్వాడపై చర్యలు తీసుకోవాలని అవనిగడ్డ, గుడివాడ స్టేషన్‌లలో ఫిర్యాదు చేస్తున్న జనసైనికులు

7 నాటికి పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ పూర్తికావాలి

కలెక్టరేట్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్) కంప్యూటరీకరణ ప్రగతిపై కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. 131 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో మార్చి 7 నాటికి కంప్యూటరీకరణ పూర్తికావాలని, తద్వారా జిల్లాలోని అన్ని పీఏసీలు ఈ-పీఏసీలుగా మార్పు చెందాలని తద్వారా ప్రజలకు కాగితపు రహిత ఆన్‌లైన్ సేవలు అందించాలని ఆదేశించారు. ఈ ప్రక్రియలో తలెత్తే సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్టేట్ ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ వారికి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయంలో అలసత్వం వహించిన ఆడిటర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా సహకార అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరెడ్డి, జిల్లా సహకార ఆడిట్ అధికారి సిహెచ్.శైలజ, విభాగ సహకార అధికారి పి.కిరణ్ కుమార్, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు జనరల్ మేనేజర్ జి.రంగబాబు పాల్గొన్నారు.

ఐటీ రిటర్న్

(5వ పేజీ తరువాయి)



విజయవాడలోని విన్ సిటీ భవనం

విన్‌సిటీలో 10 సీట్ల స్పేస్, ఒక సింగిల్ మేనేజర్ క్యాబిన్, 10 సీట్ల స్పేస్, డబుల్ మేనేజర్ క్యాబిన్స్ వంటివి అందుబాటులో ఉన్నాయి. అలాగే, 15 సీట్లు, 20 సీట్ల స్పేస్ కూడా అందుబాటులో ఉంది. ఇవన్నీ చిన్నచిన్న స్టార్టప్ కంపెనీలకు అందుబాటులో ఉన్నాయి. వీటిలో చాలావరకు ఖాళీగా ఉండటం వల్ల ఔత్సాహికులు ఎవరైనా వస్తే వాటిని ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నామని ఎస్‌టీపీఐ విజయవాడ జాయింట్ డైరెక్టర్ వినయ్ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. ఈ సీట్లు తీసుకోవాలంటే సీటుకు రూ.7 వేల చొప్పున అద్దె చెల్లించాలి. దీంతో పాటు విన్‌సిటీలోనే మరో రెండు ఫ్లోర్లలో పెద్ద ఐటీ పరిశ్రమల కోసం 6 వేల చదరపు అడుగుల స్థలం ఖాళీగా ఉంది. దాదాపు 100 నుంచి 150 మంది.. ఆపైన సీటింగ్ ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ స్పేస్‌ను కూడా పైన చెప్పుకొన్న విధానంలో కేటాయిస్తారు. వీటిని దక్కించుకోవాలంటే ఎస్సీ, ఎస్టీలకు రాయితీలు కూడా ఉన్నాయి. మొదటి సంవత్సరం అద్దెలో 25 శాతం, రెండో సంవత్సరం 20 శాతం, మూడో సంవత్సరం 10 శాతం రాయితీ ఇస్తారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించటం కోసం మొదటి సంవత్సరం 25 శాతం, రెండో ఏడాది 20 శాతం, మూడో ఏడాది 10 శాతం చొప్పున రాయితీ ఇస్తున్నారు.

ఏస్ అర్బన్ హైటెక్ సిటీలో రెండో టవర్ పూర్తి చేయాలి

ఐటీ పరిశ్రమల స్థాపన కోసం ఔత్సాహికులు ఆసక్తి చూపిస్తున్న తరుణంలో కేసరపల్లిలోని ఏస్ అర్బన్-ఏపీఐఐసీ హైటెక్ సిటీలో రెండో టవర్‌ను కూడా అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఐటీ మంత్రి నారా లోకేశ్ దీనికి శంకుస్థాపన చేశారు. అప్పట్లోనే టవర్ పనులు దాదాపు పూర్తయ్యాయి. గోడలు, ఇతర ఆర్కిటెక్చరల్ ఫినిషింగ్ పనులు మిగిలి ఉన్నాయి. దీనిని అందుబాటులోకి తీసుకొస్తే మేథ టవర్‌తో పాటు ఏస్ అర్బన్-ఏపీఐఐసీ హైటెక్ సిటీలో కూడా ఐటీ కంపెనీలకు ఎక్కువ స్పేస్ ఇవ్వొచ్చు.

గతంలో టీడీపీ హయాంలో కళకళ

రాష్ట్ర విభజన తర్వాత గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ, కేసరపల్లి ప్రాంతాల్లో ఐటీ పరిశ్రమల స్థాపనపై దృష్టి సారించారు. ఇందుకోసం ఇన్సెంటివ్‌లను ప్రవేశపెట్టారు. దీంతో ఎంతోమంది ఔత్సాహికులు స్టార్టప్స్ (అంకుర)గా ఐటీ యూనిట్స్ ఏర్పాటు చేయటానికి అవకాశం కలిగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కేసరపల్లి ఐటీ సెజ్‌లో ఏర్పాటుచేసిన మొదటి టవర్ మేథలోనే కంపెనీలు నిండటం కష్టంగా ఉండేది. రాష్ట్ర విభజన తర్వాత టీడీపీ ప్రభుత్వం తీసుకున్న విధానాల కారణంగా మేథ టవర్‌లోని కంపెనీలు కిటకిటలాడాయి. గన్నవరంలో అతిపెద్ద ఐటీ ఇండస్ట్రీగా హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ వచ్చింది. విజయవాడ మహానాడు రోడ్డులో కె.బిజినెస్ స్పేస్, ఆటోనగర్‌లో ఇండ్‌వెల్ టెక్నాలజీస్, ఐటీ సర్వ్ టెక్ పార్క్, ఆర్ఎస్ టవర్స్ వంటి కాంప్లెక్స్‌ల్లో పెద్ద సంఖ్యలో ఐటీ పరిశ్రమలు కొలువుతీరాయి. విజయవాడ, తాడిగడపలో కూడా వ్యక్తిగత ఐటీ పరిశ్రమలు తరలివచ్చాయి.

వైసీపీ హయాంలో వెనుదిరిగి వెలవెల

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఐటీ ఇన్సెంటివ్స్‌ను ఎత్తేసింది. కంపెనీల మనుగడకు వెన్నుదన్నుగా నిలవలేదు. దీంతో కంపెనీలన్నీ వెళ్లిపోయాయి. కేసరపల్లిలోని ఏస్ అర్బన్-ఏపీఐఐసీ హైటెక్ సిటీలో మొదటి టవర్ అయిన మేథలో కూడా కంపెనీలు వెళ్లిపోయాయి. గన్నవరంలోని హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఒక్కటే నిలబడింది. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ఉద్యోగులను ఆదుకుంది. ఈ పరిణామం ఉమ్మడి కృష్ణాజిల్లా, ఉమ్మడి గుంటూరు జిల్లా యువతకు పెద్ద సమస్యనే తెచ్చింది. చెంతనే అవకాశాలు చేజారిపోవడంతో ఇక్కడి యువత ఇతర రాష్ట్రాల్లోని పెద్ద నగరాల్లో కొలువుదీరిన ఐటీ కంపెనీల్లో పనిచేయటానికే మొగ్గు చూపించాయి.

ఆలపాటి ఘన విజయం

(5వ పేజీ తరువాయి)

వైసీపీకి బుద్ధి చెప్పాలన్న కసితోనూ..

ఈ ఎన్నికల్లో వైసీపీ తన అభ్యర్థిని నిలపకపోయినా.. పీడీఎఫ్ అభ్యర్థికి అంతర్గతంగా మద్దతు తెలిపింది. అమరావతి రాజధాని విధ్వంసానికి ఒడిగట్టిన జగన్ పార్టీ పీడీఎఫ్ అభ్యర్థికి పరోక్షంగా మద్దతు తెలపడం కూడా పట్టభద్ర ఓటర్లలో కసిని రేపింది. అమరావతి రాజధాని ప్రాంతంలో కీలకమైన స్థానాన్ని కోల్పోతే ప్రత్యర్థికి బలం ఇచ్చినట్టు అవుతుందన్న ఉద్దేశ్యంతో కూడా పట్టభద్ర ఓటర్లు తమ విస్పష్ట తీర్పును ఇచ్చారన్నది స్పష్టంగా కనిపిస్తోంది. ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు తిరుగులేని మెజారిటీని ఇవ్వడం ద్వారా వైసీపీకి పట్టభద్రులు పరోక్ష సంకేతాలు పంపినట్టుగా కూడా అర్థం చేసుకోవాల్సి వస్తోంది. వైసీపీ ఈ ఎన్నికల్లో పోటీలో ఉండకపోవటంతో పెద్దగా ఓట్లను కూడా చేర్చలేదు. ఓటింగ్‌లో కూడా పెద్దగా పాల్గొనలేదని సమాచారం. జగన్ వైఖరిలో ఇప్పటికీ మార్పు రావటం లేదన్న కారణంతో వైసీపీకి చెందిన వారు కూడా కూటమి బలపర్చిన అభ్యర్థికి ఓట్లు వేసినట్టుగా తెలుస్తోంది.

కూటమి స్ఫూర్తికి నిదర్శనం

కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ కలిసికట్టుగా పనిచేశాయనడానికి ఈ విజయమే నిదర్శనంగా నిలుస్తోంది. కూటమి నేతల స్ఫూర్తితో క్షేత్రస్థాయిలో ఆయా పార్టీల శ్రేణులు కదిలాయి. టీడీపీ శ్రేణులతో కలిసి పోల్ మేనేజ్‌మెంట్‌ను ముందుకు తీసుకువెళ్లటంలో కూటమి భాగస్వామ్య పక్షాలు కూడా కృషి చేశాయి.

మొదటి ప్రాధాన్యతలోనే..

ప్రత్యర్థికి ఎక్కడా అవకాశం ఇవ్వకుండా మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులోనే ఆలపాటి రాజేంద్రప్రసాద్ భారీగా ఓట్లను సాధించారు. దీంతో మొదటి రౌండ్ నుంచే ఆయన మెజారిటీ ప్రత్యర్థిని కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. మొత్తం తొమ్మిది రౌండ్లకు గాను మొదటి రౌండ్‌లో 17,194, రెండో రౌండ్‌లో 17,527, మూడో రౌండ్‌లో 16,722, నాలుగో రౌండ్‌లో 16,236, ఐదో రౌండ్‌లో 16,916, ఆరో రౌండ్‌లో 17,028, ఏడో రౌండ్‌లో 16,477, ఎనిమిదో రౌండ్‌లో 16,900, తొమ్మిదో రౌండ్‌లో 10,087 ఓట్లు చొప్పున సాధించి మొత్తంగా 1,45,057 ఓట్లను కైవశం చేసుకున్నారు.

మెట్రోకు భూమి సేకరించండి

(5వ పేజీ తరువాయి)

మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. దీంతో మెట్రో మొదటి దశ పనులకు అవసరమైన భూములను సేకరించేందుకు జిల్లా యంత్రాంగం అడుగులు వేయనుంది. భూ సేకరణ నోటిఫికేషన్‌ను త్వరలోనే వెలువరించనుంది. భూ సేకరణకు సంబంధించి గతంలోనే మార్కింగ్ పనులు ఇప్పటికే చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా నూరుశాతం నిధులు రాబట్టి, తద్వారా పనులు చేయించాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది. కేంద్ర ప్రభుత్వం నుంచి సమాధానం వచ్చేలోపే ఇటీవల రాష్ట్ర బడ్జెట్‌లో మెట్రోకు రూ.50 కోట్లు కేటాయించింది. దీనిని బట్టి మెట్రో మొదటి దశ పనులను శరవేగంగా ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది.

జోరుగా బెట్టింగ్

(5వ పేజీ తరువాయి)

అనుచరులతో బెట్టింగ్ బాగోతాన్ని నడిపిస్తున్నారు. ఎవరెవరికి ఎంతెంత ముట్టజెప్పాలో అనుచరుల ద్వారా చేయిస్తున్నారు.

ఫ్యాన్సీ నెంబర్ల హల్‌చల్

బుకీలు ఫ్యాన్సీ ట్రెండ్‌ను బాగా ఫాలో అవుతున్నారు. మూడు, నాలుగు దశల్లో పనిచేసే బుకీలు మొత్తం ఫ్యాన్సీ నెంబర్లను తీసుకున్నారు. బెట్టింగ్‌లో ఏ టీమ్‌పై ఎంత పందెం పెట్టాలి, దాన్ని ఎలా పెంచాలి, పందెం పెట్టేవాళ్లను ఎలా రెచ్చగొట్టాలి.. అనే విషయాలను చోటా బుకీలకు ఎప్పటికప్పుడు సూచనలు, సమాచారం ఇస్తున్నారు. ఇందుకోసం ప్రధాన బుకీలు ఫోన్ నెంబర్లు ఉపయోగిస్తారు. ఒక్కొక్కరి వద్ద సుమారు 10-20 ఫోన్ నెంబర్లు ఉంటాయి. ఒక్కో ప్రాంతంలో బెట్టింగ్‌కు ఒక్కో నెంబరును కేటాయించుకుంటారు. ఇవన్నీ ఫ్యాన్సీ నెంబర్లే కావడం గమనార్హం. మొబైల్ నెంబర్లకు ఉండే పది అంకెల్లో మొదటి ఐదు అంకెలు ఒకలా, చివరి ఐదు అంకెలు ఒకేలా ఉండేలా ఎంపిక చేసుకుంటారు. మార్కెట్లోకి కొత్త ఫ్యాన్సీ నెంబర్లు రాగానే ఆయా సర్వీసు ప్రొవైడర్లకు సంబంధించిన పీవోఎస్ (పాయింట్ ఆఫ్ సేల్)లోని సిబ్బందితో సంబంధాలు కొనసాగిస్తున్నారు.

పబ్లిక్ అండర్‌టేకింగ్ కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్యే కుమార్‌రాజా బాధ్యతల స్వీకరణ

పామర్రు : ఆంధ్రప్రదేశ్ శాసనసభ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సభ్యుడుగా పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా బాధ్యతలు చేపట్టారు. మంగళవారం అసెంబ్లీలో కమిటీ ఛైర్మన్‌తో పాటు 12మంది సభ్యులు ప్రమాణం చేసి సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కుమార్ రాజా మాట్లాడుతూ, ప్రభుత్వ సంస్థల స్వయం ప్రతిపత్తి-సామర్థ్యం, మంచి వ్యాపార సూత్రాలు, వివేకవంతమైన వాణిజ్య పద్ధతులకు అనుగుణంగా అవి నిర్వహించబడుతున్నాయో లేదో కమిటీ పరిశీలిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, స్పీకర్ అయ్యన్నపాత్రుడికి ధన్యవాదాలు తెలియజేశారు.

డాక్టర్ ప్రతిభకు సత్కారం

మచిలీపట్నం టౌన్ : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా మహిళా దంత వైద్యుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ప్రముఖ దంతవైద్యురాలు డాక్టర్ ఏ. ప్రతిభను ఘనంగా సత్కరించారు.

విజయవాడ తూర్పు



వరల్డ్ పారా అథ్లెటిక్స్‌కు ముగ్గురు ఎంపిక

లబ్బీపేట, మార్చి4 (ఆంధ్రజ్యోతి): న్యూ ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 11నుంచి 13వరకు జరగనున్న వరల్డ్ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్-2025 పోటీలకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్లు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి.రామస్వామి తెలిపారు. అనకాపల్లి చెందిన ఆర్.రవి (ఎఫ్40 కేటగిరి), పార్వతీపురం మన్యంకు చెందిన కె.లలిత(టి11 కేటగిరి), శ్రీకాకుళంకు చెందిన టి.రాము(టి35 కేటగిరి) ఎంపిక అయినట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు శాప్ ఛైర్మన్ రవినాయుడు తదితరులు అభినందించారు.

పాఠశాలలకు ఉచితంగా

'సాహసపుత్రులు' నవల



పాఠశాల విద్యాశాఖ అదనపు సంచాలకుడు సుబ్బారెడ్డికి సాహస పుత్రులు నవల సంచికను అందిస్తున్న సిరికోన సాహితీ అకాడమీ నిర్వాహకులు

విజయవాడ కల్చరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : కార్గిల్ యుద్ధవీరుల త్యాగ గాథను ఆధారంగా చేసుకొని, ప్రముఖ రచయిత్రి వెంపటి హేమ రచించిన 'సాహ సపుత్రులు' నవలను, సిరికోన సాహితీ అకాడమీ ప్రచురించి, ప్రభుత్వ పాఠశాలల గ్రంథాలయా లకు ఉచితంగా అందించింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ అదనపు సంచాలకులు ఎ.సుబ్బారెడ్డికి 'సిరికోన సాహితీ అకాడమీ' తరపున నిర్వాహకులు ఎస్.సి.హెచ్.చక్రవర్తి, సభ్యులు చిట్టిబాబు, వాణిశ్రీ నవలను అందజేశారు. బాలలు ఇటువంటి చారిత్రక నవలలు చదివితే దేశభక్తి పెంపొందుతుందని, వీరుల త్యాగగాథలు వారికి స్ఫూర్తినిస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా, అదనపు సంచాలకులు సుబ్బారెడ్డి సిరికోన అకాడమీకి అభినందనలు తెలియజేశారు. దేశభక్తిని నింపే మరిన్ని రచనలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రచయితలు కె.ఎల్.నారాయణ, డీవీ రామకృష్ణ పాల్గొన్నారు.

నవలా రూపంలో కార్గిల్ యుద్ధ గాథ

1999లో 17 వేల అడుగుల ఎత్తులో జరిగిన కార్గిల్ యుద్ధంలో భారత సైనికుల అసమాన ధైర్యాన్ని 'సాహసపుత్రులు' నవల హృద్యంగా చిత్రించింది. 92 ఏళ్ల వయస్సులోనూ రచయిత్రి హేమ యదార్థ చరిత్రను నవలా రూపంలో మలచి, దేశభక్తిని నింపే గొప్ప రచన అందించారు.

ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడి మృతి

గుణదల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన మంగళవారం గుణదలలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం ప్రసాదంపాడు గ్రామంలో ఉంటున్న మంత్రవాధి మురళీధర్ తన మోపెడ్‌పై ఉద్యోగం నిమిత్తం మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయలు దేరి వెళుతుండగా గుణదల పడవలరేవు జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనదారుడు అతివేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ఘటనలో మురళీధర్(62) అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు ఆయనను ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న అతని కుమారుడు ఆసుపత్రికి చేరుకునే సరికి అతని తండ్రి అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న గుణదల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పూర్వాపరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గుణదల పోలీసులు తెలిపారు.

రాణిగారితోటలో నేత్ర వైద్యశిబిరం



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

రాణిగారితోట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాణిగారితోటలోని సుందరయ్య గ్రంథాలయంలో గ్రంథాలయ కమిటీ ఆధ్వర్యంలో అమరావతి ఐ హాస్పిటల్ సహకారంతో మంగళవారం కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్య సిబ్బంది సమస్యలు ఉన్న వారికి మందులు అందించారు. 20మందికి ఆపరేషన్ అవసరం అని గుర్తించారు. వారికి ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రంథాలయ కమిటీ కన్వీనర్ ఎస్.హరినారాయణ మాట్లాడుతూ ప్రతి మంగళవారం వైద్య శిబిరం జరుగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రాయల్ సీసీపై ఫ్రెండ్స్ జట్టు గెలుపు

విజయవాడ(స్పోర్ట్స్), మార్చి4 (ఆంధ్రజ్యోతి): మూలపాడు గ్రౌండ్స్‌లో జరుగుతున్న దేవినేని వెంకటరమణ, ప్రణీత మెమోరియల్ బి లీగ్ మ్యాచ్‌లలో మంగళవారం రెండు మ్యాచ్‌లు జరిగాయి. మొదటి మ్యాచ్ రాయల్ సీసీ, ఫ్రెండ్స్ జట్ల మధ్య జరిగింది, మొదట బ్యాటింగ్ చేసిన రాయల్ సీసీ జట్టు 50ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 257పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఫ్రెండ్స్ జట్టు 48.1ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 260పరుగులతో విజయం సాధించింది. జట్టులో ఎం.శ్యామ్ ప్రసాద్ 145పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. రెండో మ్యాచ్ కొండపల్లి, ఎవరెస్ట్ జట్ల మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన కొండపల్లి జట్టు 40ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 176పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఎవరెస్ట్ జట్టు 36.3ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 177పరుగులతో విజయం సాధించింది. ఎవరెస్ట్ జట్టు బౌలర్ శరత్‌చంద్ర 4వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.

యాదవులకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించండి

- గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం

గాంధీనగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన రొండి కృష్ణయాదవ్‌కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కృష్ణాజిల్లా గొర్రెలు మేకల పెంపకందారుల సంక్షేమ సంఘం ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు దిద్దుకూరి వెంకట కృష్ణారావు, గొరిపర్తి సుబ్బారావు సీఎం చంద్రబాబును కోరారు. గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. చట్టసభల్లో యాదవుల సమస్యలు లేవనెత్తేందుకు కృష్ణయాదవ్‌కు అవకాశంఇవ్వాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం యాదవులను పూర్తిగా విస్మరించిందని దీంతో గత ఎన్నికల్లో యాదవులు కూటమి విజయానికి కృషి చేశారన్నారు. యాదవ సంఘాలను ఏకతాటిపై నడిపి కూటమి విజయానికి కృష్ణయాదవ్ విశేషంగా కృషి చేశారన్నారు. ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. గోవాడ రమేష్‌కుమార్ పాల్గొన్నారు.







ఆర్థిక ఇబ్బందులు తాళలేక లాడ్జీలో తెలంగాణ వాసి ఆత్మహత్య

వన్‌టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో తెలంగాణ రాష్ట్రం సూర్యాపేటజిల్లాకు చెందిన వృద్ధుడు (63)విజయ వాడ గవర్నర్‌పేటలోని ఓ లాడ్జిలో ఆత్మహత్య చేసుకున్నట్లు మంగళవారం గవర్నర్‌పేట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. సూర్యాపేటజిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి గ్రామానికి చెందిన బజ్జూరి నారాయణస్వామి, భార్య విజయ, ముగ్గురు సంతానంతో ఉంటున్నాడు. ఇతను గతంలో టిప్పర్స్ కాంట్రాక్టు వ్యాపారం చేసేవాడు. అందులో నష్టం రావటంతో ప్రస్తుతం జిల్లాలో ఉన్న ఓ ఫ్యాక్టరీకి డైలీ లేబర్‌ను సప్లయ్ చేస్తున్నాడు. అతను ఈనెల 2న జగ్గయ్యపేట సమీపంలోని ఓ ప్రాంతంలో జరిగిన కార్యక్రమానికి వెళ్లాడు. అక్కడి నుంచి విజయవాడలో మందులు కొనుగోలు చేయటానికి వెళుతున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పాడు. ఆ రోజు మధ్యాహ్నం కుటుంబ సభ్యులు అతనికి ఫోన్ చేయగా, మందులు కొనుగోలు చేసి వస్తానని చెప్పాడు. రాత్రి వరకు ఇంటికి వెళ్లకపోవటంతో కుటుంబ సభ్యులు అతనికి ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆ మరుసటి రోజు కుటుంబ సభ్యులు, బంధువులు విజయవాడ వచ్చి ఆరా తీయగా పోలీస్ కంట్రోల్ రూమ్ సమీపంలోని రవి రెసిడెన్సీ 302 రూమ్‌లో బెడ్‌పై చనిపోయి ఉన్నాడు. అతని పక్కన వివిధ రకాల ట్యాబ్‌లెట్లు 20షీట్లు వరకు ఉన్నాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి పరిశీలించి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆర్థిక ఇబ్బందులు వల్లే నారాయణస్వామి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని మృతుడి భార్య ఫిర్యాదులో పేర్కొన్నారు.





ఖాళీగా దర్శనమిస్తున్న పోలీస్ ఔట్ పోస్టు, రాంగ్ రూట్‌లో వెళుతున్న ద్విచక్రవాహనదారుడు

రాంగ్ రూట్లో ప్రయాణం..ప్రమాదకరం

పటమట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ప్రధాన రద్దీ కూడళ్లలో ఎన్టీఆర్ సర్కిల్ ఒకటి. అంతటి ప్రాధాన్యం ఉన్న ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన యూటర్న్ మార్గంలో ద్విచక్ర వాహనదారులు రాంగ్ రూట్‌లో వెళుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

బెంజిసర్కిల్ నుంచి పటమటలంక, రామలింగేశ్వర్ నగర్, దర్శిపేట, యనమలకుదురు వెళ్లే వారికి అనుకూలంగా ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో కుడిచేతి పక్క యూటర్న్ ఏర్పాటు చేశారు. కాని ఆటోనగర్ నుంచి వచ్చే వాహనదారులు రాంగ్ రూట్‌లో యూటర్న్ తీసుకుంటున్నారు. ఫలితంగా ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికి ప్రధాన కారణం ఇక్కడ ఏర్పాటు చేసిన పోలీస్ ఔవుట్ పోస్టు ఎప్పుడు చూసినా ఖాళీగా దర్శనమిస్తుంది. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి పోలీస్ ఔట్ పోస్టులో పోలీసులను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఎంఎస్ఎంఈ రుణాలతో పారిశ్రామికవేత్తలుగా ఎదగండి

నాయీ బ్రాహ్మణులకు ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మాదిగాని గురునాథం హితవు



మాట్లాడుతున్న మాదిగాని గురునాథం

వన్‌టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈ రుణాల సదుపాయాలతో నాయీ బ్రాహ్మణులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఎంఎస్ఎంఈ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మాదిగాని గురునాథం హితవు పలికారు. గురునానక్ కాలనీలోని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో మంగళవారం నాయీ బ్రాహ్మణులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కులవృత్తిని సాగించుకుంటూ కూడా నాయీ బ్రాహ్మణులను పారిశ్రామికవేత్తలుగా రూపుదిద్దేందుకు ఎంపీ శివనాథ్ అండగా ఉంటారన్నారు.

ఈ సందర్భంలో ప్రధాన మంత్రి రోజ్‌గార్ యోజన, ఎంఎస్ఎంఈల గురించి వివరించారు. రుణసదుపాయం, పోర్టర్ల రిజిస్ట్రేషన్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకునే దగ్గర నుంచి అన్ని సహాయ సహకారాలను ఎంపీ కార్యాలయం నుంచి అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాస్తి సాంబశివరావు, సంకె విశ్వనాథం, కాకు మల్లికార్జునయాదవ్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ సూరవరపు నాగరాజు, సాధికారత కమిటీ నాయకులు సగరపు అప్పారావు, ఉప్పిడి రాము, పరిశపోగు రాజేష్, సొంగా సంజయ్ వర్మ, నరసింహచౌదరి, అబీద్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని బోర్లు



ఆరో డివిజన్, విశాలాంధ్ర రోడ్డు బ్రహ్మానంద రెడ్డి నగర్‌లో కార్పొరేషన్ అధికారులు ఏర్పాటు చేసిన బోర్లు మరమ్మతులకు గురై గత కొనేళ్లుగా పని చేయడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రహ్మానందరెడ్డి నగర్ 8వ లైన్లో, 4వ లైన్లో బోర్లు పని చేయడం లేదు. 6వ లైన్‌లో హెడ్‌లేని బోరు ఉంది. ఈ బోర్లు మరమ్మతులకు గురై పని చేయడం మానేశాయి.మంచినీటి కుళాయిల్లో నీరు సరఫరా కాకపోతే ఈ పంపింగ్ నీరే దిక్కని, అవి మరమ్మతులకు గురికావడంతో నీటి ఇబ్బంది తప్పదని జనం గగ్గోలు పెడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులకు గురైన బోరింగ్ పంపులకు మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

-ప్రభుత్వాసుపత్రి, ఆంధ్రజ్యోతి

టీడీపీ బలోపేతానికి డాంగే కుమార్ కృషి మరువలేనిది



డాంగే కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

వన్‌టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి మాజీ కార్పొరేటర్ వీరంకి డాంగేకుమార్ ఎనలేని కృషి చేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు. బీసీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ వీరంకి డాంగే కుమార్ 10వ వర్ధంతి కార్యక్రమం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం జరిగింది. ముందుగా వీరంకి డాంగేకుమార్ చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ గౌడ సాధికారిత కన్వీనర్ పామర్తి కిషోర్ బాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ, కార్పొరేటరు చెన్నుపాటి ఉషారాణి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సొంగా సంజయ్‌వర్మ, ఉపాధ్యక్షుడు పేటేటి రామ్మోహన్, టీడీపీ రాష్ట్ర నాయకులు మాదిగాని గురునాథం, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ జిల్లా కార్యాలయంలో...

ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డాంగేకుమార్ చిత్రపటానికి బీసీ గౌడ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యనారాయణ ప్రసాద్, జిల్లా బీసీ గౌడ అధికారిక కన్వీనర్ పామర్తి కిషోర్ బాబులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. **పటమట:** మాజీ కార్పొరేటర్ వీరంకి డాంగేకుమార్ వర్ధంతి కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎం స్కూల్ సమీపంలో కౌండిన్యనగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్ మాట్లాడారు. అనంతరం పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి, కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి గాంధీ, డాంగే కుటుంబసభ్యులు, స్నేహితులు పాల్గొన్నారు.

పన్ను బకాయిలుంటే కుళాయి కనెక్షన్లు తొలగించండి


- కమిషనర్ ధ్యానచంద్ర

విద్యాధరపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పన్ను బకాయిలు భారీగా ఉన్న అసిస్మెంట్స్‌కు నీటి కుళాయిలు, భూగర్భ డ్రెయినేజీ కనెక్షన్లు తొలగించాలని విజయవాడ మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. తన పర్యటనలో భాగంగా మంగళవారం ఎక్కువగా పన్ను బకాయిలు ఉన్న ప్రాంతాలను ఫీల్డ్ విజిట్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎక్కువ కాలం నుంచి పన్ను బకాయిలు ఉన్న వారికి చట్టపరంగా నీటి కుళాయిలు, భూగర్భ డ్రెయినేజీ కనెక్షన్లు తొలగించాలని, జప్తు నోటీసులు జారీ చేయాలన్నారు.

బకాయి మొత్తం చెల్లించాక తిరిగి వసతులు కల్పించాలనిఆదేశించారు. మార్చి 31 వరకు విజయవాడ నగరపాలక సంస్థ క్యాష్ కౌంటర్లు సెలవు దినాల్లో కూడా పనిచేస్తాయని, ప్రజలందరూ సకాలంలో పన్నులు చెల్లించి విజయవాడ నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ పర్యటనలో డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి.సృజన, అసిస్టెంట్ కమిషనర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ట్రైసైకిల్స్ పంపిణీ

పటమట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నిర్భయ క్రాంతి మహిళా మండలి 15వ వార్షికోత్సవం సందర్భంగా రూ.36 వేలు ఖరీదు చేసే నాలుగు ట్రై సైకిల్స్‌ను నలుగురు బాధితులకు అందించినట్లు సంస్థ అధ్యక్షురాలు అబ్బూరి రత్నలక్ష్మి తెలిపారు. ఇప్పటి వరకు 15 మందికి ట్రై సైకిల్స్ పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఏఐడబ్ల్యూసీ న్యూఢిల్లీకి చెందిన సెక్రటరీ మంజుకాక్, ఇన్‌చార్జి ఆశాదేశ్ పాండే, కమిటీ మెంబర్ అమరేశ్వరి, ట్రెజరర్ అమ్మాజీ, కాత్యాయని, కోటేశ్వరి, ఉషలు పాల్గొన్నారు.









బొత్స సత్యనారాయణపై తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కంచర్ల గాంధీ, బాలకోటయ్య

అమరావతిని శ్మశానం అని మనోభావాలు దెబ్బతీశారు

» బొత్సపై చర్యలు తీసుకోండి

» తుళ్లూరు పీఎస్‌లో రైతు గాంధీ, జేఏసీ నేత బాలకోటయ్య ఫిర్యాదు

తుళ్లూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ మాజీ మంత్రి బొత్స సత్యన్నారాయణ ప్రజా రాజధాని అమరావతిని శ్మశానం అన్నారు. ప్రజల మనోభావాలు దెబ్బతీనేలా వ్యాఖ్యానించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలి' అని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు అందింది. వెలగపూడికి చెందిన రైతు కంచర్ల గాంధీ, అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు బాలకోటయ్య, శాఖమూరు దళిత జేఏసీ నేత వలపర్ల దాసు మంగళవారం తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో సీఐ అంజయ్యను కలిశారు. ఈ మేరకు రాత పూర్వక ఫిర్యాదు చేశారు. గాంధీ మీడియాతో మాట్లాడుతూ, "నేను 2.36 ఎకరాల భూమిని ప్రజా రాజధాని అమరావతికి ఇచ్చాను. బొత్స సత్యనారాయణ గతంలో అమరావతి రాజధాని శ్మశానం అని అన్నారు. తిరిగి సోమవారం శాసన మండలిలో, మీడియాతోనూ 'అమరావతి రాజధాని శ్మశానం' అన్న మాటకు కట్టుబడి ఉన్నా అని అనడంతో ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయి. అమరావతి రైతులను కించపరచటం, ఆ ప్రాంతాన్ని అవహేళన చేయడం, రాష్ట్రంలో మిగిలిన ప్రాంతాల మధ్య కక్షలు, ప్రాంతీయ అసమానతలు రెచ్చగొట్టే విధంగా ఉద్దేశపూర్వకంగా చేస్తున్న కుట్రను అడ్డుకోవడానికి చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. శ్మశానంతో పోల్చి ఆ ప్రాంతంలో నివసిస్తున్న మమ్మల్ని కించపరచాడు. బొత్స వ్యాఖ్యలపై కఠినమైన చర్యలు తీసుకోవాలి' అని విజ్ఞప్తి చేశారు. బాలకోటయ్య మాట్లాడుతూ, 'ప్రజా రాజధాని అమరావతిపై బొత్స మరోసారి అవహేళనగా మాట్లాడారు. రాష్ట్ర ప్రజలను అవమానించారు. అమరావతి రాజధానిపై బొత్స విషం చిమ్మాలని మరోసారి ప్రయత్నం చేస్తున్నాడు. రైతులందరూ దీనిని ఎదుర్కొని నిలువరించాలి. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ దీనిపై వెంటనే స్పందించాలి' అని విజ్ఞప్తి చేశారు. వలపర్ల దాసు మాట్లాడుతూ, 'రాజధానికి భూములిచ్చిన రైతులను, రైతు కూలీలను, బొత్స అవమానించినట్లే. శ్మశానం అయితే ఇన్నాళ్లు వెలగపూడి సచివాలయానికి ఎందుకొచ్చారు? ఆయనపై చర్యలు తీసుకోవాలి' అని డిమాండ్ చేశారు.



ఉద్యోగులతో మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

సీఎం దృష్టికి ఉద్యోగుల సమస్య

● ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు

బస్టేషన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో సేవలందిస్తూ వివిధ కారణాలతో వైద్యపరంగా అనర్హులైన వారి సమస్యను పరిష్కరించేందుకు సీఎం దృష్టికి తీసుకువెళతామని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. మంగళవారం విజయవాడలోని ఆర్టీసీ కార్యాలయంలో తనను కలవడానికి వచ్చిన 50 మంది ఆర్టీసీ ఉద్యోగులతో మాట్లాడారు. వీరంతా వివిధ కారణాలతో వైద్యపరంగా అనర్హులయ్యారు. 2015 నుంచి 2019 వరకు వివిధ కారణాలతో మెడికల్ అన్‌ఫిట్ అయి 175 మంది ఉద్యోగులు వైదొలగారు. వారిలో 50 మంది కొనకళ్లను కలిశారు. వీరిలో కొంతమంది చనిపోయిన వారి పిల్లలూ వచ్చారు. గత ప్రభుత్వం తమ సమస్యలు వినలేదని, కూటమి ప్రభుత్వమైనా ఉద్యోగాలు కల్పించాలని కోరారు. నారాయణరావు స్పందిస్తూ విషయాన్ని సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా ప్రయత్నిస్తానన్నారు.

ఇనామ్ భూముల రిజిస్ట్రేషన్లపై నిషేధం ఎత్తివేయాలి

● అసెంబ్లీలో కోరిన ఎమ్మెల్యే తాతయ్య



జగ్గయ్యపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ ఇనామ్ భూముల రిజిస్ట్రేషన్లపై విధించిన నిషేధం ఎత్తివేతపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అసెంబ్లీలో మంగళవారం కోరారు. భూముల రీసర్వే విషయం లో రెవెన్యూ అధికారులు తప్పనిసరిగా డాక్యుమెంట్లను, లింక్ డాక్యుమెంట్ల ఆధారంగా చూడాలని, అనుభవంలో ఉన్నవారి ఆధారంగా భూ కేటాయింపులు చేయవద్దన్నారు. ఇనామ్ భూ ములను నిషేధిత జాబితాలో చేర్చటం వల్ల లక్షలాది మంది ఇబ్బందులు పడుతున్నార ని, గతంలో ఒకసారి నిషేధం ఎత్తివేతకు ప్రయత్నించిందని, రెవెన్యూ మంత్రిని, ముఖ్యమంత్రిని ఇదే విషయంపై కలిసి కోరామన్నారు.



నెట్టెంకు స్వీట్లు తినిపించి సంతోషం వ్యక్తం చేస్తున్న పార్టీ నేతలు

ఆలపాటి విజయం.. నెట్టెం నివాసంలో సంబరం

జగ్గయ్యపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఘనవిజయం సాధించిన సందర్భంగా విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం నివాసంలో పార్టీ నేతలు సంబరాలు చేసుకున్నారు. విజయంలో కీలకపాత్ర పోషించిన రఘురాంకు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. నెట్టెం మాట్లాడుతూ సమష్టి కృషితోనే అద్భుత విజయం సాధ్యమైందన్నారు. వివిధ మండల పార్టీల ప్రతినిధులు కట్టా నరసింహారావు, మేకా వెంకటేశ్వర్లు, మైనేని రాధా, గట్టిడి దుర్గాప్రసాద్, ఆవుల రామారావు, కళావతి, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కన్నెబోయిన రామలక్ష్మీ, ఏ రాణి, సంకా వెంకట్రావు, సయ్యద్ అన్వర్ పాల్గొన్నారు.

యూత్ పార్లమెంట్ పోటీల్లో పాల్గొనండి

● ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రమేష్

కలెక్టరేట్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి యూత్ పార్లమెంట్ పోటీలను గుంటూరులోని టీజేపీఎస్ కళాశాలలో నిర్వహిస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ తెలిపారు. ఈ మేరకు ఒక పోస్టర్‌ను ఎన్ఎస్ఎస్ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి 18 నుంచి 25 ఏళ్ల మధ్యనున్న వారెవరైనా పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. మై భారత్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని నిమిషం నిడివున్న 'వాట్ డస్ వికసిత్ మీన్ టూ యూ' అనే అంశంపై వీడియో చేసి మార్చి 9న అర్ధరాత్రి 11.59 గంటల్లోపు అప్‌లోడ్ చేయాలన్నారు. వీటన్నింటినీ స్క్రీనింగ్ చేసి 5 జిల్లాల నుంచి ఎంపికైన వాళ్లకి జిల్లాస్థాయిలో టీజేపీఎస్ కళాశాల, గుంటూరులో 150 విద్యార్థులకు పోటీ ఉంటుందన్నారు.

జీవాలకు గాలి సోకనీయొద్దు..!

గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధులతో జీవాలకు కష్టం.. పాడిరైతులకు నష్టం



ప్రస్తుతం జిల్లాలో పాడిగేదెలకు, ఆవులకు, ఆబోతులకు గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వంటి వ్యాధులు సోకుతున్నాయి. వాటి ప్రభావంతో జీవాలు అనారోగ్యం బారిన పడటంతోపాటు పాడిరైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. కావున ప్రభుత్వం నెలాఖరులోగా ఉచితంగా అందిస్తున్న టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కామని శ్రీనివాసరావు తెలిపారు. ఆయా వ్యాధులు, చికిత్స, నివారణ వంటి వివరాలను ఆయన సవివరంగా తెలియజేశారు.

- ఆంధ్రజ్యోతి, కృష్ణలంక



గాలికుంటు వ్యాధి

ఈ వ్యాధి 'పికోర్నా' అనే వైరస్ వల్ల వ్యాపిస్తుంది. కలుషితమైన గాలి, పాల ద్వారా దూడలకు వ్యాపిస్తుంది. ఇది ఏడాది పొడవునా కనిపించినప్పటికీ ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్‌లో ఎక్కువగా ఉంటుంది. దేశవాళీ పశువులతో పోలిస్తే సంకర జాతి పశువులకే ఎక్కువగా వస్తుంటాయి. పాల ఉత్పత్తి తగ్గుతుంది. పశువుల నోటి వెంట చొంగ కారడం, నోరు, కాళ్లగిట్టల మధ్య బొబ్బలు పడి పుండ్లుగా మారి నడవలేకపోవడం, గిట్టలు ఊడిపోవడం జరుగుతుంది. చర్మం గరుకుగా, వెంట్రుకలు బిరుసుగా ఉండటం, జ్వరం 104 నుంచి 106 డిగ్రీల ఫారన్‌హీట్ ఉండటం, నోటి పుండ్లతో మేత మేయలేక నీరసపడిపోవడం, ఆడ పశువుల్లో వ్యంధత్వం ఏర్పడుతుంది. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే యాంటీబయాటిక్స్ వాడి ఇతర సూక్ష్మ జీవుల నుంచి కలిగే దుష్ఫలితాలను తగ్గించటం, నోటి పుండ్లకు గ్లిసరిన్, బోరిక్ యాసిడ్ మిశ్రమాన్ని రాయాలి. కాలి పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావకంతో కడిగి జింక్ ఆక్సైడ్, వేప నూనె మిశ్రమాన్ని రాయాలి. తేలికగా జీర్ణమయ్యే మెత్తని పచ్చగడ్డి, నానబెట్టిన లేదా ఉడికించిన మెత్తని పదార్థాలు, బెల్లం, ఉప్పుతో కూడిన గంజి, మడ్డి కూడు ఆహారంగా ఇస్తే మంచిది. అసలు ఇలాంటి వ్యాధులు ప్రబలకుండా జీవాలకు 4 నెలల వయస్సులో గాలికుంటు నివారణ టీకాలు, 4 వారాలకు బూస్టర్ డోస్ టీకా, ఏడాదికొకసారి నివారణ టీకాలు వేయించాలి. వ్యాధిసోకిన పశువులను ఇతర పశువులతో కలవకుండా ఉంచాలి. సంతలకు పంపకుండా ఉంచాలి. షెడ్లను 4శాతం సోడా ద్రావకంతో కడగాలి. దూడలకు వ్యాధి సోకిన తల్లి పాలు తాగించకూడదు. కొత్తగా కొన్న పశువులను 3 నెలలు వేరుగా ఉంచి తర్వాత మాత్రమే మందలో కలపాలి. వ్యాధి సోకిన పశువుల పాలు, మనుషులు తాగేటప్పుడు బాగా వేడిచేసి తాగాలి.

బ్రూసెల్లోసిస్ వ్యాధి

ఈ వ్యాధి బ్రూసెల్లా అబారుటస్ అనే బాక్టీరియా నోరు, చర్మం, సంభోగ సమయంలో ఒక పశువు నుంచి వేరే పశువుకు సోకుతుంది. గర్భకోశం నుంచి స్రవించే మట్టు, మలినమైన తోక ద్వారా కూడా ఈ వ్యాధి సంక్రమించే అవకాశం ఉంది. దీన్ని కంటాజియస్ అబార్షన్, బాంగ్స్ వ్యాధి అని కూడా పిలుస్తారు. పశువుల నుంచి మనుషులకు కూడా ఇది సోకి 'అండ్యులెంట్‌ఫీవర్' అనే వ్యాధిని కలుగచేస్తుంది. పశువులకు ఈ వ్యాధి సోకటం వల్ల పాల ఉత్పత్తి తగ్గటం, పునరుత్పత్తి, సామర్థ్యం తగ్గటం, ఈసుకుపోవటం, మాయ వేయకపోవటం, 10 నుంచి 20 రోజుల పాటు ఎర్రమట్టు పడుతుంది. ఆబోతుల్లో వృషణాలు, మోకాళ్లు, గిట్టల వద్ద వాపు వస్తుంది. అయితే ఈ వ్యాధికి చికిత్స లేదు కేవలం నివారణ ఒకటే మార్గం. ఈసుకు పోయిన పిండాన్ని, మాయను గర్భాశయ ద్రవాలను జాగ్రత్తగా నిర్మూలించి మలినమైన చెత్తను కాల్చివేయాలి లేదా లోతైన గోతిలో సున్నం చల్లి పాతిపెట్టాలి. వ్యాధి నివారణ టీకాలు 4 నుంచి 8 నెలల వయసున్న ఆడదూడలకు వేయాలి. పశువుల మందలకు రక్తపరీక్ష చేసి బ్రూసెల్లోసిస్ వ్యాధికి పాజిటివ్ ఫలితం వస్తే ఆయా పశువులను మందనుంచి తప్పించాలి. ఈ వ్యాధికి గురైన పశువుల పాలను బాగా మరగ కాచి తాగాలి. ఈ వ్యాధి నిర్ధారణ ఎలా చేస్తారంటే పశువుల్లో పాల పరీక్ష, ఆబోతుల్లో ప్రతి ఏడాది రక్త పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ చేస్తారు. అలాగే మృత పిండం, పడిపోయిన మాయను సూక్ష్మదర్శిని ద్వారా పరీక్ష చేసి నిర్ధారిస్తారు. పశువులతో సన్నిహితంగా ఉండే పశువుల యజమానులు, పశువుల కాపరులు, పశువైద్యులు, కబేళాలో పనిచేసే సిబ్బంది, మాంసం దుకాణాల్లో పనిచేసేవారికి, పాలు కాయకుండా పచ్చిపాలు తాగేవారికి ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. వీటి లక్షణాలు ఎలా ఉంటాయంటే తరచుగా జ్వరం, ఒళ్లు తడిచే చెమటలు, చలి, తలనొప్పి, కీళ్లనొప్పులు, వృషణాల వాపు, నీరసించి బరువు తగ్గటం జరుగుతుంది. ఈ వ్యాధుల నిరోధక టీకాలు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రైతుల వద్దకే వచ్చి పశువులకు ఉచితంగా ఈనెలాఖరు వరకు వేస్తున్నారు. రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కామని శ్రీనివాసరావు కోరుతున్నారు.

రైతులు బలపడటమే ప్రభుత్వ లక్ష్యం

● రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ జేసీ సునీత

గుణదల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి రైతు పండించిన పంట ఇంటికి చేరడం, పంట లాభసాటిగా ఉండేందుకు అనుసరించాల్సిన వ్యూహాలను తెలియజేసేందుకు కూటమి ప్రభుత్వం పలు అంశాలను ఆచరణలోకి తీసుకురావడం జరుగుతుందని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ జె.సునీత తెలిపారు. విజయవాడ రూరల్ మండలంలోని నున్న, పాతపాడు గ్రామాల్లో మంగళవారం ఆమె పర్యటించి ఆయా గ్రామాల్లో నిర్మించిన ఫాంపాండ్, రింగ్ ట్రెంచ్, సరిహద్దు కందకం, వ్యక్తిగత సోక్ పిట్, వ్యక్తిగత కంపోస్ట్ పిట్, పశువుల షెడ్, హార్టికల్చర్ ప్లాంటేషన్ పనులు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించే పంటను చేతికి చిక్కించుకోవడంలో చాలావరకు వైఫల్యం చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ప్రధాన కారణం సదరు అంశాలపై వస్తున్న మార్పులు తెలియకపోవడమేనన్నారు. ప్రభుత్వ పరంగా రైతులకు అందించాల్సిన మెళకువలను తెలియజేసేందుకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. డ్వామా పీడీ ఏ రాము, విజయవాడ రూరల్ మండల పరిషత్ అధికారి పి.మురళీ కృష్ణ ప్రసాద్, నున్న, పాతపాడు పంచాయతీ కార్యదర్శులు డి.శ్రీనివాసరావు, పి.కోటిలింగమ్మ పాల్గొన్నారు.



ఫాంపాండ్, రింగ్ ట్రెంచ్, సరిహద్దు కందకం, వ్యక్తిగత కంపోస్ట్ పిట్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కమిషనర్ జె.సునీత, డ్వామా పీడీ రాము, అధికారులు



ఏడీసీ అధికారులతో ప్రపంచ బ్యాంకు బృందం సమావేశం

అమరావతిలో ప్రాజెక్టుల రూపకల్పనపై చర్చ

● ప్రపంచబ్యాంకు ప్రతినిధులతో ఏడీసీ అధికారుల సమావేశం

కలెక్టరేట్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ప్రపంచ బ్యాంకు రుణంతో చేపడుతున్న వివిధ ప్రాజెక్టుల నిర్మాణాలపై అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) అధికారులతో ప్రపంచ బ్యాంకు బృందం మంగళవారం సమావేశమయ్యారు. ఏడీసీ సీఎండీ డీ లక్ష్మీపార్థసారథితో బ్యాంకు ప్రతినిధులు తాము రుణం మంజూరుచేస్తున్న ప్రాజెక్టు నిర్మాణాలతో స్థూలంగా చర్చించారు. ముఖ్యంగా అమరావతికి కావాల్సిన తాగునీటి సరఫరాపై చర్చించారు. ఈ వ్యవస్థకు ముఖ్యమైన మౌలిక సదుపాయాల రూపకల్పనపై వివరాలడిగి తెలుసుకొన్నారు. ఇక్కడ నివసించే ప్రజలకు తాగునీటి లభ్యతకున్న అవకాశాలు, నీటిశుద్ధి, పంపిణీ పద్ధతులపై ఏడీసీ అధికారులు దృశ్యమాధ్యమం ద్వారా బ్యాంకు ప్రతినిధులకు వివరించారు. వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు, ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణానికి టెండర్లు రూపొందించామన్నారు. ప్రపంచ బ్యాంకు లీడ్ ట్రాన్స్‌పోర్ట్ స్పెషలిస్ట్ గెరాల్డ్ పాల్ ఆలివియర్, సీనియర్ అర్బన్ స్పెషలిస్ట్ క్వింగ్యున్ షెన్, సీనియర్ వాటర్ అండ్ శానిటేషన్ స్పెషలిస్ట్ శ్రీనివాసరావు పోడిపిరెడ్డి, సేకరణ నిపుణుడు వేదమూర్తి, ఏడీసీ సూపరింటెండింగ్ ఇంజినీరు బి.నరసింహమూర్తి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లానింగ్ అండ్ డిజైన్ హెడ్ డాక్టర్ కె.వి.గణేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వి.శ్రీనివాసరావు, సీనియర్ ఇన్‌ఫ్రా ప్లానర్ ఎ.పవన్‌కుమార్, సీనియర్ ఇన్‌ఫ్రా ఇంజినీర్ అవ్వారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

23న అమరావతి చిత్రకళా వీధి

● రాజమహేంద్రవరంలో ప్రతిష్టాత్మక కళా ప్రదర్శన

విజయవాడ కల్చరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం యునైటెడ్ ఆర్ట్స్ ఆర్గనైజేషన్ సహకారంతో 'అమరావతి చిత్రకళా వీధి' పేరుతో ప్రతిష్టాత్మక వార్షిక చిత్రకళా ప్రదర్శనను ఈ నెల 23న రాజమహేంద్రవరంలో ఉదయం 7 నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్వహించనుంది. దీంతో రాష్ట్ర చిత్రకళారంగానికి జాతీయ గుర్తింపు తేవడమే కాకుండా, దేశవ్యాప్తంగా కళాకారులకు స్థిరమైన, లాభదాయకమైన వేదికగా నిలుస్తుంది. తమ కళాకృతులను ప్రదర్శించేందుకు, విక్రయించేందుకు ఆసక్తి ఉన్న చిత్రకారులు అమరావతిఆర్ట్‌ఫెస్టివల్.కామ్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. ఇందుకు రూ. వెయ్యి చెల్లించాల్సి ఉంటుంది. ఈ రుసుము ద్వారా దామర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీ పునరుద్ధరణకు నిధులు సమకూర్చి, రాష్ట్ర కళా వారసత్వాన్ని అభివృద్ధి చేయనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం భాషా సంస్కృతిక శాఖ సంచాలకుడు ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. కళాకారులు తమ పేరు నమోదు చేసుకోవాల్సిన చివరి తేదీ మార్చి 16 అని తెలిపారు.



కొండపై బుకింగ్

● స్టాల్ ఏర్పాటులో భారీగా ముడుపులు ● అంతా ఆ అధికారి కన్నుసన్నల్లోనేనంటున్న ఉద్యోగులు

ఇంద్రకీలాద్రి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడి ప్రాంగణంలోని శివాలయానికి వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన ఓ బుక్ స్టాల్ వ్యవహారంలో భారీగా ముడుపులు చేతులు మారినట్టు పలువురు ఉద్యోగులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో ఓ ఉన్నతాధికారి అంతా తానై వ్యవహరించారని ఆరోపిస్తున్నారు. తొలగించిన ప్రదేశంలో షాపు ఇవ్వకూడదని చెప్పినా పట్టించుకోకుండా తాను చెప్పినట్టు చేయాలని ఒత్తిడి తెచ్చారని వాపోతున్నారు. కొండపై ఎలాంటి దుకాణాలు కేటాయించకూడదని నిబంధనలున్నాయి. కానీ ఈయనతో పాటు మరో కిందిస్థాయి అధికారి తమ ఇష్టానుసారంగా షాపు కేటాయించారు. షాపు నిర్వాహకులు పూజా సామగ్రి, పుస్తకాలకు భక్తుల వద్ద నుంచి అధిక రుసుం వసూలు చేస్తున్నారు. దీనిపై గత సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'కొండపై అనధికార బుక్‌స్టాల్' కథనం ప్రచురితమైంది. స్పందించిన దేవస్థానం కార్యనిర్వాహణాధికారి, దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాలతో అధికారులు విచారణ చేపట్టి ఉద్యోగులను వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ షాపు ఏర్పాటు వ్యవహారంలో సుమారు రూ.6, నుంచి 7లక్షల వరకు లావాదేవీలు జరిగినట్టు విమర్శలు వస్తున్నాయి. దేవస్థానం ఉన్నతాధికారి పూర్తి విచారణ చేస్తే అసలు విషయాలు బయటకు వస్తాయని పలువురు ఉద్యోగులు చెబుతున్నారు.

షాపుల కేటాయింపులో నిబంధనలుండవా?

కనకదుర్గానగర్‌లో గతంలో ఉన్న షాపులు అభివృద్ధి పనుల కారణంగా తొలగించారు. వారిలో ఎక్కువ మంది దేవస్థానానికి అద్దె బకాయిలుండటంతో కార్యనిర్వహణాధికారి బకాయిలున్నవారికి షాపులు కేటాయించలేదు. వీటిపై ఆంధ్రజ్యోతిలో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన ఈవో షాపుల అద్దె బకాయిలు వసూలు చేయాలని అధికారులు, ఉద్యోగులకు ఆదేశాలిచ్చారు. దీంతో కొంతమంది పూర్తి బకాయిలను చెల్లించినా మరికొందరు జాప్యం చేశారు. బకాయిలు చెల్లించిన వారికి సీరియల్ ప్రకారం ఈవో దుకాణాలు కేటాయించారు. తరువాత బకాయిలు చెల్లించిన వారికి సీరియల్ ప్రకారం కాకుండా తరువాత డబ్బులు చెల్లించిన దుకాణదారులకు కేటాయించటంపై విమర్శలు తలెత్తాయి.

వాహనాల విడుదలకు పాత నిబంధనలు అమలు చేయాలి

● లారీ యజమానుల సంఘం

వన్‌టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలకు గురైన వాహనాలను విడుదల చేయటంలో గతంలో రాష్ట్ర డీజీపీ ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని ది ఆంధ్రప్రదేశ్ లారీ యజమానుల సంఘం ప్రతినిధులు డీజీపీ హరీష్ కుమార్ గుప్తాను కోరారు. ఈ సందర్భంగా ఆలిండియా మోటార్ ట్రాన్స్‌పోర్టు కాంగ్రెస్ సౌత్ జోన్ ప్రెసిడెంట్ వై.వి.ఈశ్వరరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు గతంలో 304ఏ సెక్షన్ మేరకు వాహనాలను కోర్టుకు పంపేవారని, దీంతో యజమానులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా అప్పటి డీజీపీ లారీకి డాక్యుమెంట్లన్నీ సక్రమంగా ఉంటే స్టేషన్ నుంచే విడుదల చేయాలని ఉత్తర్వులిచ్చారన్నారు. అయితే ప్రస్తుతం అనేక పోలీసు స్టేషన్లలో ఈ ఉత్తర్వులు అమలు చేయటం లేదన్నారు. అదేమంటే పాత సర్క్యులర్‌తో సంబంధం లేదని చెపుతున్నారన్నారు. ఈ అంశాన్ని పరిశీలించి గతంలో జారీ చేసిన ఉత్తర్వుల మేరకు వాహనాల విడుదలకు చర్యలు తీసుకునేందుకు కొత్త సర్క్యులర్‌ను జారీ చేయాలని కోరామన్నారు. డీజీపీని కలిసిన వారిలో కృష్ణా జిల్లా లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు ఎన్.రాజా, ప్రధాన కార్యదర్శి ఏవీవీ సత్యనారాయణ ఉన్నారు.

బీఆర్‌టీఎస్ రోడ్డులో బీభత్సం

● రోడ్డుపై నిద్రపోతున్నవారిపై దూసుకెళ్లిన స్కార్పియో

● ఇద్దరికి తీవ్ర గాయాలు, మరో ఇద్దరికి స్వల్ప గాయాలు

● కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఎన్ పురం పోలీసులు



ప్రమాదం తరువాత బీఆర్‌టీఎస్ రోడ్డు మధ్యలో పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లు

వన్‌టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వారంతా పగలు వివిధ ప్రాంతాల్లో పనులు చేసి రాత్రి సమయానికి బీఆర్‌టీఎస్ రోడ్డు మధ్యలో నిద్రపోతున్నారు. వారు గాఢనిద్రలో ఉండగా తెల్లవారు జామున స్కార్పియో వాహనం వారిపైకి దూసుకెళ్లింది. దీంతో వారంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఈ వాహనం నలుగురిపై దూసుకెళ్లడంతో ఇద్దరికి తీవ్ర గాయాలవగా, మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి బాధితులను చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈనెల 2న తెల్లవారు జామున 5 గంటలకు శారదా కాలేజీ సమీపంలోని బీఆర్‌టీఎస్ రోడ్డుమధ్యలో సుమారు 60, 70 మంది వలస కార్మికులు గాఢనిద్రలో ఉన్నారు. ఆ సమయంలో సీతన్న పేట గేట్ వైపు నుంచి స్కార్పియో వాహనం అతి వేగంగా వెళుతూ రోడ్డు మధ్యలో నిద్రపోతున్న వారిపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఆ సమయంలో వాకర్స్, స్థానికులు గమనించి పోలీసులకు తెలిపారు. అప్పటికే ఆ వాహనం వేగంగా పడవలరేవు వైపునకు దూసుకెళ్లింది. పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి వివరాలు తెలుసుకుని బాధితులను చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో ఇద్దరికి కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలైనట్టు సమాచారం. స్థానికులు మాత్రం తీవ్ర గాయాలైనవారు మృత్యువాత పడే అవకాశం ఉందని చెబుతున్నారు. పోలీసులు 337 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా ప్రదేశంలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. నలుపు రంగు స్కార్పియో వాహనంతో పాటు నెంబరును కూడా గుర్తించినట్టు తెలుస్తుంది. కారులో సుమారు ముగ్గురు, నలుగురున్నట్లు సమాచారం.

ఉద్యోగాలకు వయోపరిమితి

45 ఏళ్లకు పెంచాలి

● ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేంద్రబాబు

భారతీనగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొన్నేళ్లుగా నోటిఫికేషన్ విడుదల కాకపోవడంతో నిరుద్యోగులు చాలామంది అనర్హులుగా మిగిలిపోయారని వారిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో ఏపీపీఎస్సీతో పాటు ఇతర ఏజెన్సీలు నిర్వహించే డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ఉద్యోగాలకు వయోపరిమితిని 45ఏళ్లకు పెంచేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో యూనిఫాం సర్వీసులకు 4 ఏళ్లు, యూనిఫాం సర్వీసెస్‌కు (పోలీస్, అగ్నిమాపక, ఇతర భద్రతా శాఖలు) ఉన్న గరిష్ఠ వయోపరిమితిని రెండేళ్లు పెంచగా, నాన్ యూనిఫాం ఉద్యోగాల గరిష్ఠ వయో పరిమితిని 34 ఏళ్ల నుంచి 42 ఏళ్లకు పెంచుతూ ఉత్తర్వులు జారీచేశారన్నారు. 42 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి స్వాగతిస్తున్నామని, నాన్ యూనిఫాం సర్వీసెస్‌కు 45 ఏళ్లకు పెంచాలని కోరారు.

8 నుంచి ప్రజాచైతన్య యాత్రలు: సీపీఎం

నెల్లూరు,మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 8 నుంచి 22వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజా చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నట్టు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసులు వెల్లడించారు. మంగళవారం నెల్లూరులో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో నెలకొన్న సమస్యలపైనే ఈ యాత్రలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

రిలయన్స్‌కు డబుల్ షాక్

- కంపెనీకి ప్రభుత్వం 2 నోటీసులు జారీ
- ఓఎన్‌జీసీ గ్యాస్‌ను తరలించుకున్నందుకు రూ.24,500 కోట్లు కట్టాలని ఆదేశాలు
- నిర్దేశిత గడువులోగా బ్యాటరీ సెల్ ప్లాంట్ ఏర్పాటు చేయనందుకు రూ.3 కోట్ల పెనాల్టీ



న్యూఢిల్లీ: భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్)కు ఒకేసారి రెండు షాక్‌లు తగిలాయి. ఆంధ్రప్రదేశ్‌లోని కేజీ బేసిన్‌లో ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీకి చెందిన క్షేత్రాల నుంచి అక్రమంగా గ్యాస్ (సహజవాయువు) ఉత్పత్తి చేసుకున్నందుకు గాను 281 కోట్ల డాలర్లు (దాదాపు రూ.24,500 కోట్లు) చెల్లించాలని రిలయన్స్‌కు మోదీ సర్కారు డిమాండ్ నోటీసు జారీ చేసింది. అంతేకాదు, నిర్దేశిత గడువులోగా బ్యాటరీ సెల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయలేకపోయినందుకు గాను ఆర్ఐఎల్ అనుబంధ విభాగమైన రిలయన్స్ న్యూ ఎనర్జీ బ్యాటరీ స్టోరేజ్ లిమిటెడ్‌పై భారీ పెనాల్టీని సైతం విధించింది. కేజీ బేసిన్ డీ6 బ్లాక్‌లో రిలయన్స్, దాని భాగస్వామి బీపీ సహజవాయువు, ఇంధన నిక్షేపాల క్షేత్రాలను కలిగి ఉన్న విషయం తెలిసిందే. రిలయన్స్ తన నిల్వలకు పక్కనే ఉన్న ఓఎన్‌జీసీ క్షేత్రాల నుంచి కూడా గ్యాస్‌ను అక్రమంగా తరలించుకోవడంతో పాటు వెలికి తీసి, విక్రయించుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంది. కాగా, ఈ కేసులో రిలయన్స్‌కు అనుకూలంగా అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కోర్టు (ఆర్బిట్రేషనల్ ట్రైబ్యునల్) ఇచ్చిన తీర్పును ఢిల్లీ హైకోర్టు గత నెల 14న తోసిపుచ్చింది. దాంతో రిలయన్స్‌తో పాటు దాని భాగస్వాములైన బీపీ, నికో లిమిటెడ్‌కు పెట్రోలియం మంత్రిత్వ శాఖ నష్టపరిహారం చెల్లించాలంటూ తాజాగా డిమాండ్ నోటీసు జారీ చేసింది.

అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్ విభాగం కోసం ప్రకటించిన ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహకాల (పీఎల్ఐ) పథకంలో భాగంగా 5 గిగావాట్ల సామర్థ్యంతో కూడిన మాన్యుఫాక్చరింగ్ ప్లాంట్ మొదటి మైలురాయిని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయలేకపోయినందుకు గాను పెనాల్టీ విధిస్తున్నట్లు రిలయన్స్ న్యూ ఎనర్జీకి భారీ పరిశ్రమల శాఖ ఈ నెల 3న నోటీసు పంపింది. ఈ జనవరి 1 నుంచి ఆలస్యమైన ప్రతి రోజుకు రూ.50 కోట్ల పెర్ఫార్మెన్స్ సెక్యూరిటీలో రోజుకు 0.1 శాతం చొప్పున జరిమానా విధిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఇప్పటివరకు పెనాల్టీ మొత్తం రూ.3.1 కోట్లకు చేరుకుంది.

సకాలంలోనే వేతన పెంపు

కాగ్నిజెంట్

న్యూఢిల్లీ: న్యూజెర్సీ ప్రధాన కేంద్రంగా పని చేస్తున్న కాగ్నిజెంట్ ఎప్పటిలాగానే ఈ ఏడాది కూడా సకాలంలోనే మెరిట్ ఆధారంగా అర్హులైన ఉద్యోగులకు వేతనాల పెంపు ఉంటుందని ప్రకటించింది. ఈ ఏడాది కంపెనీలో వేతనాల పెంపు జాప్యం అవుతుందంటూ వచ్చిన వార్తలను కంపెనీ ఖండించింది. గత ఆగస్టులో తాము వేతనాలు పెంచామని, సరిగ్గా ఏడాది కాలానికి అంటే వచ్చే ఆగస్టులో వేతనాల పెంపు ఉంటుందని తెలిపింది. అలాగే మార్చి నెల మధ్యలో అర్హులైన వారందరికీ బోనస్ కూడా చెల్లిస్తామని ప్రకటించింది. ఇందుకు భిన్నంగా ఎవరు ఎలాంటి ప్రచారం చేసినా అందులో ఇసుమంత వాస్తవం కూడా ఉండదని స్పష్టం చేసింది.

అయాన్ బీమ్‌తో అపోలో జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): క్యాన్సర్ చికిత్సకు ప్రోటాన్ బీమ్ థెరపీ సొల్యూషన్లు అందించేందుకు అయాన్ బీమ్ అప్లికేషన్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్టు అపోలో హాస్పిటల్స్ ప్రకటించింది. దీని కింద దేశంలో ప్రోటియస్ వన్ సిస్టమ్‌ను ప్రవేశపెడతారు. దీనివల్ల ప్రోటాన్ థెరపీలో తమ స్థానం మరింత సుస్థిరం అవుతుందని తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ			
హైదరాబాద్	410	విజయవాడ	430
వరంగల్	412	గోదావరి	425
చిత్తూరు	463	విశాఖపట్నం	435
		డజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	101
వరంగల్	100	గుంటూరు	101
కరీంనగర్	100	ఒంగోలు	101
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	94
కర్నూలు	100	నెల్లూరు	99
విశాఖపట్నం	100	అనంతపురం	99
గోదావరి	101		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	87,380 ▲	80,100 ▲	1,07,000 ▲
విజయవాడ	89,400 ▲	84,000 ▲	98,000 ▲
విశాఖపట్నం	86,460 ▲	79,260 ▲	96,570 ▲
రాజమండ్రి	87,700 ▲	80,100 ▲	97,700 ▲
ప్రొద్దుటూరు	87,800 ▲	81,300 ▲	97,500 ▲
ముంబై	86,432 ▲	79,172 ▲	95,293 ▲

తయారీ, ఎగుమతుల ప్రోత్సాహానికి
రెండు కొత్త కార్యక్రమాలు

పారిశ్రామికవేత్తలతో ప్రధాని మోదీ



ముంబై/న్యూఢిల్లీ: ప్రపంచం యావత్తు విశ్వసనీయ భాగస్వామిగా భారత్ వైపు ఆసక్తిగా ఎదురు చూస్తున్న నేపథ్యంలో ప్రపంచ స్థాయిలో అందుబాటులోకి వస్తున్న అవకాశాలు అందిపుచ్చుకునేందుకు సంసిద్ధం కావాలని ప్రధాని నరేంద్ర మోదీ పారిశ్రామిక రంగానికి పిలుపు ఇచ్చారు. తయారీ, ఎగుమతి రంగాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రెండు కొత్త మిషన్లు (కార్యక్రమాలు) ప్రారంభించబోతున్నట్టు ఆయన చెప్పారు. పారిశ్రామిక రంగ ప్రతినిధులతో బడ్జెట్ అనంతర వెబినార్‌లో నియంత్రణలు, పెట్టుబడులు, వ్యాపార సరళీకరణ సంస్కరణలపై ప్రధాని మాట్లాడారు. మెరుగైన టెక్నాలజీ, ఉత్పత్తుల నాణ్యతపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. ప్రపంచ డిమాండుకు దీటుగా వారికి అవసరమైన కొత్త ఉత్పత్తులను గుర్తించాలని పరిశ్రమకు ఆయన సూచించారు. నూతన ప్రపంచ డిమాండును తీర్చగల సామర్థ్యం భారత పరిశ్రమకున్నదని ఆయన అన్నారు. ఎన్నో సంక్లిష్ట పరిస్థితులను అధిగమించి నిలిచి భారత్ నేడు ప్రపంచ వృద్ధికి చోదకశక్తిగా మారిందని ఆయన పేర్కొన్నారు. నేడు ప్రతి దేశం భారత్‌తో ఆర్థిక భాగస్వామ్యం పటిష్ఠం చేసుకోవాలనుకుంటున్న కారణంగా ఆ అవకాశాన్ని చక్కగా వినియోగించుకోవాలని పారిశ్రామిక రంగానికి సూచించారు. స్థిరమైన విధానాలు, సంస్కరణల పట్ల చిత్తశుద్ధి కారణంగా పరిశ్రమకు ప్రభుత్వంపై కొత్త విశ్వాసం ఏర్పడిందని చెప్పారు.

ఎంఎస్ఎంఈలకు కొత్త రుణ విధానాలు: దేశంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రలకు (ఎంఎస్ఎంఈ) తక్కువ వడ్డీపై సకాలంలో రుణాలందించేందుకు కొత్త విధానాలు అందుబాటులోకి రావలసిన అవసరం ఉన్నదని ప్రధాని నొక్కి చెప్పారు. తొలిసారిగా పారిశ్రామికవేత్తలవుతున్న మహిళలు, ఎస్‌సీ, ఎస్‌టీ ఆంత్రెపెన్యూర్లకు రూ.2 కోట్ల వరకు రుణాలు అందించనున్నట్టు తెలిపారు. ఎంఎస్ఎంఈలకు రుణాలందించినంత మాత్రాన చాలదని, చక్కని మార్గదర్శకత్వం కూడా కావాలని పేర్కొంటూ వారికి అవసరం అయిన మెంటార్‌షిప్ కార్యక్రమాలు రూపొందించాల్సిందిగా పారిశ్రామిక రంగ ప్రతినిధులకు పిలుపు ఇచ్చారు. తాము జన్‌విశ్వాస్ 2.0 బిల్లును ప్రవేశపెట్టనున్నామంటూ ఆర్థికేతర నియంత్రణలపై సమీక్షకు ఒక కమిటీని ఏర్పాటు చేసినట్టు ప్రధాని చెప్పారు. నియంత్రణలేవైనా ఆధునికం, అనుసరణీయంగాను, విశ్వసనీయత పెంచేవిగాను ఉండాలని వ్యాఖ్యానించారు.

రాష్ట్రాలు కూడా సంస్కరణలు చేపట్టాలి: రాష్ట్రాలు కూడా వ్యాపార సరళీకరణకు సంస్కరణలు చేపట్టాలని, అప్పుడు మరిన్ని పెట్టుబడులు వస్తాయని ప్రధాని సూచించారు. రాష్ట్రాలు పరస్పర పోటీ సామర్థ్యం పెంచుకుని ప్రగతిశీలక విధానాలతో ముందుకు వచ్చినట్టయితే పెట్టుబడులకు ఆకర్షణీయ కేంద్రాలుగా కంపెనీలు వాటిని ఎంచుకుంటాయని అన్నారు.

నిఫ్టీకి నష్టాల దశమి

- 1996లో ప్రారంభమైన సూచీకి అత్యంత సుదీర్ఘ వరుస నష్టమిదే..
- 73,000 దిగువ స్థాయికి సెన్సెక్స్

ముంబై: సుంకాల యుద్ధం మరింత తీవ్రతరం కావడంతో పాటు విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల నిరవధిక ఉపసంహరణ కారణంగా స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం మరింత నష్టపోయాయి. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 452 పాయింట్ల వరకు క్షీణించిన సెన్సెక్స్.. చివరికి 96.01 పాయింట్ల నష్టంతో 72,989.93 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ నష్టపోవడం వరుసగా ఇది మూడో రోజు. ఆరంభ ట్రేడింగ్‌లోనే 22,000 దిగువ స్థాయికి పడిపోయిన నిఫ్టీ.. మళ్లీ కాస్త కుదురుకుని, చివరికి 36.65 పాయింట్ల నష్టంతో 22,082.65 వద్ద ముగిసింది. సూచీ నష్టపోవడం వరుసగా ఇది పదో రోజు.

అంతేకాదు, 1996లో ప్రారంభమైన అయిన నిఫ్టీకి దాదాపు మూడు దశాబ్దాల్లో ఇదే అత్యంత సుదీర్ఘ వరుస నష్టం కూడా. గడిచిన 10 ట్రేడింగ్ సెషన్లలో నిఫ్టీ 4 శాతం క్షీణించింది. గత ఏడాది సెప్టెంబరులో నమోదైన ఆల్‌టైం రికార్డు స్థాయితో పోలిస్తే 16 శాతం పతనమైంది.

నిఫ్టీ 50 డెరివేటివ్స్ మంత్లీ ఎక్స్‌పైరీ సోమవారానికి మార్పు

ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ)లో ట్రేడింగ్ నిర్వహించే వారికి గమనిక. నిఫ్టీ 50 మంత్లీ డెరివేటివ్ కాంట్రాక్టుల ఎక్స్‌పైరీ రోజును నెలలో చివరి గురువారం నుంచి చివరి సోమవారానికి మారుస్తున్నట్లు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) వెల్లడించింది. ఏప్రిల్ 4 నుంచి ఈ మార్పు అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది.

యూఎస్ మార్కెట్లు విలవిల

అమెరికా, దాని కీలక వాణిజ్య భాగస్వాముల మధ్య పరస్పర సుంకాల పోరు మరింత తీవ్రమవడంతో యూఎస్ స్టాక్ మార్కెట్లు విలవిల్లాడుతున్నాయి. మంగళవారం ప్రారంభ ట్రేడింగ్‌లో డౌజోన్స్ 700 పాయింట్లకు పైగా నష్టపోగా.. ఎస్ అండ్ పీ, నాస్‌డాక్ 1.75 శాతం వరకు క్షీణించాయి.

2 నెలల్లో ఎల్ఐసీకి రూ.1.50 లక్షల కోట్ల నష్టం

ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ.. దేశంలోనే అతిపెద్ద సంస్థాగత ఇన్వెస్టర్ కూడా. పాలసీదారుల నుంచి ప్రీమియం రూపంలో సేకరించిన సొమ్ములో కొంత భాగాన్ని కంపెనీ స్టాక్ మార్కెట్లోనూ పెట్టుబడిగా పెడుతుంది. మార్కెట్ పతనం కారణంగా ఈ ఏడాదిలో గడిచిన రెండు నెలల్లో ఎల్ఐసీకి ఏకంగా రూ.1.45 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది. గత ఏడాది డిసెంబరు చివరి నాటికి, ఎల్ఐసీ ఈక్విటీ పెట్టుబడుల మొత్తం విలువ రూ.14.9 లక్షల కోట్లు కాగా.. ఈ ఫిబ్రవరి చివరినాటికి రూ.13.4 లక్షల కోట్లకు తగ్గింది.

మసాలాల తయారీలోకి
జెమినీ ఎడిబుల్స్

శ్రీ అన్నపూర్ణ ఫుడ్స్‌తో జేవీ ఏర్పాటు

చెన్నై: ఫ్రీడమ్ బ్రాండ్ నేమ్‌తో వంట నూనెలు విక్రయిస్తున్న హైదరాబాద్ కంపెనీ 'జెమినీ ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా' తాజాగా మసాలా ఉత్పత్తుల తయారీ, డిస్ట్రిబ్యూషన్ వ్యాపారంలోకి ప్రవేశించింది. ఇందుకోసం కోయంబత్తూరుకు చెందిన శ్రీ అన్నపూర్ణ ఫుడ్స్‌తో కలిసి జీఈఎఫ్ ఫుడ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో జాయింట్ వెంచర్ (జేవీ)ను ఏర్పాటు చేసినట్లు మంగళవారం ప్రకటించింది. ఈ జేవీలో ఇప్పటికే రూ.70 కోట్లు పెట్టుబడిగా పెట్టినట్లు జెమినీ ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ అక్షయ్ చౌదరి తెలిపారు. ఈ జేవీ ద్వారా భవిష్యత్‌లో ప్లాంట్ ఏర్పాటు కోసం వచ్చే రెండేళ్లలో మరో రూ.50 కోట్లు పెట్టుబడిగా పెట్టనున్నట్లు ఆయన చెప్పారు. ఈ భాగస్వామ్య సంస్థ తొలి ఏడాదిలోనే రూ.100 కోట్ల ఆదాయాన్ని చేరుకోగలదని భావిస్తున్నామని అన్నారు. వచ్చే ఐదేళ్లలో రెవెన్యూను రూ.1,000 కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తమిళనాడుకు పరిమితమైన అన్నపూర్ణ మసాలా ఉత్పత్తులను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ మార్కెట్లకు సైతం విస్తరించనున్నట్లు వెల్లడించారు.

ఏపీలో మసాలా తయారీ ప్లాంట్: రోజుకు వంద టన్నుల తయారీ సామర్థ్యంతో కూడిన ప్లాంట్‌ను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయనున్నట్లు శ్రీ అన్నపూర్ణ ఫుడ్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ విజయ్ ప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం కంపెనీ కోయంబత్తూరులో రోజుకు 30 టన్నుల తయారీ సామర్థ్యంతో కూడిన ప్లాంట్‌ను కలిగి ఉంది.

వచ్చే ఆర్థిక సంవత్సరంలో 5 లక్షల స్మార్ట్ ఏసీల విక్రయం

- మార్కెట్లోకి 150 కొత్త మోడళ్ల విడుదల
- బ్లూస్టార్ ఇండియా ఎండీ త్యాగరాజన్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్):బ్లూస్టార్ లిమిటెడ్ వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో 5 లక్షల స్మార్ట్ ఏసీలను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దేశవ్యాప్తంగా స్మార్ట్ ఏసీలకు డిమాండ్ గణనీయంగా పెరుగుతోందని, అందుకు తగ్గట్టుగానే కొత్త ఫీచర్లతో మార్కెట్లోకి సరికొత్త ఎయిర్ కండీషనర్స్ (ఏసీ)ను తీసుకువస్తున్నట్లు బ్లూస్టార్ ఎండీ బీ త్యాగరాజన్ వెల్లడించారు. మంగళవారం నాడిక్కడ మార్కెట్లోకి 150 కొత్త రూమ్ ఏసీ మోడళ్లను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్మార్ట్ ఏసీల విక్రయాలు లక్ష యూనిట్ల వరకు ఉండనున్నాయని ఆయన పేర్కొన్నారు. కాగా ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఏసీల విక్రయాలు 15 లక్షల యూనిట్లుగా ఉంటాయని భావిస్తున్నామన్నారు. అయితే 2025-26లో విక్రయాలు 20 లక్షల యూనిట్లకు చేరుకోవచ్చని అంచనా వేస్తున్నట్లు త్యాగరాజన్ చెప్పారు.

2028 నాటికి శ్రీసిటీ రెండో యూనిట్ రెడీ: కాగా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో 40 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న రెండో ఏసీ తయారీ యూనిట్ 2028 నాటికల్లా అందుబాటులో వస్తుందని త్యాగరాజన్ చెప్పారు. కాగా బ్లూస్టార్‌కు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్లలో 15 శాతం వాటా ఉందని పేర్కొన్నారు.

చిత్రజ్యోతి
SINCE 1965

గుర్తుండిపోయే పాత్ర



'నేను పరిశ్రమకు వచ్చి 48 ఏళ్లు అయింది. 'రాబిన్ హుడ్' లాంటి కథాబలమున్న చిత్రంలో అవకాశం దక్కడం అరుదు. నటుడిగా నాకు సంతృప్తినిచ్చిన చిత్రమిది' అన్నారు రాజేంద్రప్రసాద్. నితిన్ హీరోగా నటించిన 'రాబిన్‌హుడ్'లో ఆయన కీలకపాత్ర పోషించారు. ఈ నెల 28న విడుదలవుతున్న సందర్భంగా రాజేంద్రప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ 'సినిమాలో నితిన్ నా టైమింగ్ ఫాలో అవ్వాలి. నేను అతని టైమింగ్ ఫాలో అవ్వాలి. మా ఇద్దరి క్యారెక్టర్స్ అలా డిజైన్ చేశారు. ఇలాంటి వినోదాత్మక చిత్రం చేసి చాలా కాలమైంది. దర్శకుడు వెంకీ స్పెషల్‌గా నా కోసం రాసుకున్న పాత్ర ఇది. 'జులాయి', 'సన్నాఫ్ సత్యమూర్తి', 'నాన్నకు ప్రేమతో', 'శ్రీమంతుడు', 'ఓ బేబీ', 'ఎఫ్ 2' చిత్రాల తరహాలో 'రాబిన్‌హుడ్'లోనూ ప్రేక్షకులకు గుర్తుండిపోయేలా నా పాత్ర ఉంటుంది' అన్నారు.

సికందర్‌తో స్టెప్పులు



బాలీవుడ్ హీరో సల్మాన్‌ఖాన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'సికందర్'. ఏఆర్ మురుగదాస్ దర్శకుడు. రష్మిక మందన్న కథానాయిక. రంజాన్ సందర్భంగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం నుంచి తొలి గీతాన్ని యూనిట్ మంగళవారం విడుదల చేసింది. జోహ్రజబీన్ అంటూ సాగే ఈ గీతంలో బీట్‌కు అనుగుణంగా సల్మాన్, రష్మిక హుషారైన స్టెప్పులతో అలరించారు. ఈ పాటకు సమీర్, డానిష్ సాహిత్యం అందించగా, ప్రీతమ్ స్వరాలందించారు. నకాష్ అజీజ్, దేవ్ నేగి ఆలపించారు. సాజిద్ నడియాడ్‌వాలా ఈ చిత్రాన్ని నిర్మించారు.

యాభై రోజులు పూర్తి



వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కించిన 'సంక్రాంతికి వస్తున్నాం' బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. తాజాగా, ఈ సినిమా 92 సెంటర్లలో 50 రోజులను పూర్తి చేసుకున్నట్లు మేకర్స్ ప్రకటించారు. సంక్రాంతి సందర్భంగా జనవరి 14న విడుదలైన ఈ సినిమా దాదాపు రూ.300 కోట్ల కలెక్షన్స్ రాబట్టింది. అత్యధిక వసూళ్లను సాధించిన తెలుగు రీజనల్ సినిమాగా ఘనత దక్కించుకుంది. దిల్‌రాజు, శిరీష్ నిర్మించిన ఈ చిత్రంలో ఐశ్వర్యా రాజేశ్, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటించారు.




మంచి అనుభూతిని అందిస్తుంది

జీవీ ప్రకాశ్ కుమార్, దివ్యభారతి జంటగా కమల్ ప్రకాశ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కింగ్‌స్టన్'. జీవీ ప్రకాశ్ నటించడంతో పాటు నిర్మాతగా, సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్న ఈ చిత్రం ఈనెల 7న విడులవుతోంది. గంగ ఎంటర్‌టైన్‌మెంట్ అధినేత మహేశ్వర్ రెడ్డి తెలుగులో సినిమాను విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. హీరో నితిన్ మాట్లాడుతూ 'ట్రైలరే ఇంత గొప్పగా ఉంటే, సినిమా ఏ స్థాయిలో ఉంటుందో అనే ఆసక్తిని పెంచింది' అని అన్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ మాట్లాడుతూ 'ఈ చిత్రం ప్రేక్షకులకు మంచి అనుభూతిని అందిస్తుంది' అని అన్నారు. నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ 'ఇలాంటి అద్భుతమైన సినిమాని థియేటర్లలోనే చూడాలి' అని అన్నారు.


విజయ్‌తో విడిపోయారా?





నటి తమన్నా భాటియా, బాలీవుడ్ నటుడు విజయ్ వర్మ రిలేషన్‌షిప్‌లో ఉన్న సంగతి తెలిసిందే. త్వరలోనే వీరు పెళ్లి కూడా చేసుకుంటున్నట్లు వార్తలు షికారు చేశాయి. అయితే, ఈ జంట ప్రస్తుతం విడిపోయినట్లు తెలుస్తోంది. తమ సోషల్‌మీడియా ఖాతాలలోనూ వారిద్దరూ కలసి ఉన్న ఫొటోలను తొలగించడంతో పాటు ఒకర్నొకరు అన్‌ఫాలో అయ్యారట. దీంతో వీరిద్దరి అనుబంధానికి బ్రేక్‌లు పడ్డాయని భావిస్తున్నారు. పరస్పర అంగీకారంతోనే ఈ నిర్ణయం తీసుకున్న వారు.. భవిష్యత్తులోనూ మంచి స్నేహితులుగా కొనసాగుదామని అనుకుంటున్నారట. కాగా, 'లస్ట్ స్టోరీస్-2' వెబ్‌సిరీస్ చిత్రీకరణలో తొలిసారి వీరి మధ్య పరిచయం ఏర్పడింది. అది ప్రేమగా మారింది.

ప్రసాద్ అనే నేను..



సప్తగిరి ప్రధాన పాత్రలో అభిలాష్‌రెడ్డి గోపిడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'పెళ్లి కాని ప్రసాద్'. కె.వై.బాబు, భాను ప్రకాశ్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర గౌడ్, వైభవ్ రెడ్డి ముత్యాల నిర్మాతలు. ప్రముఖ నిర్మాత దిల్ రాజుకు చెందిన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఈనెల 21న చిత్రాన్ని విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా నటుడు ప్రభాస్ చిత్రం టీజర్‌ని లాంచ్ చేశారు. 'ప్రసాద్ అనే నేను... కట్నం శాసనాల గ్రంథంలో ఉన్న రూల్స్ అండ్ రెగ్యులేషన్స్‌కు గౌరవం ఇస్తూ తరతరాలుగా కట్నం విషయంలో మా తాతముత్తాతలు ఫాలో అవుతున్న షరతులకు కట్టుబడి ఉంటానని మా తాతముత్తాతల మీద ప్రమాణం చేస్తున్నా' అంటూ సప్తగిరి చెప్పే డైలాగ్‌తో ప్రారంభమైన టీజర్ ఆద్యంతం నవ్వులు పూయించేలా సాగింది.

చిన్న సాయం సంతోషాన్నిచ్చింది
- వరలక్ష్మీ శరత్‌కుమార్



"నా పుట్టినరోజున ఈ చిన్నారులను కలవడం చాలా సంతోషాన్నిస్తోంది. మా వంతుగా వారికి డొనేషన్ ఇచ్చాం. ఇది చిన్న సాయమే. కానీ ఆ చిన్నారులకు పెద్ద సంతోషాన్ని అందిస్తుంది. మీరు కూడా చిన్నారులకు సాయం చేయండి" అని వరలక్ష్మీ శరత్‌కుమార్ కోరారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా లెప్రా సొసైటీలోని అనాథశ్రయంలోని చిన్నారులను కలిశారు. భర్త నికోలయ్ సచ్‌దేవ్‌తో కలసి బాలలకు బహుమతులు అందజేశారు.

ప్రేమలో కొత్త కోణం



తమిళ నటుడు మిథున్ చక్రవర్తి హీరోగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న తెలుగు-తమిళ ద్విభాషా చిత్రం 'లవ్ స్టోరీ బిగిన్స్'. వర్ష, శ్వేత కథానాయికలు. హీరో హీరోయిన్లపై తెరకెక్కించిన రొమాంటిక్ గీతాన్ని చిత్రబృందం విడుదల చేసింది. 'వస్తావా ప్రియా' అంటూ సాగే ఈ గీతానికి అమర్‌గీత్ స్వరాలందించగా, శివమణి సాహిత్యమందించారు. ప్రేమలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించే చిత్రమిదని మిథున్ చక్రవర్తి తెలిపారు.

ప్రయోగం చేశాం.. ఆదరించండి




ఆర్టిస్టులను చూపించకుండా కేవలం కథ, కథనాల మీద ఆధారపడి తీసిన సినిమా 'రా రాజా'. బి.శివప్రసాద్ దర్శకుడు. ఈ నెల 7 న విడుదలవుతోంది. మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు మాట్లాడుతూ 'నిర్మాతగా సినిమాలు చేస్తున్న టైమ్‌లో నా మైండ్‌లోకి వచ్చిన పాయింట్‌ను కథగా మార్చి, అనుకోకుండా నేనే దర్శకుడినయ్యా. సినిమా బాగా వచ్చింది' అన్నారు. ఈ సినిమాకు మంచి సంగీతం ఇచ్చే అవకాశం లభించిందని సంగీత దర్శకుడు శేఖర్‌చంద్ర, సినిమా బాగా వచ్చిందని ఛాయాగ్రాహకుడు రాహుల్ శ్రీవాత్సవ్ చెప్పారు.

మ్యూజికల్ ఎంటర్‌టైనర్



వైవిధ్యమైన ఇతివృత్తంతో రూపుదిద్దుకున్న చిత్రం 'టుక్ టుక్'. హర్ష రోషన్, కార్తికేయ దేవ్, నిహాల్ కోదాటి ముఖ్య పాత్రలు పోషించారు. ఈ నెల 21న విడుదల కానుంది. సుప్రీత్ కృష్ణ దర్శకుడు. రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీ వరుణ్, శ్రీరాములు రెడ్డి, సుప్రీత్ కృష్ణ నిర్మాతలు. మంగళవారం టీజర్‌ను విడుదల చేశారు. శాన్వీ మేఘన మాట్లాడుతూ 'సినిమా ఎంజాయ్ చేసేలా ఉంటుంది. థియేటర్‌కి వచ్చి చూడండి' అని కోరారు. 'ముగ్గురు యువకుల ప్రయాణం ఇది. అనుకోని అవాంతరాలను వారు ఎలా అధిగమించారనేది ఆసక్తికరం' అన్నారు రోషన్. దర్శకుడు మాట్లాడుతూ 'ఇదొక డిఫరెంట్ కాన్సెప్ట్. త్వరలో ఓ బిగ్గెస్ట్ సర్‌ప్రైజ్ రాబోతోంది' అని చెప్పారు.

తెలుగు ప్రేక్షకులకు థాంక్స్
- ప్రదీప్ రంగనాథన్



దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమలో ప్రముఖ నిర్మాణ సంస్థల్లో ఒకటైన ఏజీఎస్ ఎంటైన్‌టైన్‌మెంట్స్ నిర్మించిన తాజా చిత్రం 'ఎంటర్ ద డ్రాగన్'. ప్రదీప్ రంగనాథన్ హీరోగా అశ్వత మారిముత్తు రూపొందించిన ఈ చిత్రం ఇటీవల విడుదలై విజయం సాధించడంతో సోమవారం సక్సెస్‌మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్ రంగనాథన్ మాట్లాడుతూ 'థియేటర్లలో మా సినిమాకు వస్తున్న రెస్పాన్స్ చూసి దర్శకుడు అశ్వత్ ఎమోషనల్ అయ్యారు. తెలుగు ప్రేక్షకులు చూపించిన ప్రేమకు మేం ముగ్ధులమయ్యాం. వారికి థాంక్స్' అన్నారు. దర్శకుడు అశ్వత్ మారిముత్తు మాట్లాడుతూ 'రాజమౌళి నాకు స్ఫూర్తి. సినిమాలో ఎమోషన్ కనెక్ట్ అయితే అన్ని ప్రాంతాల వారికీ కనెక్ట్ అవుతుందని ఆయన నిరూపించారు. తమిళంలో మా సినిమా పెద్ద హిట్. తెలుగులో కూడా బాగా ఆదరిస్తున్నారు' అన్నారు. వినోదంతో పాటు అంతర్లీనంగా మంచి సందేశం అందించారనీ, ఫ్యామిలీతో కలసి చూడాల్సిన చిత్రం ఇదని మైత్రీ మూవీస్ రవిశంకర్ చెప్పారు. తమ సినిమాను ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకులకు అర్చనా కల్పాతి ధన్యవాదాలు తెలిపారు.

స్పోర్ట్స్

విజయవాడ ● బుధవారం 5 మార్చి 2025

చాంపియన్స్ ట్రోఫీ


కోహ్లి (84)


శ్రేయాస్ (45)

హమ్మయ్య.. ఈసారి మనదే పైచేయి. ఐసీసీ నాకౌట్ టోర్నీల్లో ఎదురుపడిన ప్రతీసారి కోట్లాది భారత హృదయాలను భగ్నం చేసే ఆస్ట్రేలియాకు రివర్స్ పంచ్ పడింది. తాజా టోర్నీలో నిలకడగా ఆడుతున్న టీమిండియా కీలక సెమీస్‌లోనూ ఎలాంటి తడబాటుకు లోనుకాలేదు. ముందున్నది ప్రమాదకర ఆసీస్ అయినా.. తమ శక్తిసామర్థ్యాలను నమ్ముకుని బరిలోకి దిగింది. స్పిన్ పవర్‌ను చూపిస్తూ ఆ జట్టును ఓ మాదిరి స్కోరుకే కట్టడి చేసింది. ఇక ఛేజింగ్‌లో రారాజు.. అందునా ఆసీస్‌పై చెలరేగే విరాట్ కోహ్లి మరోసారి కదం తొక్కాడు. శ్రేయాస్, రాహుల్ సైతం ఆసీస్ అనుభవలేమి బౌలింగ్‌పై ఆధిపత్యం చూపి జట్టును ఫైనల్‌కు చేర్చారు. ఇక 2011 వన్డే వరల్డ్‌కప్ తర్వాత ఐసీసీ నాకౌట్‌లో ఆసీస్‌పై భారత్ గెలవడం ఇదే తొలిసారి.

కంగారు 'పోయింది' ఇక టైటిల్ మిగిలింది!

ఐదోసారి ఫైనల్ చేరిన భారత్
అదరగొట్టిన విరాట్ కోహ్లి
సెమీస్‌లో ఆస్ట్రేలియా చిత్తు

దుబాయ్: ఏడాదిన్నర కిందట వన్డే వరల్డ్‌కప్ టైటిల్‌ను దూరం చేసిన ఆస్ట్రేలియాపై భారత్ బదులు తీర్చుకుంది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి (84) మాస్టర్ క్లాస్ ఇన్నింగ్స్‌తో మంగళవారం జరిగిన సెమీఫైనల్లో కంగారూలను 4 వికెట్ల తేడాతో ఓడించింది. ఫలితంగా టీమిండియా వరుసగా మూడోసారి చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో అడుగుపెట్టింది. ఈనెల 9న దుబాయ్‌లో ఫైనల్ జరుగుతుంది. నేడు న్యూజిలాండ్-దక్షిణాఫ్రికా మధ్య జరిగే మ్యాచ్ విజేత భారత్ ప్రత్యర్థి కానుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ 49.3 ఓవర్లలో 264 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ స్టీవ్ స్మిత్ (73), అలెక్స్ క్యారీ (61) అర్ధసెంచరీలతో రాణించారు. పేసర్ షమికి మూడు, స్పిన్నర్లు జడేజా, వరుణ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో భారత్ 48.1 ఓవర్లలో 6 వికెట్లకు 267 పరుగులు చేసి గెలిచింది. శ్రేయాస్ (45), రాహుల్ (42 నాటౌట్), హార్దిక్ (28), రోహిత్ (28), అక్షర్ (27) విజయంలో భాగమయ్యారు. ఎల్లిస్, జంపాలకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా విరాట్ కోహ్లి నిలిచాడు.

విరాట్ నిలకడ

ఓ మాదిరి ఛేదనను భారత్ ప్రశాంతంగా ముగించింది. గిల్ మినహా క్రీజులోకి దిగిన ప్రతీ బ్యాటరూ కీలక ఇన్నింగ్స్‌తో చెలరేగారు. ఆఖర్లో బంతికో పరుగు చొప్పున చేయాల్సి వచ్చినప్పుడు హార్దిక్ ధనాధన్ ఆటతీరుతో తేలికపరిచాడు. ఇక విరాట్-శ్రేయాస్ జోడీ మధ్య ఓవర్లలో ఆసీస్ బౌలర్లను ఆడేసుకుంది. దీనికి తోడు ఫీల్డింగ్ వైఫల్యం కూడా భారత్‌కు కలిసివచ్చింది. ఆరంభంలో రోహిత్ ఇచ్చిన రెండు క్యాచ్‌లను కూపర్, లబుషేన్ వదిలేశారు. గిల్ (8) విఫలం కాగా ఉన్న కాసేపు రోహిత్ దూకుడుగా ఆడాడు. బంతికో పరుగు చొప్పున సాధించిన అతడిని 8వ ఓవర్‌లో కూపర్ అవుట్ చేశాడు. కానీ ఆ తర్వాత మరో వికెట్ తీసేందుకు ఆసీస్ బౌలర్లు చెమటోడ్చాల్సి వచ్చింది. భారీ షాట్లకు వెళ్లకుండా ఎక్కువగా సింగిల్స్‌పై దృష్టి సారించిన విరాట్-శ్రేయాస్ మూడో వికెట్‌కు 91 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. కోహ్లి 53 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేశాడు. అదే ఫీట్‌కు సమీపంలో ఉన్న శ్రేయా‌స్‌ను 27వ ఓవర్‌లో జంపా బౌల్డ్ చేసి ఆసీస్‌కు ఊరటనిచ్చాడు. అనంతరం అక్షర్ (27)తో కలిసి నాలుగో వికెట్‌కు విరాట్ 44 రన్స్ జోడించాడు. 40వ ఓవర్‌లో జట్టు 200 రన్స్ సాధించింది. అయితే సమీకరణం బంతికో పరుగు చొప్పున మారిన వేళ విరాట్ అనవసరంగా భారీ షాట్‌కు వెళ్లి జంపా గూగ్లీకి వెనుదిరిగాడు. అప్పటికి రాహుల్‌తో కలిసి ఐదో వికెట్‌కు 47 పరుగులు జత చేరాయి. ఇక హార్దిక్ (28) లాంగాఫ్‌లో రెండు భారీ సిక్సర్లు, ఓ ఫోర్‌తో ఒత్తిడి పూర్తిగా తగ్గింది. మరో 13 బంతుల్లో ఆరు పరుగులు కావాల్సిన వేళ హార్దిక్ వెనుదిరిగినా ఇబ్బంది లేకపోయింది. రాహుల్ సిక్సర్‌తో 11 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు.


రాహుల్ (42)

స్మిత్, క్యారీ హాఫ్ సెంచరీలు

టాస్ గెలిచిన ఆస్ట్రేలియా బ్యాటింగ్‌కు దిగగా, భారత బౌలర్లు ఎప్పటిలాగే ప్రత్యర్థిని కట్టడి చేశారు. అయితే ఆరంభంలో హెడ్ వణికించగా.. మధ్య ఓవర్లలో స్మిత్, క్యారీ నిలకడ ప్రదర్శనతో 260+ స్కోరు వరకు రాగలిగింది. కెప్టెన్ రోహిత్ సరైన సమయంలో బౌలర్లను మారుస్తూ ఫలితం రాబట్టాడు. ఇక ఎప్పటిలాగే స్పిన్నర్లు ఆధిపత్యం చూపి 5 వికెట్లు పడగొట్టారు. ఆసీస్ ఆరంభం కాస్త నిదానంగానే సాగింది. ఓపెనర్ కూపర్‌ను షమి డకౌట్ చేయగా తొలి మూడు ఓవర్లలో చేసింది 4 పరుగులే. కానీ భారత్‌తో మ్యాచ్ అంటే ఊపు మీదుండే హెడ్ మరోసారి బెదరగొట్టాడు. తనదైన శైలిలో బౌలర్లపై ఎదురుదాడికి దిగడంతో పరుగుల వేగం పెరిగింది. అతడి 39 పరుగుల్లో బౌండరీల రూపంలోనే 32 రన్స్ రావడం విశేషం. అయితే బంతి వరుణ్ చేతికివ్వడంతో హెడ్ ఆట ముగిసింది. దీంతో ఆటగాళ్లతో పాటు ఫ్యాన్స్ కూడా ఊపిరిపీల్చుకున్నారు. రెండో వికెట్‌కు స్మిత్‌తో కలిసి హెడ్ 32 బంతుల్లోనే 50 పరుగుల భాగస్వామ్యం అందించాడు. అనంతరం స్మిత్ ఓపిగ్గా క్రీజులో నిలిచి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. 14వ ఓవర్ (అక్షర్)లో బంతి వికెట్లను తాకినా బెయిల్స్ కిందపడక స్మిత్ బతికిపోయాడు. ఈ చాన్స్‌ను సద్వినియోగం చేసుకుంటూ తను లబుషేన్ (29)తో కలిసి మూడో వికెట్‌కు 56 పరుగులు, నాలుగో వికెట్‌కు ఇన్‌గ్లిస్ (11)తో 34 పరుగులు, క్యారీతో కలిసి ఐదో వికెట్‌కు మరో 54 పరుగులు జత చేశాడు. అర్ధసెంచరీతో ఆత్మవిశ్వాసంతో కనిపిస్తున్న స్మిత్‌ను చివరకు 37వ ఓవర్‌లో షమి బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత బాధ్యతను క్యారీ తీసుకోవడంతో చివర్లో పరుగులు వేగంగా వచ్చాయి. 48 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసిన క్యారీ రనౌట్‌గా వెనుదిరిగాడు. మ్యాక్స్‌వెల్ (7)ను అక్షర్ బౌల్డ్ చేయగా.. డ్వార్షిస్ (19), ఎల్లిస్ (10) వేగంగా ఆడే క్రమంలో వికెట్లు కోల్పోయారు. ఆఖరి ఓవర్‌లో జంపా (7)ను హార్దిక్ అవుట్ చేయడంతో ఆసీస్ ఆట ముగిసింది.


రోహిత్, షమి (3/48

తొలి కెప్టెన్‌గా..

కెప్టెన్ రోహిత్ శర్మ అన్ని ఐసీసీ టోర్నీల్లో భారత జట్టును ఫైనల్‌కు చేర్చిన ఘనత సాధించాడు. వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (2023), వన్డే వరల్డ్ కప్ (2023), టీ20 వరల్డ్‌కప్ (2024), చాంపియన్స్ ట్రోఫీ (2025)ల్లో అతడి నాయకత్వంలో జట్టు తుది పోరుకు చేరగలిగింది.

ఒత్తిడికి లోను కాలేదు

ఈ పిచ్‌పై స్ట్రయిక్ రొటేట్ చేస్తూ భాగస్వామ్యాలను నెలకొల్పడం ముఖ్యం. సెమీస్ ఒత్తిడితో కూడిన మ్యాచ్. ఓపిగ్గా చివరి వరకు నిలబడితే ప్రత్యర్థి ఆత్మవిశ్వాసం దెబ్బతింటుంది. అందుకే నేను భారీ షాట్లకు వెళ్లకుండా ఎక్కువగా సింగిల్స్‌పై దృష్టి సారించాను. ఓ దశలో రన్‌రేట్ ఆరు వరకు వెళ్లినా ఆందోళన పడలేదు. వన్డే ఫార్మాట్‌లో అత్యుత్తమ స్థాయిలో ఉన్నానా? అంటే నేను చెప్పలేను. అలాంటి విషయాలపై దృష్టి సారించను. సెంచరీ చేసుంటే బావుండేది కానీ జట్టు విజయం అన్నింటికన్నా ముఖ్యం. **- విరాట్ కోహ్లి**

స్కోరుబోర్డు

ఆస్ట్రేలియా: హెడ్ (సి) గిల్ (బి) వరుణ్ 39; కూపర్ (సి) రాహుల్ (బి) షమి 0; స్మిత్ (బి) షమి 73; లబుషేన్ (ఎల్బీ) జడేజా 29; ఇన్‌గ్లిస్ (సి) విరాట్ (బి) జడేజా 11; క్యారీ (రనౌట్) 61; మ్యాక్స్‌వెల్ (బి) అక్షర్ 7; డ్వార్షిస్ (సి) శ్రేయాస్ (బి) వరుణ్ 19; జంపా (బి) హార్దిక్ 7; ఎల్లిస్ (సి) విరాట్ (బి) 10; తన్వీర్ సంఘా (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు 7; మొత్తం: 49.3 ఓవర్లలో 264 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-4, 2-54, 3-110, 4-144, 5-198, 6-205, 7-239, 8-249, 9-262, 10-264; **బౌలింగ్:** షమి 10-0-48-3; హార్దిక్ 5.3-0-40-1; కుల్దీప్ 8-0-44-0; వరుణ్ 10-0-49-2; అక్షర్ 8-1-43-1; జడేజా 8-1-40-2.

భారత్: రోహిత్ (ఎల్బీ) కూపర్ 28; గిల్ (బి) డ్వార్షిస్ 8; విరాట్ (సి) డ్వార్షిస్ (బి) జంపా 84; శ్రేయాస్ (బి) జంపా 45; అక్షర్ (బి) ఎల్లిస్ 27; రాహుల్ (నాటౌట్) 42; హార్దిక్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) ఎల్లిస్ 28; జడేజా (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 48.1 ఓవర్లలో 267/6. వికెట్ల పతనం:** 1-30, 2-43, 3-134, 4-178, 5-225, 6-259; **బౌలింగ్:** డ్వార్షిస్ 7-0-39-1; ఎల్లిస్ 10-0-49-2; కూపర్ 8-0-37-1; జంపా 10-0-60-2; తన్వీర్ 6-0-41-0; మ్యాక్స్‌వెల్ 6.1-0-35-0; హెడ్ 1-0-6-0.



నల్ల రిబ్బన్లతో బరిలోకి..

ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్లో భారత క్రికెటర్లు తమ భుజాలకు నల్ల రిబ్బన్లు ధరించి ఆడారు. ముంబై మాజీ స్పిన్నర్ పద్మాకర్ శివాల్కర్ సోమవారం మృతి చెందాడు. దీంతో ఆయనకు నివాళిగా ఆటగాళ్లంతా ఇలా నల్లటి రిబ్బన్లు ధరించారు.

1 ఐసీసీ వన్డే టోర్నీలో అత్యధిక సిక్సర్లు (65) బాదిన ప్లేయర్‌గా రోహిత్. క్రిస్ గేల్ (64)ను అధిగమించాడు.

వన్డేల్లో వరుస టాస్‌లు (11) కోల్పోయిన రెండో కెప్టెన్‌గా రోహిత్. పీటర్ బోరెన్ సరసన నిలిచాడు. లారా (12) ముందున్నాడు.

వన్డేల్లో ఎక్కువ క్యాచ్‌లు (161) అందుకున్న రెండో ఫీల్డర్‌గా విరాట్ కోహ్లి. జయవర్దనె (218) ముందున్నాడు. అలాగే అంతర్జాతీయ క్రికెట్‌లో 335 క్యాచ్‌లు పట్టిన తొలి భారత క్రికెటర్‌గా నిలిచి ద్రవిడ్ (334)ను అధిగమించాడు.

2 వన్డే ఛేజింగ్‌ల్లో ఎక్కువ పరుగులు (8062) చేసిన రెండో బ్యాటర్‌గా విరాట్. సచిన్ (8720) టాప్‌లో ఉన్నాడు.

1 ఐసీసీ వన్డే నాకౌట్ మ్యాచ్‌ల్లో ఆసీస్‌పై అత్యధిక ఛేదన (265) చేసిన జట్టుగా భారత్



కుల్దీప్‌పై ఎడా..పెడా

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్‌లో స్పిన్నర్ కుల్దీప్‌పై విరాట్, కెప్టెన్ రోహిత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 32వ ఓవర్‌లో స్మిత్ ఫ్లిక్ చేసిన బంతిని విరాట్ మిడ్ వికెట్ నుంచి నేరుగా కుల్దీప్ వైపు విసిరాడు. అయితే వికెట్ల దగ్గర ఉన్న కుల్దీప్ దాన్ని అందుకోకుండా వదిలేయడంతో కవర్స్‌లో ఉన్న రోహిత్ పట్టుకోవాల్సి వచ్చింది. కానీ అటు విరాట్.. ఇటు రోహిత్ ఇద్దరూ కుల్దీప్ చేసిన పనికి కోపంతో ఊగిపోతూ 'బంతి పట్టుకోవడం చేతకాదా?' అంటూ బూతులతో దుర్భాషలాడడం కనిపించింది.

నాజూకైన వాళ్లే కావాలంటే మోడల్స్‌ను తెచ్చుకోండి!

● శరీరాకృతి కాదు..ఆట ముఖ్యం

● రోహిత్‌కు గవాస్కర్ మద్దతు

దుబాయ్: కెప్టెన్ రోహిత్ శర్మ శరీరాకృతిను ఉద్దేశించి కాంగ్రెస్ మహిళా నేత షమా మహ్మద్ చేసిన వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో హిట్‌మ్యాన్‌కు మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ మద్దతుగా నిలిచాడు. క్రికెట్‌లో మానసిక బలమే ప్రధానమన్నాడు. నాజూగ్గా ఉండేవాళ్లు కావాలనుకొంటే.. మోడలింగ్ పోటీలకు వెళ్లి..అక్కడినుంచి మోడల్స్‌ను తెచ్చుకోండి' అని చురకలంటించాడు. 'క్రికెట్‌లో రాణించడమే ముఖ్యం. మిగతావన్నీ తర్వాతే. గతంలో సర్ఫరాజ్‌ను కూడా ఇలాగే లావుగా ఉన్నాడని హేళన చేశారు. కానీ, అతడు టెస్ట్ మ్యాచ్‌లో 150+ స్కోరు చేశాడు. రెండు మూడు అర్ధ శతకాలు కూడా బాదాడు. ఇక సమస్య ఏముంది? క్రికెట్‌లో శరీరాకృతి ఎలా ఉందన్నది అనవసరం. మానసికంగా ఎంత బలంగా ఉన్నాడనేది ముఖ్యం. అలాగే సుదీర్ఘంగా క్రీజులో ఉండి పరుగులు చేయగలిగితే చాలు' అని గవాస్కర్ చెప్పాడు. రోహిత్ ఊబకాయంపై షమా ఎక్స్‌లో చేసిన పోస్టు దుమారాన్ని రేపింది. కెప్టెన్సీ కూడా ఏమంత ఆకట్టుకోవడం లేదని విమర్శించింది. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో.. షమా ఆ పోస్టును తొలగించింది.

బాబర్, రిజ్వాన్ అవుట్


అకిబ్ జావెద్ సల్మాన్ ఆఘా

సల్మాన్‌కు పాక్ టీ20 పగ్గాలు
న్యూజిలాండ్‌తో సిరీస్

లాహోర్: చాంపియన్స్ ట్రోఫీలో ఆతిథ్య పాకిస్థాన్ అనూహ్యంగా గ్రూప్ దశలోనే నిష్క్రమించడంతో ఆ జట్టులోని కీలక ఆటగాళ్లపై వేటు పడింది. ఏకంగా కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్, స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్‌లను పాక్ టీ20 జట్టు నుంచి తొలగించారు. త్వరలో న్యూజిలాండ్‌తో జరిగే ఐదు మ్యాచ్‌ల సిరీస్‌కు ప్రకటించిన పాక్ జట్టులో వీళ్లిద్దరికీ చోటు దక్కలేదు. రిజ్వాన్ స్థానంలో జట్టు కెప్టెన్‌గా సల్మాన్ అలీ ఆఘాను నియమించారు. ఆల్‌రౌండర్ షాబాద్ ఖాన్‌ను జట్టులోకి తీసుకోవడంతో పాటు అతనికి వైస్ కెప్టెన్సీ పగ్గాలు అప్పగించారు. అయితే, టీ20 జట్టు కెప్టెన్‌గా, ఆటగాడిగా చోటు కోల్పోయిన రిజ్వాన్.. వన్డే సారథ్య బాధ్యతలను నిలబెట్టుకున్నాడు. వైస్ కెప్టెన్‌గా సల్మాన్‌ను ఎంపిక చేశారు. బాబర్ కూడా వన్డే జట్టులో స్థానం పదిలం చేసుకున్నాడు. సౌద్ షకీల్, కమ్రాన్ గులామ్‌లకు వన్డే జట్టు నుంచి ఉద్వాసన పలికారు. న్యూజిలాండ్ వేదికగా పాక్ ఈనెల 16 నుంచి ఐదు టీ20లు, మూడు వన్డేల సిరీస్‌ను ఆడనుంది. కాగా, చాంపియన్స్ ట్రోఫీలో విఫలమైనప్పటికీ జట్టు చీఫ్ కోచ్‌గా అకిబ్ జావెద్‌ను కొనసాగించారు. న్యూజిలాండ్ పర్యటనలో చీఫ్ కోచ్‌గా అకిబ్ ఉంటాడని పాక్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. గతేడాది ఆరు నుంచి ఎనిమిది నెలల్లోపే గిలెస్పీ, కిర్‌స్టెన్‌లు చీఫ్ కోచ్‌లుగా రాజీనామా చేయడంతో జావెద్ తాత్కాలిక కోచ్‌గా నియమితుడయ్యాడు.

పాక్ టీ20 జట్టు

సల్మాన్ ఆఘా (కెప్టెన్), షాబాద్ ఖాన్ (వైస్ కెప్టెన్), అబ్దుల్ సమద్, అబ్రార్ అహ్మద్, హారిస్ రౌఫ్, హసన్ నవాజ్, జహాన్‌దాద్ ఖాన్, ఖుష్‌దిల్ షా, మహ్మద్ అబ్బాస్ అఫ్రీది, మహ్మద్ అలీ, మహ్మద్ హారిస్, మహ్మద్ ఇర్ఫాన్ ఖాన్, ఒమర్ బిన యూసుఫ్, షహీన్ షా అఫ్రీది, సుఫ్యాన్ ముఖీమ్, ఉస్మాన్ ఖాన్.

భారత్ ప్రత్యర్థి ఎవరో?

మధ్యాహ్నం 2.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో..

న్యూజిలాండ్ X దక్షిణాఫ్రికా సెమీస్ నేడు



లాహోర్: సమవుజ్జీలుగా భావించే దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ జట్లు.. బుధవారం జరిగే రెండో సెమీఫైనల్లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఇరుజట్లలో ప్రతిభావంతులైన ఆటగాళ్లున్నా.. ఐసీసీ ట్రోఫీ విషయానికొచ్చేసరికి ఎప్పుడూ అండర్ డాగ్స్‌గానే పరిగణిస్తుంటారు. 1998లో సౌతాఫ్రికా, 2000లో కివీస్ చాంపియన్స్ ట్రోఫీ విజేతలుగా నిలిచాయి. కానీ, అప్పుడు నాకౌట్ ట్రోఫీగా వ్యవహరించడంతో.. ఇప్పుడున్నంత ప్రాధాన్యం లేదు. ఒత్తిడికి చిత్తవుతారన్న ముద్రను పోగొట్టుకోవాలని సఫారీలు భావిస్తుండగా.. ఐసీసీ పరిమిత ఓవర్ల ట్రోఫీని సాధించాలని న్యూజిలాండ్ పట్టుదలతో ఉంది. ఇరుజట్లు బ్యాటింగ్, ఫీల్డింగ్‌లో సమంగా కనిపిస్తున్నా.. స్పిన్నర్లు ఏమేరకు రాణిస్తారనే దానిపైనే జట్టు విజయావకాశాలు ఎక్కువగా ఆధారపడి ఉంటాయి. గ్రూప్-బి టాపర్‌గా నాకౌట్‌కు చేరుకొన్న సౌతాఫ్రికా జట్టులో స్పిన్నర్ కేశవ్ మహరాజ్ ఒక్కడే ఉన్నా.. బౌలింగ్ విభాగం ప్రత్యర్థితో పోల్చితే మెరుగ్గా ఉంది. బ్యాటింగ్ లో కెప్టెన్ బవుమా, రికెల్టన్, డుస్సెన్ ఫామ్‌లో ఉన్నారు. మరోవైపు గ్రూప్-ఎలో రెండో స్థానంతో సెమీస్‌కు చేరుకొన్న న్యూజిలాండ్ జట్టులో కెప్టెన్ శాంట్నర్, బ్రేస్‌వెల్ తమ మాయాజాలంతో మ్యాచ్‌ను మలుపుతిప్పగల సమర్థులు. యంగ్, విలియమ్సన్, రచిన్ రవీంద్ర, మిచెల్‌తో బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది. ఇటీవలే ఇక్కడ జరిగిన ముక్కోణపు సిరీస్‌లో 305 స్కోరును ఛేదించిన కివీస్.. ఫైనల్లో పాకిస్థాన్‌ను ఓడించి టైటిల్‌ను సొంతం చేసుకొంది. అయితే, ఈ టోర్నీలో అజేయంగా నిలిచిన సఫారీలు కూడా ఆత్మవిశ్వాసంతో ఉండడంతో.. మ్యాచ్ రసవత్తరంగా సాగే అవకాశం ఉంది. వికెట్ మందకొడిగా ఉన్నా.. బ్యాటింగ్‌కు అనుకూలం. వాతావరణం సాధారణంగా, పొడిగా ఉండనుంది.

డ్రెస్సింగ్ రూమ్‌లోకి కుటుంబ సభ్యులకు నో ఎంట్రీ!

▸▸ ఐపీఎల్‌లో కొత్త నిబంధనలు

న్యూఢిల్లీ: ఆటగాళ్ల కుటుంబ సభ్యుల విషయంలో నిబంధనలను భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ) మరింత కఠినతరం చేసింది. ఐపీఎల్‌లో అమలు చేయనున్న కొత్త రూల్స్‌ను ఆయా ఫ్రాంచైజీలకు బోర్డు ఈ-మెయిల్ చేసింది. ఈ నిబంధనలను ప్రతిఒక్కరూ తు.చ. తప్పకుండా పాటించాలని ఆదేశించింది. ప్లేయర్ల సంబంధీకులు ఎవరికీ జట్టు డ్రెస్సింగ్ రూమ్‌లోకి అనుమతి లేదని తెలిపింది. ప్రాక్టీస్ రోజుల్లో కూడా ఇవే నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేసింది. ఇక, క్రికెటర్లు టీమ్ బస్సులోనే ప్రయాణించాలని పేర్కొంది. మ్యాచ్ ముగిసిన తర్వాత జరిగే బహుమతి ప్రదాన కార్యక్రమంలో స్లీవ్‌లెస్ జెర్సీలను ధరించరాదు. అక్రిడిటేషన్ లేనిదే ప్లేయర్లు, మ్యాచ్ అఫీషియల్స్ ఉండే ఏరియా (పీఎంవోఏ)లోకి ఎవరినీ అనుమతించే ప్రసక్తేలేదని తెలిపింది. ఎవరైనా ఆటగాళ్లు రూల్స్ ఉల్లంఘనకు పాల్పడితే.. తొలుత హెచ్చరిక, పునరావృతం చేస్తే జరిమానా విధించనున్నట్టు బీసీసీఐ పేర్కొంది. కొత్త నిబంధనలను సోదాహరణంగా వివరించడానికి ఈనెల 20న ముంబైలో ఆయా జట్ల కెప్టెన్లతో సమావేశం నిర్వహించనుంది.


భారత్-ఆసీస్ మ్యాచ్‌ను తిలకిస్తున్న విరాట్ కోహ్లి భార్య అనుష్క

తెలుగుతెరపై వార్నర్ సందడి



హైదరాబాద్: మైదానంలో బ్యాట్‌తో అద్భుత ప్రదర్శన కనబరిచే ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డేవిడ్ వార్నర్ వెండితెరపై సందడి చేయనున్నాడు. అదీ ఓ తెలుగు సినిమాతో తెరంగేట్రం చేస్తున్నాడు. నితిన్, శ్రీలీల హీరోహీరోయిన్లుగా నటిస్తున్న రాబిన్‌హుడ్ సినిమాలో వార్నర్ అతిథి పాత్రలో మెరిశాడు. ఈ విషయాన్ని సినిమా నిర్మాత రవి శంకర్ వెల్లడించాడు. వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈనెలాఖరులో విడుదల కానుంది. ఇప్పటిదాకా సినిమాల్లో నటించకపోయినా వార్నర్‌కు టాలీవుడ్‌తో మంచి అనుబంధమే ఉంది. తెలుగు సినిమా హీరోల స్టయిల్స్‌ను అనుకరిస్తూ వార్నర్ చేసిన వీడియోలు ఇదివరకే సోషల్ మీడియాలో బాగా ప్రాచుర్యం పొందాయి.

రెజ్లర్ సుశీల్‌కు బెయిల్



న్యూఢిల్లీ: హత్య కేసులో నిందితుడిగా అభియోగాలు ఎదుర్కొంటున్న వెటరన్ రెజ్లర్ సుశీల్ కుమార్‌కు బెయిల్ లభించింది. ఈ కేసు విచారణలో భాగంగా మూడేళ్లుగా జైలు జీవితం గడుపుతున్న సుశీల్‌కి ఎట్టకేలకు బెయిల్ దొరికింది. ఢిల్లీలోని ఛత్రశాల్ స్టేడియంలో రెండు వర్గాల మధ్య జరిగిన కొట్లాటలో గ్రీకో రోమన్ రెజ్లర్ సాగర్ ధనకర్ (27) మృతి చెందాడు. సాగర్‌ను సుశీల్ వర్గం కొడుతున్న వీడియోలో అతడు కూడా ఉండడంతో పోలీసులు అరెస్టు చేశారు. గత ఏడాది జూలైలో ట్రయల్ కోర్టు సుశీల్‌కు బెయిల్‌ను నిరాకరించడం తెలిసిందే. సుశీల్‌తో పాటు మొత్తం 17 మంది ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

28న బాక్సింగ్ సమాఖ్య ఎన్నికలు

న్యూఢిల్లీ: భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ)కు కొత్త కార్యవర్గం ఎన్నుకునేందుకు రంగం సిద్ధమైంది. బీఎఫ్ఐ ఎన్నికలు ఈనెల 28న జరగనున్నాయి. ఈ మేరకు బీఎఫ్ఐ మంగళవారం ఎన్నికల తేదీని ప్రకటించింది. సకాలంలో కార్యవర్గ ఎన్నికలను నిర్వహించడంలో విఫలమవడంతో బీఎఫ్ఐపై ఇటీవల భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) సస్పెన్షన్ విధించిన సంగతి తెలిసిందే.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం • 5 మార్చి 2025



ఆ కదలికలన్నీ హీల్స్‌తోనే వస్తాయి!

ప్రస్తుతం సినిమా ప్రేమికులందరి దృష్టి ఐదు ఆస్కార్లు గెలుచుకున్న అనోరా చిత్రంపైనే ఉంది. ఈ చిత్రంలో ల్యాప్ డ్యాన్సర్ అయిన వేశ్య పాత్ర పోషించిన మైకీ మాడిసన్‌కు ఉత్తమ నటి అవార్డు కూడా దక్కింది. ఈ చిత్రంలో తన పాత్ర గురించి మాడిసన్ ఒక పత్రికకు ఇచ్చిన ఆసక్తికరమైన ఇంటర్వ్యూ ఇది..



"డ్యాన్సర్లకు ఒక ప్రత్యేకమైన బాడీ లాంగ్వేజీ ఉంటుంది. దీనిని పట్టుకుంటేనే పాత్రకు న్యాయం చేయగలుగుతాం. అందుకే ఈ పాత్ర చిత్రీకరణ ముందే నేను అనేక క్లబ్‌లకు వెళ్లాను. అనేక మంది డ్యాన్సర్లను కలిశాను. చాలా మంది డ్యాన్సర్ల నగ్నత్వం గురించి మాట్లాడుతూ ఉంటారు. కానీ నా దృష్టిలో వారికి ఆ నగ్నత్వమే ఒక డ్రెస్సు. ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాలు నగ్నంగా నటించాల్సి వచ్చింది. ఆ సీన్లలో ఎంతగా లీనమయిపోయానంటే.. నాకు ఎప్పుడూ నగ్నంగా ఉన్నట్లు అనిపించలేదు. చివరిలో ఒక సన్నివేశం ఉంటుంది. అందులో పూర్తిగా డ్రెస్సు వేసుకొని ఉంటా. అప్పుడు నగ్నంగా ఉన్నట్లు అనిపించింది. ఇక్కడ కాళ్లకు వేసుకొనే హీల్స్ గురించి కూడా చెప్పాలి. డ్యాన్సర్ల జీవితాల్లో ఇవి చాలా ముఖ్యమైనవి. ఎందుకంటే వారి కదలికలన్నీ ఆ హీల్స్ ద్వారానే వస్తాయి. అంతే కాదు ఈ హీల్స్ వల్ల వారి నడకలో కూడా తేడా వస్తుంది. నాకు ఎప్పటి నుంచో అలాంటి హీల్స్ వేసుకోవాలనిపించేది. ఈ చిత్రం వల్ల నాకు ఆ కోరిక తీరింది.

తక్కువ సినిమాలే..

ఇప్పటి దాకా నేను చాలా తక్కువ సినిమాలు చేశాను. ఎక్కువగా టెలివిజన్ సీరియల్స్‌లో నటించాను. అయితే ఆ సమయంలో కూడా నాకు సినిమాల్లో నటించాలని ఉండేది. ఆ సమయంలో ఒక హారర్ సినిమాలో నటించాను. ఆ సినిమా చూసిన తర్వాత 'అనోరా' చిత్రం నిర్మాతలు నన్ను సంప్రదించారు. కథ వినిపించారు. నా పాత్ర చిత్రీకరణకు రెండున్నర నెలలు పట్టింది. ఈ సినిమాలో అర్మేనియాకు.. రష్యాకు చెందిన అనేక మంది నటీనటులు ఉన్నారు. నాకు ఈ రెండు భాషలు రావు. వారు ఆ భాషల్లో మాట్లాడుతున్నప్పుడు అర్థమయినట్లు నటించేదాన్ని. కొన్ని సీన్లలో నా కళ్ల నుంచి నీళ్లు కారాలి. నాకు చిన్నప్పటి నుంచి ఏడిస్తే ఒక కంటిలో నుంచే నీళ్లు ఎక్కువగా వచ్చేవి. రెండో కంటిలో నుంచి తక్కువగా వచ్చేవి. ఈ సినిమా డైరక్టర్ సీన్ నాకు సన్నివేశం చెప్పి కెమెరా వెనక్కి వెళ్లిపోయేవారు. చిత్రీకరణ మొదలయిన వెంటనే కట్ చెప్పి... రెండో కంటిలో నీళ్లు రావటంలేదు" అనేవారు. నాకు రెండో కంటి నుంచి నీళ్లు రావంటే మొదట తను నమ్మలేదు.

ఆ తర్వాత ఆయనకు కూడా అసలు విషయం అర్థమయింది. ఇక సినిమా పూర్తయిన తర్వాత దీనిని అనేక సినిమా ఫెస్టివల్స్‌లో ప్రదర్శించారు. దీనిలో కాన్స్ గురించి ప్రత్యేకంగా చెప్పాలి. కాన్స్ ఫెస్టివల్‌లో ఒక నటిగా పాల్గొనాలనేది నా చిన్ననాటి కోరిక. ఆ కోరిక ఈ చిత్రంతో తీరింది. థియేటర్‌లో ప్రేక్షకులతో కలిసి చూడటం.. వాళ్లు చప్పట్లు కొడుతుంటే ఆనందించటం.. మరపురాని అనుభవాలు.

మృదువైన చేతుల కోసం...

మహిళలు నిత్యం ఏదో ఒక పని చేస్తూనే ఉంటారు. దీనివల్ల వారి చేతులు గరుకుగా మారుతుంటాయి. ఇంట్లోనే కొన్ని చిట్కాలు పాటించి చేతులను మృదువుగా మార్చుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

- రోజూ రాత్రి పడుకునేముందు చేతులకు మాయిశ్చరైజర్ రాసుకుంటూ ఉండాలి. షియా బటర్, కొబ్బరినూనె, ఇ విటమిన్ నూనెల్లో ఒకటి ఉన్న మాయిశ్చరైజర్ అయితే ప్రభావవంతంగా పనిచేస్తుంది.
- వెడల్పాటి గిన్నెలో మూడు గ్లాసుల గోరువెచ్చని నీళ్లు పోసి అందులో రెండు చెంచాలు ఆలివ్ ఆయిల్ వేసి కలపాలి. ఈ నీళ్లలో పావుగంటసేపు చేతులు నాననివ్వాలి. తరవాత చేతులను ఒకదానితో మరోదానిని రుద్ది మంచినీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా రెండు రోజులకు ఒకసారి చేస్తూ ఉంటే చేతుల గరుకుదనం పోతుంది.
- చేతులను నీటితో తడిపి వాటిపై కొద్దిగా పంచదార లేదా కాఫీ పొడి వేసి బాగా రుద్దితే మృతకణాలన్నీ తొలగిపోతాయి. ఇలా రాళ్ల ఉప్పుతో చేసినా మంచి ఫలితం ఉంటుంది.




- పాత్రలు తోమడానికి, బట్టలు ఉతకడానికి ఉపయోగించే లిక్విడ్ సోప్‌లు, డిష్‌వాష్ బార్‌లు, ఇతర డిటర్జెంట్‌ల వల్ల చేతులకు హాని కలుగుతుంది. కాబట్టి ఆ పనులు చేసేటప్పుడు చేతులకు గ్లోవ్స్ వేసుకోవడం మంచిది.
- నీటి శాతం ఎక్కువగా ఉన్న తాజా పండ్లను తింటూ తరచూ నీళ్లు తాగుతూ ఉండాలి. దీనివల్ల చర్మం తేమతో నిండి చేతులు మృదువుగా మారతాయి.

బాల్కనీలో మొక్కలు కనువిందుగా...

కొంతమంది ఇళ్లలో బాల్కనీ చాలా చిన్నగా ఉంటుంది. అయినప్పటికీ ఉన్న స్థలంలోనే వీలైనన్ని ఎక్కువ మొక్కలను ఎలా పెంచాలో తెలుసుకుందాం.

- బాల్కనీలో గోడవారగా స్టాండ్లను ఒకదానిపై మరోటి ఏర్పాటు చేసి వాటి మీద చిన్న కుండీలను అమర్చి వర్టికల్ గార్డెన్‌ని పెంచవచ్చు. ఇది చూడడానికి చాలా అందంగా కనిపిస్తుంది.
- బాల్కనీలో వేలాడే కుండీలను ఏర్పాటు చేసుకున్నా అహ్లాదకరంగా అనిపిస్తుంది. బరువు తక్కువగా ఉండే కుండీలను ఎంచుకుని వాటిలో తేలికపాటి పూల మొక్కలు పెంచితే బాల్కనీ ఆకర్షణీయంగా ఉంటుంది.
- బాల్కనీలో ఉన్న స్థలాన్ని పరిగణనలోకి తీసుకుంటూ కుండీల సైజుని నిర్ణయించుకోవాలి. వంకాయ, కాకర, దొండ, బీర, టమాటా, చిక్కుడు, దోస లాంటి కూరగాయలతోపాటు పచ్చిమిర్చి, కరివేపాకు, ఆయుర్వేద మొక్కలను సైతం కుండీల్లో సులభంగా పెంచవచ్చు.



- ఇంట్లో వాడకుండా పక్కన పెట్టిన స్టూల్, బెంచీ, చిన్న టేబుల్ లాంటివాటిని బాల్కనీలో అందంగా అమర్చి వాటిపై కుండీలను పెడితే బాగుంటుంది.
- చిన్న కుండీల్లో తక్కువ మట్టి ఉన్నప్పటికీ విరివిగా పెరిగే మొక్కలను ఎంచుకుంటే బాల్కనీ చిన్న తోటలా కనిపిస్తుంది.
- రంగు రంగుల పూలు, ఆకుకూరలు, తీగలాగా పాకే కూరగాయల మొక్కలను పెంచితే బాల్కనీ కనువిందుగా ఉంటుంది.

సంకల్పం



సైన్స్ అంటే చిన్నప్పటి నుంచి ఆసక్తి. అందుకే... ఇతర ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాలు వచ్చినా... కోరిమరీ వాతావరణ శాఖను ఎంచుకున్నారు. సీనియర్ అబ్జర్వర్‌గా ప్రస్థానం మొదలుపెట్టి... నేడు ఆ శాఖ దక్షిణభారత కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మేనేజర్ (డీడీజీఎం) స్థాయికి ఎదిగారు. ఈ పదవిని అలంకరించిన తొలి మహిళగా రికార్డులకెక్కారు. మూడు దశాబ్దాలకు పైగా వాతావరణ శాఖలో సేవలు అందిస్తూ... డీడీజీఎంగా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన సైంటిస్ట్-ఎఫ్, డాక్టర్ బి.అముదను 'నవ్య' పలుకరించింది.

అది పెద్ద సవాలు

"మాది తెలుగు వ్యవసాయ కుటుంబం. మా ముత్తాతల మూలాలు ఆంధ్రాలో ఉన్నాయి. అమ్మ సరస్వతి, నాన్న భక్తవత్సలు. మేం ముగ్గురం సంతానం. నాన్న మొదట్లో వేలూరు జిల్లా పల్లికొండలో టీచర్‌గా, ఆ తరువాత 1971లో చెన్నైలోని పచ్చయప్పాస్ కళాశాల ప్రొఫెసర్‌గా పని చేశారు. దాంతో నా బాల్యం, విద్యాభ్యాసం అంతా ఇక్కడే గడిచిపోయాయి. నేను 'క్వీన్ మేరీస్ కళాశాల'లో బీఎస్సీ, ఎంఎస్సీ ఫిజిక్స్ చేశాను. ఎంఎస్సీలో గోల్డ్ మెడలిస్టును. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనేది నాన్న ఆకాంక్ష. అందుకు అనుగుణంగానే నా బీఎస్సీ కాగానే ప్రభుత్వ ఉద్యోగం కోసం రకరకాల పరీక్షలు రాయించేవారు. ఇన్‌కంట్యాక్స్, ఎల్‌ఐసీ, వాతావరణశాఖ, ఇంకా తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన పరీక్షల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు వచ్చాయి.

వాతావరణశాఖనే ఎంచుకున్నా...

నేను చేసింది బీఎస్సీ ఫిజిక్స్ కాబట్టి అందుకు తగిన ఉద్యోగం వాతావరణ శాఖలో ఉంటుందని, భవిష్యత్తు కూడా బాగుంటుందని పెద్దలు చెప్పారు. అందుకే వాతావరణ శాఖను ఎంచుకున్నాను. 1991 ఏప్రిల్‌లో సీనియర్ అబ్జర్వర్‌గా ఉద్యోగంలో చేరాను. ఎంఎస్సీ అయ్యాక డిపార్ట్‌మెంటల్ పరీక్ష రాశాను. అందులో ఆలిండియా మొదటి ర్యాంకు వచ్చింది. దాంతో 1997లో సైంటిఫిక్ అసిస్టెంట్‌ను అయ్యాను. కొన్నాళ్లకు యూపీఎస్సీ రాసి, మెట్ గ్రేడ్-2 అయ్యాను. ఏడాది ట్రైనింగ్ పూర్తయ్యాక పుణేలో పోస్టింగ్ ఇచ్చారు. అక్కడే ఐదున్నరేళ్లపాటు పని చేశాను. అయితే సొంతూరుపై ఉన్న అభిమానం, అమ్మానాన్నలకు దగ్గరగా ఉండాలన్న ఉద్దేశంతో బదిలీపై చెన్నైకి వచ్చాను. అప్పటి నుంచి ఇక్కడే పని చేస్తున్నాను. 2020 కొవిడ్ కాలంలో ఏవియేషన్ హెడ్‌గా పని చేశాను. ఆ సమయంలో మిషనరీని ఆధునీకరించడంతో పాటు అప్‌గ్రేడ్ చేసే అవకాశం వచ్చింది.

డాక్టరేట్ నా కల...

పీహెచ్‌డీ చేయాలనేది నా కల. పుణేలో ఉన్నప్పుడే ఆ ప్రయత్నం చేశాను. కానీ చెన్నై వచ్చాక కానీ అది ఫలించలేదు. 2018లో పీహెచ్‌డీ పూర్తి చేశాను. యాభయ్యేళ్ల ప్రాయంలో డాక్టరేట్ అందుకున్నాను. 1999లో బీఎల్ పట్టా పొందాను. 19 జర్నల్స్‌లో నా పరిశోధనా పత్రాలు ముద్రితమయ్యాయి. ఎన్నో జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నాను.

2008లో పుణెలో ఉండగా 'ఎక్సలెన్స్ ఫర్ ఔట్‌స్టాండింగ్ పెర్ఫామెన్స్' అవార్డు, 2011లో ఐఎండీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గ్రూప్1 ఆఫీసర్స్ విభాగంలో ఉత్తమ ఉద్యోగిగా అవార్డు, 2016లో ప్రపంచ వాతావరణ సంస్థ నుంచి 'ప్రొఫెసర్ విల్హో వైశాల' అవార్డు వచ్చాయి. 'ఆల్టర్‌నేటివ్స్ ఫర్ డేంజరస్ అండ్ అబ్సలేట్ ఇన్‌స్ట్రుమెంట్స్' (ప్రమాదకరమైన మరియు వాడుకలో లేని పరికరాలకు ప్రత్యామ్నాయాలు) అనే అంశంపై నేను చేసిన కృషికి గుర్తుగా ప్రొఫెసర్ విల్హో వైశాల అవార్డు ప్రదానం చేశారు. దేశంలోనే వాతావరణ శాఖలో ఈ అవార్డు స్వీకరించిన తొలి సైంటిస్టుని నేనే. 2003-2008 కాలంలో పుణే రీజన్‌లో ఉండగా 550 ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ల కమిషన్‌కు ప్రాజెక్టు డైరెక్టర్‌గా వ్యవహరించడం సవాలుతో కూడుకున్నది.

> **ప్రపంచ వాతావరణ సంస్థలో...**
>
> **ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) నిపుణుల బృందంలో సభ్యురాలిగా నాకు మూడు అసైన్‌మెంట్లు అప్పగించారు. విధుల్లో భాగంగా ఓ ప్రాజెక్టు కోసం 2006 అమెరికాలోని వర్జీనియాకు, 2013లో కెన్యాకు, 'ప్రొఫెసర్ విల్హో వైశాల' అవార్డు స్వీకరణకు 2016లో స్పెయిన్‌కు వెళ్లాను.**

ధైర్యంగా రావచ్చు...

వాతావరణశాఖలోకి మహిళలు ధైర్యంగా రావచ్చు. ఈ శాఖలో మాకన్నా ముందు ఉద్యోగాల్లో చేరిన వారు రోస్టర్ డ్యూటీలు కూడా చేసేవారు. 1970ల నుంచే మహిళలు విమానాశ్రయాల్లోని కార్యాలయాల్లో నైట్ డ్యూటీలు కూడా చేసేవారు. అయితే ఇప్పుడు మహిళలకు జనరల్ డ్యూటీలు వేస్తున్నారు. మా విభాగంలో మహిళలకు ఎంతో ప్రోత్సాహం ఉంటుంది. సంస్థ తరుపున అంటార్కిటికా వెళ్లేందుకు చాలామంది మహిళలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. అక్కడ ఏడాది పాటు విధులు నిర్వర్తించాలి. అలాగే పలు దీవుల్లో పని చేసేందుకు కూడా ఇప్పుడు మహిళా ఉద్యోగులు ముందుకు వస్తున్నారు. ఇది శుభ పరిణామం.

సవాళ్లు ఎదురైనా...

నేను ఇన్‌స్టలేషన్, ఏవియేషన్ విభాగాల్లో కూడా పని చేశాను. విమానాలు ల్యాండ్ అవ్వాలన్నా, టేకాఫ్ అవ్వాలన్నా ముందుగా వాతావరణ శాఖ నుంచి క్లియరెన్స్ అడుగుతారు. మనం ఏమాత్రం పొరపాటుగా నివేదిక ఇచ్చినా, కోట్లాది రూపాయలతో పాటు ఎంతో ప్రాణనష్టం జరుగుతుంది. అక్కడ బాధ్యతలు నిర్వర్తించడం సవాలుతో కూడుకున్నది. అలాంటి ఏవియేషన్‌కు నేను మూడేళ్లపాటు నేతృత్వం వహించాను. నాకు అప్పగించిన ఏ పని అయినా, ప్రాజెక్టు అయినా కష్టంగా భావించలేదు. అదంతా ఒక శిక్షణలా అనుకున్నాను.

ప్రకృతిని అంచనా వేయడం కష్టం...

సైక్లోన్ మూమెంట్‌ని బట్టి ఫలానా చోట తీరం దాటుతుందని సాంకేతికత సాయంతో ఇప్పటి వరకూ చెబుతున్నాం. రాడార్, శాటిలైట్ల సాయంతో సైక్లోన్‌ను అంచనా వేసి, ఆ సమాచారాన్ని ప్రజలకు చేరవేయగలుగుతున్నాం. సముద్రంలో జరిగే పరిణామాలు, మార్పులను అంచనా వేయడం పెద్ద సవాలు. ఒక్కోసారి తుఫాను సముద్రంలో రాత్రిపూట వేగంగా పయనిస్తుంది. ఒక్కోసారి ఆరు గంటల పాటు ఒకేచోట ఆగిపోతుంది. లేదంటే నెమ్మదిగా పయనిస్తుంది. ఎందుకిలా జరుగుతుందన్నదానిని అంచనా వేయడానికి రకరకాలుగా ప్రయత్నిస్తున్నాం. మన దేశంలో విభిన్న వాతావరణ పరిస్థితులు ఉన్నాయి. అందువల్ల వాటిని అంచనా వేయడం క్లిష్టతరమైన పని. అందుకే కొన్నిసార్లు అంచనాలు తలకిందులవుతాయి. దేశ వ్యాప్తంగా 39 రాడార్లు ఉన్నాయి. ఒక్కో రాడార్ ఏర్పాటుకు రూ.25 కోట్లు ఖర్చవుతుంది. రాడార్ల సంకేతాలను అంచనా వేసి కచ్చితమైన సమాచారం అందించేందుకు వాతావరణశాఖ శాయాశక్తులా ప్రయత్నిస్తోంది. చాలామంది విదేశాల్లో అంత కచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నారని అడుగుతుంటారు. కానీ అక్కడా తుఫానులను అంచనా వేయడంలో సవాళ్లు ఉంటాయి. వాతావరణ స్థితిగతుల్లో వారికి, మనకు చాలా వ్యత్యాసం ఉంది.

ఎప్పుడూ అనుకోలేదు...

ఎంతో ఘన చరిత్ర గల చెన్నైలోని వాతావరణ కేంద్రం దక్షిణ భారత డీడీజీఎం అవడం, అందులోనూ ఈ పదివిని చేపట్టిన తొలి మహిళను నేనే కావడం చాలా సంతోషంగా ఉంది. ఈ పదవి నన్ను వరిస్తుందని ఎప్పుడూ అనుకోలేదు. నాకు అప్పగించిన బాధ్యతల్ని సమర్థవంతంగా నిర్వర్తించేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తాను. అంతేకాదు... నా సాధారణ విధులతో పాటు 'ఆర్ఎంసీ చెన్నై' హెడ్‌గా అదనపు బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నాను. ఏదిఏమైనా ముందస్తుగా హెచ్చరికలు జారీ చేసి ఎంతోమంది ప్రాణాలను రక్షించే వాతావరణ శాఖలో పని చేయడం నాకు ఎంతో గర్వంగా ఉంది."

• డాక్టర్ ఎస్‌కేఎండీ గౌస్‌బాషా, చెన్నై
ఫొటో: కర్రి శ్రీనివాస్

విజయానికి మార్గం

ఏ పనిలోనైనా విజయం సాధించాలనే ప్రతిఒక్కరూ కోరుకుంటారు. క్రమశిక్షణతోపాటు ఆరోగ్యకరమైన దినచర్యను పాటిస్తూ ఉంటే విజయం వెన్నంటి వస్తుందని నిపుణులు చెబుతున్నారు.

- ఉదయం నిద్రలేచింది మొదలు ప్రతి నిమిషాన్నీ సద్వినియోగం చేసుకునే ప్రయత్నం చేయాలి. పోషకాహారం తీసుకుంటూ మంచి అలవాట్లు అలవరచుకుంటే మెదడు సరైన రీతిలో పనిచేసి విజయపథం వైపు నడిపిస్తుంది.
- ఏ రోజు చేయాల్సిన పనిని ఆ రోజే పూర్తిచేస్తే మనసు ఉత్సాహంగా ఉంటుంది. ప్రతి పనికీ ఒక ప్రణాళికను రూపొందించుకోవడం మంచిది.
- తక్షణమే పూర్తిచేయాల్సిన ముఖ్యమైన పనులకు ముందుగా సమయం కేటాయించాలి. మిగిలినవాటి గురించి అతిగా ఆలోచించాల్సిన పని లేదు.
- నిరంతరం కొత్త అంశాల గురించి తెలుసుకుంటూ ఉండాలి. తోటివారితో సంభాషిస్తూ ఎప్పటికప్పుడు పరిచయాలు పెంచుకుంటూ ఉంటే కొత్త అవకాశాలు తలుపుతడతాయి.
- కేవలం కష్టపడే మనస్తత్వం ఉంటే చాలదు. సమయపాలన పాటిస్తూ ముందుచూపుతో మసలుకుంటే విజయం చేతికందుతుంది.



- శారీరక-మానసిక విశ్రాంతి, వ్యాయామం, ప్రశాంతంగా ఆలోచించడం వల్ల కూడా విజయం సిద్ధిస్తుంది. ఉద్యోగవ్యాపారాలను, జీవితాన్ని సమతూకంలో నిర్వహించగలగాలి.
- చాలామందికి సవాళ్లను స్వీకరించడం ఇష్టం ఉండదు. అవి ఎదురైనపుడు వెనకడుగు వేస్తుంటారు. అలాకాకుండా సమస్యలకు ఎదురు వెళ్లి వాటిని పరిష్కరించగలిగే సామర్థ్యాన్ని పెంచుకుంటే విజయం దక్కుతుంది.
- మానసిక ఉద్వేగాలను నియంత్రించుకోవడంతోపాటు చుట్టూ ఉన్న పరిస్థితులను అవగాహన చేసుకుంటూ, జాగరూకతతో వ్యవహరిస్తూ ముందుకు సాగగలిగితే విజయం సాధించడం ఏమంత కష్టం కాదు.

ఫ్యాషన్

ష్రగ్స్‌తో కొత్త లుక్

'ఎప్పుడూ అవే కుర్తీలు, అవే లెహంగాలు, అవే చీరలు. కొత్తదనమే లేదా?' అని కంగారు పడిపోవలసిన అవసరం లేదు. ఎలాంటి దుస్తులు ధరించినా, వాటికి కొత్త ఆకర్షణ చేకూరాలంటే, అదనంగా 'ష్రగ్స్' ఎంచుకోవాలి. వాటినెలా ధరించాలో, ఎలా మ్యాచ్ చేయాలో తెలుసుకుందాం!





రోజు వేసుకునే దుస్తులైనా, వేడుకల కోసం ధరించే దుస్తులైనా అదనపు హంగులు జోడించడం కోసం ష్రగ్స్‌ను ఎంచుకోవచ్చు. ఎలాంటి దుస్తులకైనా ఆధునిక సొబగును అద్దే ఒకప్పటి ష్రగ్స్ ఫ్యాషన్ మళ్లీ ఊపందుకుంది. వైవిధ్యభరితంగా కనిపించడంతో పాటు అన్ని వయసులవారికీ, అన్ని రకాల దుస్తులకు నప్పడం ష్రగ్స్ ప్రత్యేకత. కాబట్టే వీటి పట్ల సర్వత్రా ఆదరణ పెరుగుతోంది.

మ్యాచింగ్ ఇలా...

పొడవాటి ష్రగ్స్‌ను జీన్స్, టీషర్ట్‌కు జతగా ధరించవచ్చు. లాంగ్‌ఫ్రాక్‌తో మ్యాచ్ చేయవచ్చు. గౌన్స్, ఫ్రాక్స్‌తో కలిపి కూడా వేసుకోవచ్చు. అయితే ఆ రెండు రకాల దుస్తుల రంగులూ మ్యాచ్ అయ్యేలా చూసుకోవాలి. పూర్తి భిన్నమైన రంగుల్లో ఉండకుండా, రంగు, డిజైన్ల పరంగా, రెండూ దగ్గరి పోలికలు కలిగి ఉండేలా చూసుకోవాలి. హైహీల్స్, స్లింగ్ బ్యాగ్ లాంటి అదనపు హంగులు కూడా జోడిస్తే ష్రగ్స్‌లో, రెట్టింపు స్టైల్‌తో అదరగొట్టేయవచ్చు.

ఇలా ఎంచుకోవాలి

ష్రగ్‌ను ఎంచుకునేటప్పుడు సమయం, సందర్భం దృష్టిలో పెట్టుకోవాలి. సరదాగా షికారుకెళ్లేటప్పుడు వేసుకునే ష్రగ్స్‌కూ, సాయంకాలను వేడుకల్లో ధరించే ష్రగ్స్‌కూ వైవిధ్యం ఉండేలా చూసుకోవాలి. అందుకోసం సాదాసీదా కాటన్ ష్రగ్స్ మొదలు సెక్విన్స్‌తో మెరుపులు చిందించే భారీ ష్రగ్స్ అందుబాటులో ఉంటున్నాయి. వాటిలో నప్పే ష్రగ్ ఎంచుకోవాలి. అలాగే శాటిన్, స్పన్‌తో తయారయ్యే ష్రగ్స్ పార్టీలకూ, కాటన్, రెయాన్‌లతో తయారయ్యే ష్రగ్స్ డైలీ వేర్‌కూ బాగుంటాయి.

పెరిగిన జీఎస్టీ వసూళ్లు

▸ గత 10 నెలల్లో ఫిబ్రవరిలోనే అత్యధికం.. పుంజుకున్న ఆర్థిక కార్యకలాపాలు

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకున్నాయి. ఈ విషయం జీఎస్టీ వసూళ్లలో స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో గత 10 నెలల కాలంలో అత్యధికంగా నికర జీఎస్టీ వసూళ్లు అయ్యాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం మే నెలలో రూ.2,597 కోట్ల నికర జీఎస్టీ వసూలు కాగా.. ఫిబ్రవరిలో రూ.2,936 కోట్లు వచ్చాయి. జనవరిలో ఇది రూ.2,879 కోట్లుగా ఉంది. రాష్ట్రంలో ఆర్థికపరమైన కార్యకలాపాలు ఊపందుకున్నాయనే దానికి జీఎస్టీ వసూళ్లు పెరగడం అనేది ఒక సంకేతంగా చెప్పవచ్చు. మొత్తం స్థూలంగా గత ఏడాది ఫిబ్రవరితో పోలిస్తే ఈ ఏడాది ఫిబ్రవరిలో జీఎస్టీ వసూళ్లు 3.79 శాతం పెరిగాయి. కాగా, జీఎస్టీ ఆదాయంపై విశ్లేషించే కమిటీలోకి రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను సభ్యుడిగా తీసుకున్నారు. గోవా సీఎం ప్రమోద్ సావంత్‌ను కన్వీనర్‌గా నియమించారు.

'టిడ్కో' బకాయిల చెల్లింపునకు రూ.140 కోట్లు

టిడ్కో లబ్ధిదారుల బకాయిలు చెల్లింపు కోసం రూ.140 కోట్ల అదనపు బడ్జెట్ కేటాయిస్తూ మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. గత టీడీపీ ప్రభుత్వంలో టిడ్కో ఇళ్లను నిర్మించారు. లబ్ధిదారులకు ఆ ఇళ్లను అప్పగించినప్పటికీ, ఈఎంఐలు చెల్లించేందుకు నిరాకరించారు. దీంతో ఆ రుణాలు బ్యాంకుల్లో ఎన్‌పీఏ కింద మారాయి. లబ్ధిదారులు రూ.140 కోట్ల మేర బ్యాంకులకు చెల్లించాల్సి ఉంది. దీంతో టిడ్కో ప్రభుత్వ అనుమతితో రూ.140 కోట్ల ఈఎంఐలను చెల్లించి, ఇళ్లను పూర్తిస్థాయిలో నిర్మించి లబ్ధిదారులకు అప్పగించాలని నిర్ణయించింది. దీనికి అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

సెర్ప్ అదనపు సీఈఓగా శ్రీరాములునాయుడు

సెర్ప్ అదనపు సీఈఓగా ఆర్.శ్రీరాములునాయుడును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ రిజిస్ట్రార్ అయిన శ్రీరాములును.. సెర్ప్‌లో మానిటరింగ్ డైరెక్టర్‌గా డిప్యూటేషన్‌పై నియమించి, అయనకు అదనపు సీఈఓ హోదా ఇస్తారు.

మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక రక్షణ విభాగం

▸ మహిళా దినోత్సవం రోజు శక్తి యాప్ ఆవిష్కరణ: అనిత

మహిళలు, చిన్నారుల భద్రత కోసం ప్రత్యేక రక్షణ విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. ఈగల్ తరహాలో ఐజీ స్థాయి ఐపీఎస్ అధికారి దీనికి నేతృత్వం వహిస్తారన్నారు. దిశ యాప్‌తో గత ప్రభుత్వంలో రక్షణ ఉండేదన్న వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి వ్యాఖ్యలపై అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. దిశ చట్టం ప్రచారానికే పరిమితమైందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పసలేని దిశ యాప్‌ను పక్కనపెట్టి సరికొత్తగా శక్తియాప్ తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. నెట్‌వర్క్ లేని రిమోట్ ప్రదేశాల్లో కూడా పనిచేసేలా ప్రత్యేక యాప్ తెస్తామన్నారు. మార్చి 8న మహిళా దినోత్సవం నాడు సీఎం చంద్రబాబు శక్తి యాప్‌ను ఆవిష్కరిస్తారని చెప్పారు.

కొల్లేరును పరిరక్షించండి: సీపీఐ నారాయణ

న్యూఢిల్లీ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఆసియాలోనే అతి పెద్దదైన కొల్లేరు సరస్సును పరిరక్షించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'కొల్లేరు సరస్సును మత్స్య మాఫియా ఆక్రమించేసింది. కొల్లేరులో సుమారు రూ.2 వేల కోట్ల అక్రమ వ్యాపారం జరుగుతోంది. దీనికి బీజేపీ ఎమ్మెల్యే నేతృత్వం వహిస్తున్నారు. విజయవాడ మునిగిపోవడానికి కొల్లేరు ముఖద్వారం నుంచి ఉప్పుటేరు వరకు ఆక్రమణలే కారణం. పర్యావరణ హితం గురించి మాట్లాడే ప్రధాని కొల్లేరు సరస్సును ఎందుకు పట్టించుకోవడం లేదు?' అని ప్రశ్నించారు.

ఉద్యోగ వయోపరిమితి 42 ఏళ్లు

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమయ్యేవారికి కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఉద్యోగార్థుల వయోపరిమితిని 42 ఏళ్లుగా కొనసాగిస్తున్నట్టు పేర్కొంది. ఈ మేరకు చీఫ్ సెక్రటరీ కె. విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నాన్ యూనిఫాం సర్వీసుల ఉద్యోగాలకు గతంలో పెంచిన గరిష్ఠ వయోపరిమితిని కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఏపీపీఎస్సీ, ఇతర బోర్డులు భర్తీ చేసే యూనిఫాం సర్వీసుల పోస్టులకు వయోపరిమితిని రెండేళ్లు పెంచారు. ఈ సడలింపు ఈ సంవత్సరం సెప్టెంబరు వరకు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తెల్ల పేపరుపైనే హాల్ టికెట్: ఇంటర్ బోర్డు

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు తమ హాల్ టికెట్లను తెల్ల పేపరుపైనే ప్రింట్ తీసుకోవాలని ఇంటర్మీడియట్ బోర్డు పరీక్షల నియంత్రణాధికారి సుబ్బారావు సూచించారు. రంగుల పేపర్లపై ప్రింట్ తీసిన హాల్ టికెట్లను అనుమతించబోమని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

వైసీపీ ప్రచారం బుట్టదాఖలు

▸ నిరుద్యోగుల ఓట్లు కూటమికే.. నిరుద్యోగ జేఏసీ ప్రకటన

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కూటమి అభ్యర్థులకు ఓట్లు వేయొద్దని వైసీపీ చేసిన ప్రచారాన్ని నిరుద్యోగులు బుట్టదాఖలు చేశారని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్ధిక్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిరుద్యోగులంతా కూటమి అభ్యర్థులకే ఓట్లు వేసి గెలిపించారని అన్నారు. మెగా డీఎస్సీ ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తారని.. చంద్రబాబుపై ఉన్న విశ్వాసంతోనే కూటమికి తాము మద్దతిచ్చినట్లు తెలిపారు.

అచ్చెన్న వ్యాఖ్యలు అవమానకరం: యూటీఎఫ్

ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల విషయంలో యూటీఎఫ్‌కు వైసీపీ ముసుగు వేస్తూ మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు ఉపాధ్యాయ ఉద్యమాన్ని అవమానపరిచేలా ఉన్నాయని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. మంత్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కూటమి మద్దతు పలికిన అభ్యర్థి ఓడిపోవడం.. ప్రభుత్వం విద్యారంగంలో అనుసరిస్తున్న విధానాలకు చెంపపెట్టు అని విమర్శించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఎత్తివేత

రాష్ట్రంలో గుంటూరు-కృష్ణా, తూర్పు-పశ్చిమ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు ప్రకటించడంతో ఎన్నికల కోడ్ ఎత్తి వేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.


ఉర్దూ పాఠశాలల పని వేళలు మార్పు

▸ రంజాన్ నెలలో మధ్యాహ్నం వరకే బడులు

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రంజాన్ నెలలో రాష్ట్రంలోని అన్నిరకాల ఉర్దూ పాఠశాలల/కళాశాలల పనివేళలను మార్పు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయుల విజ్ఞప్తి మేరకు ఈ నెల 30వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉర్దూ పాఠశాలలు నడుస్తాయని పేర్కొన్నారు.

మదీనాలో మరణించినా.. మాతృభూమికి!

టీడీపీ సహకారంతో స్వదేశానికి గుంటూరు మహిళ మృతదేహం



అబిదా సుల్తానా

సౌదీ అరేబియాలోని మదీనలో మరణిస్తే స్వర్గ ప్రాప్తి కలుగుతుందని ముస్లింల ప్రగాఢ విశ్వాసం. మదీనలో ప్రవక్త మొహమ్మద్ సమాధి ఉండడం దీనికి కారణం. మక్కా, మదీనాల్లో మరణించిన యాత్రికులను స్థానికంగానే ఖననం చేస్తారు తప్ప.. స్వదేశాలకు తరలించడానికి ఇష్టపడరు. అయితే, ఇస్లాం తీర్థయాత్రలో భాగంగా మదీనాకు వచ్చిన గుంటూరుకు చెందిన అబిదా సుల్తానా అనారోగ్యానికి గురై ఫిబ్రవరి 21న మరణించారు. ఆమె మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకెళ్తానంటూ భర్త సిరాజ్ ఖాదర్ బేగ్ పట్టుబట్టారు. మృతురాలి బంధువులు టీడీపీ ఎన్నారై విభాగాన్ని సంప్రదించగా ప్రవాసీ వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎన్నారై విభాగం కోఆర్డినేటర్ రాజశేఖర్ ఈ విషయాన్ని సౌదీలోని టీడీపీ ఎన్నారై ప్రతినిధి జానీ బాషా, ఏపీ ఎన్నారై కోఆర్డినేటర్ ముజమ్మిల్ షేక్‌ల దృష్టికి తీసుకెళ్లారు. వారు వెంటనే స్పందించి సహకరించడంతో ఇటీవల అబిదా బేగం మృతదేహాన్ని భారతదేశానికి తరలించారు.

- ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి

అల్లాటప్పా అంబులెన్స్ కాదు!

అలిపిరి ఘటనలో చంద్రబాబును కాపాడిన చరిత్ర

రుయా ప్రాంగణంలో ఇలా శిథిలావస్థలో..





ఇప్పుడంటే ఇలా తిరుపతి రుయా ఆస్పత్రి ప్రాంగణంలో చెత్తా చెదారం మధ్య పడి ఉందిగానీ ఈ అంబులెన్స్‌కు ఘనమైన చరిత్రే ఉంది. ప్రధానమంత్రులు, రాష్ట్రపతులు, ముఖ్యమంత్రులు.. వీవీఐపీలు ఎవరు తిరుమలకు వచ్చినా వారి కాన్వాయ్‌లో తిరిగేది. 2003 అక్టోబర్‌లో అలిపిరిలో నక్సల్స్ క్లైమోర్ మైన్ పేలుడులో గాయపడ్డ అప్పటి సీఎం చంద్రబాబును ఆగమేఘాల మీద ఆస్పత్రికి చేర్చింది ఈ అంబులెన్సే. వైఎస్సార్, రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డి దాకా... సీఎంల కాన్వాయ్‌లోనూ ఉండేది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అప్పటి సీఎం జగన్ తిరుమల పర్యటనకు వచ్చారు. ఆ కాన్వాయ్‌లో వెళ్లిన ఈ అంబులెన్సును అధికారులు పరిశీలించి ఇక తీసుకురావద్దని ఆదేశించారు. దాంతో ఆ స్థానంలో కొత్త అంబులెన్సు చేరిపోయింది. అప్పటికే 16 ఏళ్ల సేవలు అందించిన ఈఅంబులెన్స్ ఇదిగో ఇలా....మట్టిలో శిథిలమైపోతోంది.

- తిరుపతి (వైద్యం), ఆంధ్రజ్యోతి

విజయం పరిపూర్ణం

రెండు పట్టభద్ర ఎమ్మెల్సీలూ కూటమి కైవసం



ఎమ్మెల్సీ ఎన్నికల విజయోత్సవ సభలో సీఎం చంద్రబాబు, ఆలపాటి రాజేంద్రప్రసాద్, పేరాబత్తుల రాజశేఖర్, మంత్రులు లోకేశ్, మనోహర్, సత్యకుమార్, అచ్చెన్నాయుడు, రామానాయుడు

▸ కృష్ణా-గుంటూరులో తొలి ప్రాధాన్య ఓట్లతోనే ఆలపాటి విజయ దుందుభి

▸ ఉమ్మడి గోదావరిలోనూ కూటమిదే గెలుపు

గుంటూరు/ఏలూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ కూటమి సంపూర్ణ విజయం సాధించింది. ఉమ్మడి కృష్ణా-గుంటూరు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తిరుగులేని ఆధిక్యంతో ఘనంగా గెలువగా.. ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలో గ్రాడ్యుయేట్లు తొలిసారి టీడీపీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరాన్ని గెలిపించారు. రెండు పట్టభద్రుల సీట్లకు ఓట్ల లెక్కింపు సోమవారం నుంచి మంగళవారం మధ్యాహ్నంవరకు కొనసాగింది. కూటమి అభ్యర్థులిద్దరూ ప్రతి రౌండ్‌లోనూ భారీ మెజారిటీ సాధించారు.

ఆలపాటికి అఖండ మెజారిటీ..

ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఓట్ల లెక్కింపులో తొలి రౌండ్ నుంచి ఆఖరి రౌండ్ వరకు అంతకంతకూ మెజారిటీ సాధిస్తూ వచ్చారు. తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపులోనే మంగళవారం ఉదయం ఫలితం వెలువడింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి-గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి చేతుల మీదుగా మధ్యాహ్నం గుంటూరు కలెక్టరేట్‌లో.. ఎమ్మెల్సీగా గెలుపొందినట్లు ఆయన డిక్లరేషన్ ఫాం అందుకున్నారు. ఈ నియోజకవర్గానికి గత నెల 27న పోలింగ్ జరిగిన సంగతి తెలిసిందే. పోలింగ్ కేంద్రాలు, పోస్టల్ బ్యాలెట్లలో కలిపి మొత్తం 2,41,774 ఓట్లు పోల్ అయ్యాయి. పోలైన ఓట్లలో 26,909 ఓట్లు చెల్లుబాటు కాలేదు. దాంతో మిగిలిన 2,14,865 ఓట్లను లెక్కించారు. వీటిల్లో కోటా ప్రకారం 1,07,433 తొలి ప్రాధాన్య ఓట్లు వస్తే ఆ అభ్యర్థి విజేతగా నిలుస్తారు. కాగా, ఆలపాటికి మొత్తం 1,45,057 ఓట్లు వచ్చాయి. చివరి రౌండ్ పూర్తయ్యే సరికి 82,320 ఓట్లు మెజారిటీ సాధించారు. సమీప ప్రత్యర్థి, సిటింగ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు(పీడీఎఫ్) 62,737 ఓట్లు మాత్రమే సాధించారు. బరిలో ఉన్న మిగతా 23 మందిలో ఏ ఒక్కరికీ వెయ్యి ఓట్లు దాటలేదు.

కూటమి ఏకపక్షంగా..

ఉమ్మడి ఉభయగోదావరి పట్టభద్రుల స్థానంలో టీడీపీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం, పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులుపై ఘనవిజయం సాధించారు. ఓట్లలెక్కింపులో తొలి రౌండ్ నుంచి చివరి వరకు రాజశేఖరం ఆధిక్యం ప్రదర్శించారు. పోలైన 2,18,997 ఓట్లలో ఆయనకు 1,24,702 ఓట్లు లభించాయి. మరో రౌండ్ ఉండగానే విజయానికి అవసరమైన మొదటి ప్రాధాన్య ఓట్లు సాధించారు. సమీప పీడీఎఫ్ అభ్యర్థి వీరరాఘవులుకు కేవలం 42,241 ఓట్లు వచ్చాయి. దీంతో రాజశేఖరం 77,461 ఓట్ల ఆధిక్యంతో విజయం పొందినట్లు అధికారులు ప్రకటించారు. ఈ పట్టభద్రుల స్థానంలో టీడీపీ గెలుపొందడం దాదాపు ఇదే మొదటిసారి.

'కూటమి'పై పట్టభద్రుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం

▸ గెలిచిన ఎమ్మెల్సీలకు అభినందనలు: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందిన కూటమి అభ్యర్థులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. ఈమేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన చేశారు. ' ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల ఘన విజయం సాధించారు. దీనితో కూటమి ప్రభుత్వంపై ఎంత నమ్మకం పెట్టుకున్నారో అర్థమైంది. కూటమి ప్రభుత్వంపై పట్టభద్రులు, మేధావులు ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకొంటాం' అని పవన్ పేర్కొన్నారు.

చెల్లడం లేదబ్బా!

▸ చదువుకున్నవారిలో అవగాహన లోపం!!

▸ పట్టభద్రుల స్థానాల్లో భారీగా చెల్లని ఓట్లు

▸ ఉభయగోదావరిలో 19,789 ఓట్లు

▸ కృష్ణా-గుంటూరులో 26,909

ఏలూరు/గుంటూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): విద్యావంతులైన పట్టభద్రులు మాత్రమే వేసే ఓట్లలో చాలామటుకు చెల్లకపోవడం ఆందోళన కలిగిస్తోంది. చదువుకున్నవారు బ్యాలెట్ పేపర్‌పై సరిగా ఓటేయలేకపోవడానికి అవగాహనాలోపమే కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో పోలైన 1,99,208 ఓట్లలో 19,789 చెల్లకుండా పోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. కృష్ణా-గుంటూరు స్థానంలో కూడా 2,41,774 ఓట్లు పోలవగా.. 26,909 ఓట్లు చెల్లుబాటు కాలేదు. గత నెల 27న పోలింగ్‌కు ముందే.. బ్యాలెట్ పత్రంలో అభ్యర్థుల పేర్ల ఎదుట ఉన్న బాక్సుల్లో ప్రాధాన్య క్రమంలో అంకెలుగా ఓటు వేయాలని పదేపదే సూచించారు. ప్రాధాన్య క్రమంలో ఒకటి అంకె కలిగిన ఓటు ఫలితాన్ని నిర్దేశిస్తుందని కూడా ఎన్నికల కమిషన్ నుంచి పార్టీల అభ్యర్థులు, నేతల వరకు విడమరచి చెప్పారు. ఒకటి గానీ, మరే ప్రాధాన్య కలిగిన అంకెను గానీ ఒకరికి మించి వేయరాదని, అలా వేస్తే ఆ ఓటు మురిగిపోతుందని ప్రచారం చేశారు. కానీ ఓట్ల లెక్కింపులో ప్రతి రౌండ్‌లోనూ చెల్లని ఓట్లు భారీగా దర్శనమిచ్చాయి. ఈసారి పట్టభద్రులు పెద్దసంఖ్యలో ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. తీరా ఓటుకి వచ్చేసరికి గత ఎన్నికల కంటే ఈసారి పెరిగిన ఓట్లకు తగినట్లుగా చెల్లని ఓట్ల సంఖ్య భారీగా పెరిగింది. రాజకీయ చైతన్యానికి ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలు ప్రతీక. అలాంటిది ఇక్కడి పట్టభద్రులు ఓటు వేసే విషయంలో నిబంధనలు పాటించక వేల సంఖ్యలో ఓట్లు చెల్లుబాటు కాకుండా పోయాయి. ఈ నియోజకవర్గంలో మొత్తం 3,47,116 మంది ఓటర్లుగా నమోదయ్యారు. ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో 26,909 మంది.. బ్యాలెట్ పేపర్‌పై ఓటు వేయడంలో పొరబాట్లు చేశారు.

9 నెలల్లో అధికారం.. 9 నెలల్లో సంక్షేమం

ఇది టీడీపీకే సాధ్యం

▸ పులివెందుల ఎమ్మెల్యే ఇంకా కోలుకోలేదు: లోకేశ్

ఈవీఎం అయినా, బ్యాలెట్ అయినా గెలుపు కూటమిదేనని మంత్రి లోకేశ్ అన్నారు. పార్టీ స్థాపించిన 9 నెలల్లో అధికారంలోకి రావడమైనా.. అధికారం చేపట్టిన 9 నెలల్లో సంక్షేమం, అభివృద్ధి చేసి చూపించడమైనా టీడీపీకే సాధ్యమని చెప్పారు. '9 నెలల్లో అధికారంలోకి వచ్చిన ఘనత ఎన్టీఆర్‌ది అయితే, 9 నెలల్లో సంక్షేమాన్ని చేసి చూపించిన ఘనత చంద్రబాబుది. ఎమ్మెల్సీ ఎన్నికల బరిలోకి దిగే సమయంలో ఆయన ఒకే మాట అన్నారు.. వట్టి గెలుపు కాదు.. భారీ మెజారిటీతో గెలుపు కావాలని చెప్పారు. ఆ ప్రకారం ఓటర్లు మాకు భారీమెజారిటీ కట్టబెట్టారు. ప్రస్తుతం కౌన్సిల్‌లో సంఖ్యాబలం తక్కువ ఉన్నా మన ఎమ్మెల్సీలు పులుల్లా పనిచేస్తున్నారు. వారికి మరో ఇద్దరు తోడవడం ఆనందంగా ఉంది. ఈ నెలలోనే నామినేటెడ్ పదవులన్నీ భర్తీ చేస్తున్నాం' అని ప్రకటించారు. ప్రజలు కొట్టిన దెబ్బకు పులివెందుల ఎమ్మెల్యే ఇంకా కోలుకోలేదన్నారు. ఒక రోజు ఎమ్మెల్యేగా జగన్ ముద్ర వేసుకున్నారని.. ప్రజలు ఇవ్వని ప్రతిపక్ష హోదా కోసం ఒక రోజు అసెంబ్లీకి వచ్చి.. ప్రతిపక్ష హోదా ఇవ్వాలని అడిగి బెంగళూరు వెళ్లిపోతారని ఎద్దేవా చేశారు.

వైసీపీకి చెంపపెట్టు: మంత్రి సత్యకుమార్

2024 ఫలితాలకంటే ఘన విజయాన్ని అందించి కూటమి ప్రభుత్వంపై ఓటర్లు రెట్టింపు నమ్మకాన్ని చూపారని బీజేపీ సీనియర్ నేత, మంత్రి సత్యకుమార్ అన్నారు. ఈ ఫలితాలు వైసీపీకి చెంపపెట్టన్నారు.

కష్టకాలంలో కలిసి ఉంటామని..: నాదెండ్ల

జనసేనకు చెందిన మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. ప్రభుత్వంపై నమ్మకంతో వారి భవిష్యత్ కోసం పట్టభద్రులైన యువత కూటమికి ఓట్లు వేశారని పేర్కొన్నారు. చిన్న చిన్న మనస్పర్థలు సహజమైనా కష్టకాలంలో కలిసి ఉంటామని ఈ ఎన్నికలు నిరూపించాయన్నారు.

'కూటమి' కుమ్మేసింది!

పట్టభద్ర స్థానాల్లో అఖండ విజయం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

వైసీపీ హయాంలో 3 పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో విజయం... గత జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తిరుగులేని విజయం... ఇప్పుడు జరిగిన రెండు పట్టభద్ర ఎమ్మెల్సీ స్థానాల్లో అఖండ విజయం! ఇదీ... తెలుగుదేశం పార్టీ, కూటమి విజయ ప్రస్థానం! అధికారం చేపట్టిన 8 నెలలకే కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత ఆకాశాన్నంటుతోందని... వివిధ కారణాల వల్ల విద్యావంతులు గుర్రుగా ఉన్నారని... పట్టభద్ర ఎన్నికల్లో గుణపాఠం చెప్పబోతున్నారని వైసీపీ దుష్ప్రచారమంతా కూటమి అభ్యర్థుల గెలుపు ముందు దూదిపింజలా తేలిపోయింది. వైసీపీ విమర్శలకు పట్టభద్ర ఓటర్లు దీటుగా బదులిచ్చారు. పేరుకు ఇవి రెండు పట్టభద్ర నియోజకవర్గ ఓటర్లు మాత్రమే! కానీ... నాలుగు ఉమ్మడి జిల్లాల్లో 67 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పట్టభద్ర ఓటర్లు చెప్పిన తీర్పు ఇది! ఇక ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఎన్నికలో టీడీపీ మద్దతు ఇచ్చిన ఇద్దరు అభ్యర్థుల్లో ఒకరైన పీఆర్టీయూ నేత గాదె శ్రీనివాసులు నాయుడు విజయం సాధించారు.

అసాధారణ, అఖండ మెజారిటీలు...

మొదటి ప్రాధాన్య ఓటుతోనే టీడీపీ అభ్యర్థులు రెండు చోట్లా విజయదుందుభి మోగించారు. కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ 82వేలు... ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా పేరాబత్తుల రాజశేఖర్ 77వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల నుంచి సుమారు 7 లక్షల మంది ఓటర్లుగా ఉండగా సుమారు 4.60 లక్షల ఓట్లు పోలయ్యాయి. ఇందులో 65 శాతం ఓట్లు కూటమి అభ్యర్థులకే పడ్డాయి. ఆలపాటి రాజా 1,45,057 ఓట్లు సాధించి మొత్తం ఓట్లలో 67.51 శాతం ఓట్లు సాధించారు. పేరాబత్తుల రాజశేఖర్ 1,24,702 ఓట్లు సాధించి మొత్తం ఓట్లలో 62.5 శాతం పైగా ఓట్లు సాధించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఉభయ గోదావరి జిల్లాల్లో కూటమి అభ్యర్థులకు 59.28 శాతం ఓట్‌షేర్ రాగా నేడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు షేరు మరింత పెరిగి 62.59 శాతానికి చేరడం గమనార్హం.

> వైసీపీ అధికారంలో ఉండగా... 2023లో జరిగిన మూడు పట్టభద్ర స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు రెండో ప్రాధాన్య ఓట్లతో గెలిచారు.
>
> సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కూటమికి దక్కిన ఓట్ల వాటా... 57 శాతం.
>
> ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగిన నాలుగు ఉమ్మడి జిల్లాల్లో కూటమి అభ్యర్థులకు దక్కిన ఓట్లు 58 శాతం.
>
> ప్రస్తుతం రెండు పట్టభద్ర స్థానాల్లో టీడీపీ అభ్యర్థులకు దక్కిన ఓట్లు 65 శాతం.

నాడు రెండో ప్రాధాన్య ఓటుతో..

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు 2023లో ఉమ్మడి కడప, కర్నూలు, అనంతపురం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి... ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం పట్టభద్రుల స్థానానికి, ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల స్థానానికి ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో మూడుచోట్లా టీడీపీ అభ్యర్థులు రెండో ప్రాధాన్య ఓటుతో విజయాన్ని కైవశం చేసుకున్నారు. అప్పటి ఫలితాలు వైసీపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతకు అద్దం పట్టాయి. నేటి ఫలితాలు కూటమి ప్రభుత్వంపై ఉన్న నమ్మకాన్ని నిలబెట్టాయి. శాసనమండలిలో ఐదు పట్టభద్ర స్థానాలుండగా... తాజా గెలుపుతో ఆ అయిదూ టీడీపీ ఖాతాలో పడ్డాయి. అధికారంలో ఉండగానే 'పట్టభద్రుల' చేతిలో వైసీపీ ఘోరంగా దెబ్బతింది. దీంతో... ఇప్పుడు అసలు అభ్యర్థిని నిలిపేందుకు సాహసించలేదు. ఇప్పుడు వైసీపీ ముద్రతో కృష్ణా, గుంటూరు పట్టభద్రుల స్థానంలో పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు మరింత ఎక్కువ నష్టపోయారు. ఆయనకు వైసీపీ మద్దతు ఇస్తోందనే కారణంతో... ఓటర్లు కూటమికి మద్దతుగా ఓటు వేశారు. ఇక... ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ మద్దతు ఇచ్చిన యూటీఎఫ్ అభ్యర్థి ఏకంగా మూడో స్థానానికి పడిపోయారు. ఇదీ... వైసీపీకి అటు పట్టభద్రులు, ఇటు ఉపాధ్యాయులు ఇచ్చిన అసలైన 'మాస్టర్ స్ట్రోక్'!

వైసీపీ ఆటలు సాగనివ్వను!

● అందరం కలిసి పనిచేస్తే ఫలితాలు అనూహ్యంగా ఉంటాయనడానికి తాజా ఎమ్మెల్సీ ఎన్నికలే నిదర్శనం. ఈ ఐకమత్యం శాశ్వతంగా ఉండాలని మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలను కోరుతున్నా.

● నాకు జీవితంలో ఏమీ అవసరం లేదు. రాష్ట్రానికి సుపరిపాలన అందించాలన్నదే నా లక్ష్యం. రాష్ట్ర ప్రయోజనాలే నా ప్రయోజనాలు. - సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

గెలుపు సంబరాలను మంగళవారమిక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. కొందరు టీడీపీ, ఎన్డీయే నాయకులు.. వైసీపీ నాయకుల కోసం పనిచేస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఎన్డీయే నాయకులు పనిచేయాల్సింది ఎన్డీయే కార్యకర్తలకు మాత్రమేనని గుర్తుంచుకోవాలని హితవుపలికారు. 'రాజధాని పేరుతో 3 ముక్కలాట ఆడారు. అమరావతిని శ్మశానం అన్నారు. రాజధానిని అభివృద్ధి చేయకుండా సర్వనాశనం చేశారు. కూటమి ప్రభుత్వం రాగానే ప్రపంచబ్యాంకు నిధులు తీసుకొచ్చి తిరిగి గాడిన పెట్టే ప్రయత్నం చేస్తున్నాం. పోలవరం ప్రాజెక్టు 2019 నాటికి 72 శాతం పనులు పూర్తయ్యాయి. వైసీపీ దానిని నిర్వీర్యం చేసింది. టీడీపీ ప్రభుత్వం కొనసాగి ఉంటే 2020కే పూర్తి చేసి జాతికి అంకితం చేసే వాళ్లం. వైసీపీ నిర్వాకం కారణంగా డయాఫ్రం వాల్ ధ్వంసమైంది. అది చూసి బాధపడినవారిలో నేను మొదటివాడిని. విశాఖ స్టీల్ ప్లాంట్ పనైపోయిందని అనుకున్నారు. రాష్ట్ర ప్రజల సెంటిమెంట్‌ను నిర్వీర్యం చేయొద్దని కేంద్రాన్ని కోరాను. ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చి గాడిలో పెట్టేందుకు కేంద్రం పూర్తి సహకారం అందిస్తోంది.' అని వివరించారు. ఇంకా ఏమన్నారంటే..

హామీలన్నీ ఒక్కటొక్కటిగా.. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. ఆర్థిక అరాచకానికి పాల్పడ్డారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఇచ్చిన హామీలు ఎలా నెరవేర్చాలా అన్న ఆలోచనతో నిద్ర కూడా పట్టలేదు. కేంద్రాన్ని ఏమడగాలో తెలియని పరిస్థితి నుంచి నెమ్మదిగా రాష్ట్రాన్ని గాడిన పెడుతూ వచ్చాం. ఇచ్చిన హామీలన్నీ ఒక్కటొక్కటిగా నెరవేరుస్తూ వస్తున్నాం.

పట్టభద్రుల స్థానాల్లో భారీ మెజారిటీ..

కూటమి ప్రభుత్వం వచ్చిన 9 నెలల్లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా ప్రజల నమ్మకాన్ని మరోసారి పొందగలిగాం. 2024 ఎన్నికలు చరిత్ర సృష్టిస్తే, ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు ఆ చరిత్రను సుస్థిరం చేశాయి. మొదటి ప్రాధాన్య ఓటుతోనే ఇద్దరు ఎమ్మెల్సీలు గెలవడం గొప్ప విషయం. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా కూటమి బలపరచిన ఇద్దరు అభ్యర్థులు మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. పట్టభద్రుల స్థానాల్లో ఇంత భారీ మెజారిటీ రావడం ఇదే మొదటిసారి.

పార్టీని గౌరవించేవారిని పార్టీ గౌరవిస్తుంది

సీటు కోల్పోతే ధైర్యం కోల్పోకుండా పనిచేయడం ముఖ్యం. పార్టీపరంగా తీసుకునే నిర్ణయాలను గౌరవించినవారిని.. తిరిగి గౌరవించే బాధ్యత పార్టీ తీసుకుంటుంది. తెనాలి సీటు నాదెండ్ల మనోహర్‌కు ఇవ్వాల్సి వస్తోందని చెప్పగానే ఆలపాటి త్యాగం చేశారు. ఆలపాటి గెలుపు కోసం మనోహర్ కూడా తీవ్రంగా శ్రమించారు.


ఎవరికీ దక్కని అదృష్టం నాది: ఆలపాటి

టీడీపీలో ఎవరికీ దక్కని అదృష్టం తనకు దక్కిందని నూతన ఎమ్మెల్సీ ఆలపాటి రాజా పేర్కొన్నారు. ఈ గెలుపు తన బాధ్యతను మరింత పెంచిందని పేరాబత్తుల రాజశేఖరం తెలిపారు.

బనకచర్లతో ఎవరికీ నష్టం లేదు

గోదావరి వృథా నీటినే తరలిస్తున్నాం: చంద్రబాబు

పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు వల్ల ఎవరికీ నష్టం ఉండదని, సముద్రంలోకి వెళ్లే నీటినే కరువు ప్రాంతాలకు తరలిస్తున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 'తెలంగాణలో ఉండేవారితోపాటు తెలుగు ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. గోదావరి జలాలను బనకచర్లకు తీసుకెళ్లడం వల్ల ఎవరికీ నష్టం జరగదు. సముద్రంలోకి వృథాగా వెళ్లే నీటినే తరలిస్తున్నాం. దీనిని కూడా ఓ పార్టీ రాజకీయం చేస్తోంది. ఒకరు మాట్లాడితే తాము వెనుకబడి పోతామని మరికొందరు మాట్లాడుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును నేను ఏనాడూ వ్యతిరేకించలేదు. గోదావరి ఒక్కటే తెలుగు ప్రజలకు శ్రీరామరక్ష. గోదావరిపై ప్రాజెక్టులు కట్టండి. తెలంగాణలోని కరువు ప్రాంతాలకు కూడా గోదావరి నీటిని తరలించుకోవచ్చు. నదుల అనుసంధానం జరిగితే సముద్రంలోకి వెళ్లే వృథాజలాలను సమర్థంగా వినియోగించుకోవచ్చు' అని తెలిపారు.



బీసీల ద్రోహి జగన్: మంత్రి సవిత



"బీసీలు అంటేనే టీడీపీ.. టీడీపీ అంటేనే బీసీలు." అని మంత్రి సవిత అన్నారు. మండలిలో బీసీల సంక్షేమంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. బీసీలతో ఓటు వేయించుకుని గత వైసీపీ ప్రభుత్వం వారిని మోసం చేసిందని విమర్శించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకాల కోసం రూ.896.71 కోట్లు విడుదల చేశామన్నారు. రూ.250 కోట్లతో లక్ష మంది మహిళలకు టైలరింగ్ శిక్షణతోపాటు కుట్టుమిషన్లను ఉచితంగా ఇవ్వబోతున్నట్లు తెలిపారు. గతప్రభుత్వం చేనేతలను మోసం చేసిందని, జగన్.. నేతన్న ద్రోహి అని మంత్రి మండిపడ్డారు.

విద్యుత్ చార్జీలు పెంచలేదు

» భవిష్యత్తులోనూ పెంచబోం: మంత్రి గొట్టిపాటి



అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీలను ఇప్పటి వరకు పెంచలేదని, భవిష్యత్తులోనూ పెంపు ఉండబోదని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. మంగళవారం శాసనమండలిలో వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో విద్యుత్ రంగాన్ని సర్వనాశనం చేసిందని, చివరి రెండేళ్ల పాలనలో ప్రజలపై రూ.15 వేల కోట్ల విద్యుత్ భారం మోపిందన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సుమారు రూ.8,113 కోట్లకుపైగా విద్యుత్ చార్జీలను పెంచి ఈఆర్సీకి పంపిందని, 2023-24 సంవత్సరానికి కూడా మరో 11 వేల కోట్ల పెంపుపై ఈఆర్సీకి ప్రతిపాదనలు పంపిందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ ప్రతిపాదనలతో పెరిగిన రూ.15 వేల కోట్ల విద్యుత్ భారాన్ని కూటమి ప్రభుత్వంపై మోపేలా ప్రజలను మభ్యపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చార్జీలు పెంచిన వాళ్లే రోడ్డెక్కి ధర్నాలు చేయడం, ప్రశ్నలు వేయడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 65 శాతం విద్యుత్ కొనుగోళ్లను తగ్గించామని, రైతులకు పగటి పూటే 9 గంటల విద్యుత్ ఇస్తున్నామని చెప్పారు. పీఎం కుసుమ్ పథకం ద్వారా ఇప్పటికే లక్ష కనెక్షన్లు తీసుకున్నామని, మరో రెండు లక్షల కనెక్షన్లకు కేంద్రం అనుమతులు మంజూరు చేసిందని తెలిపారు.

ఈ నెల్లోనే మెగా డీఎస్సీ.. పక్కా!

» ఎట్టిపరిస్థితిలోనూ నిరుద్యోగులను విస్మరించం: మంత్రి లోకేశ్



అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఈ నెలలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిరుద్యోగులను విస్మరించబోమని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. శాసనమండలిలో మంగళవారం వైసీపీ సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. మెగా డీఎస్సీ కోసం నిరుద్యోగ యువకులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారని, వారందరికీ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఒక్కసారి కూడా డీఎస్సీ నిర్వహించలేదని విమర్శించారు. రాష్ట్రంలో 1994 నుంచి 2,60,194 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారని, వీటిలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు 1,80,272 పోస్టులు భర్తీ చేసిందని తెలిపారు. డీఎస్సీ కోసం టెట్ కూడా నిర్వహించామని 3.68 లక్షల మంది పరీక్షలకు హాజరుకాగా, 1.87 లక్షల మంది అర్హత సాధించారని లోకేశ్ చెప్పారు. ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ నివేదిక త్వరలోనే రాబోతోందన్నారు. కాగా, తల్లికి వందనం పథకాన్ని త్వరలోనే అమలు చేయనున్నట్లు చెప్పారు. త్వరలోనే మార్గదర్శకాలు ప్రకటిస్తామన్నారు.

అమర్‌నాథ్, డ్రైవర్ హత్యలపై చర్చకు సిద్ధమా?

జగన్ హయాంలో జరిగిన బీసీ విద్యార్థి అమర్‌నాథ్ గౌడ్, దళిత డ్రైవర్ హత్యలపై వైసీపీ సభ్యులు చర్చకు సిద్ధమా? అని మంత్రి లోకేశ్ సవాల్ విసిరారు. 2014-2019 మధ్య చేనేతలకు ఇచ్చిన హామీల విషయంలో మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ సభ్యులు ఇష్టానుసారంగా మాట్లాడి బయటకు వెళ్లిపోతారని.. కానీ, ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత తమపై ఉందని అన్నారు. "2014-19 పాలన గురించి బొత్స మాట్లాడుతున్నారు. ముందు.. వైసీపీ హయాంలో జరిగిన అమర్‌నాథ్ గౌడ్ హత్య గురించి, వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు తన దళిత డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేసిన అంశం గురించి మాట్లాడదాం. ప్రతిపక్ష సభ్యులు దుష్ప్రచారం చేసి పారిపోవడం సరికాదు" అని లోకేశ్ అన్నారు.

పకడ్బందీగా రీసర్వే

» 698 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు: రెవెన్యూ మంత్రి అనగాని



అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేను పకడ్బందీగా పూర్తి చేస్తామని, ఈ ప్రాజెక్టు మూడేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. మంగళవారం అసెంబ్లీలో జరిగిన ప్రశ్నోత్తరాల్లో భూవివాదాలపై ఫిర్యాదులు అనే ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో అధికారులను అడ్డుపెట్టుకుని ఆ పార్టీ నాయకులు భూకబ్జాలు చేశారని తెలిపారు. జనవరి 20 తర్వాత చాలా జాగ్రత్తగా రీసర్వే ప్రారంభించామన్నారు. రోజుకు 20 ఎకరాల చొప్పున సర్వే చేయాలని, 250 ఎకరాలను ఒక బ్లాక్‌గా మార్చినట్లు తెలిపారు. 698 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు చేపట్టడంతో పాటు 1,200 గ్రామాల్లో రెండో విడత రీసర్వే చేపడతామని పేర్కొన్నారు. ప్రతి 1,200 గ్రామాలకు 4నెలల సమయం ఇచ్చి రీసర్వే చేపడతామని వివరించారు. కూటమి ప్రభుత్వం రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను సీఎం చంద్రబాబు రద్దు చేశారని, అలాగే రీసర్వే జరిగిన గ్రామాల్లో గ్రామసభలు పెట్టాలని ఆదేశించారని గుర్తుచేశారు. అంతకుముందు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ వైసీపీ నేతలు అధికార దుర్వినియోగానికి పాల్పడి రీసర్వేను గందరగోళం చేశారని ఆరోపించారు.

తెల్ల రేషన్ కార్డులపై సర్వే చేయాలి

» కుటుంబాలు 1.5 కోట్లు.. కార్డులు 1.42 కోట్లు

» ఇదెలా సాధ్యం?: బీజేపీ ఎమ్మెల్యేలు

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేదలకు సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం రేషన్ కార్డులు అందిస్తున్నదని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సందర్భంగా బీజేపీ ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, ఈశ్వరరావు, పార్థసారథి, సుజనాచౌదరి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. తొలుత ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కోటి 50లక్షల కుటుంబాలు ఉంటే దాదాపు కోటి 42 లక్షల కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయని, ఈ లెక్కన 8 లక్షల కుటుంబాలు మాత్రమే మధ్య, పైతరగతి వాళ్లు అన్న విషయం తెలుస్తోందన్నారు. తెల్ల రేషన్ కార్డులపై సర్వే చేసి, అర్హులైనవారికే కార్డులు ఇవ్వాలని విష్ణుకుమార్‌రాజు కోరారు. మంత్రి మనోహర్ సమాధానమిస్తూ.. రాష్ట్రంలోని దాదాపు 91 శాతం మంది ప్రజలకు రేషన్ కార్డులు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఈకేవైసీ నిర్వహిస్తున్నందున కొత్త కార్డుల పంపిణీ, ఉన్న కార్డుల విభజన చేయడం లేదన్నారు.

మండలిలో వైసీపీ తీరు దారుణం: టీడీపీ

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): శాసనమండలిలో వైసీపీ సభ్యులు సబ్జెక్ట్ మాట్లాడకుండా గందరగోళం సృష్టిస్తున్నారని టీడీపీ ఎమ్మెల్సీలు మండిపడ్డారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ... 'ఉప కులపతుల రాజీనామాపై మంత్రి లోకేశ్ మండలిలో చర్చకు సబ్జెక్ట్‌తో వచ్చినా.. వైసీపీ సభ్యులు చర్చను తప్పుదారి పట్టిస్తున్నారు. వీసీలతో బలవంతంగా రాజీనామాలు చేయించాల్సిన అవసరం లేదు. తప్పుడు ప్రచారంతో రాజకీయ లబ్ధి పొందాలని వైసీపీ చూస్తోంది' అని మండిపడ్డారు. ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ అన్ని యోగ్యతలూ ఉన్నవారినే కూటమి ప్రభుత్వం వీసీలుగా నియమించిందన్నారు. బడ్జెట్‌పై చర్చ సాగనీయకుండా వైసీపీ సభ్యులు గందరగోళం చేశారని ఎమ్మెల్సీ అశోక్‌బాబు ఆరోపించారు.

ప్రజల కోసం పనిచేయడమే

చంద్రబాబుకున్న వ్యసనం

» సీఎం గురించి గొప్పలు చెప్పడం కాదు.. గొప్పగా చెప్పాలి

» వైసీపీ సమాజానికి హానికరం.. అందుకే 11 స్థానాలకే పరిమితం

» బడ్జెట్‌పై అసెంబ్లీలో ఆర్థికమంత్రి పయ్యావుల



అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం పనిచేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబుకున్న వ్యసనమని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. మంగళవారం శాసనసభలో బడ్జెట్‌పై మంత్రి సమాధానం ఇచ్చారు. 'ప్రతి నిత్యం పని, పని అంటూనే ఉంటారు. ప్రతీది తెలుసుకోవాలి. దాన్ని ప్రజల మేలు కోసం ఉపయోగించాలని నిరంతరం తాపత్రయ పడుతూ ఉంటారు. ప్రజల కోసం ప్రతి అంశాన్ని తెలుసుకోవడం చంద్రబాబుకున్న పెద్ద వ్యసనం. ఈ మాట నేను చెప్పడం లేదు. అప్పటి గవర్నర్ నరసింహన్ చెప్పారు. సీఎం గురించి గొప్పలు చెప్పడం కాదు.. గొప్పగా చెప్పాలి. ఆయన తెచ్చిన సంస్కరణలు రాష్ట్ర ప్రజల దిశ, దశను మార్చాయి. ప్రపంచవ్యాప్తంగా పేరొందిన సంస్థలను రాష్ట్రానికి రప్పించిన ఘనత ఆయనదే. ప్రపంచ బ్యాంకుతో ఒక రాష్ట్ర ప్రభుత్వం నేరుగా సంప్రదింపులు జరిపింది దేశంలోనే మొదటిసారి చంద్రబాబు పాలనలోనే. ఎన్ని విమర్శలెదురైనా తన పని తాను చేసుకుంటూ పోయే కర్మయోగి చంద్రబాబు. డ్వాక్రా సంఘాలను అమల్లోకి తెస్తే నానా విమర్శలు చేశారు. ఇప్పుడు మహిళల చుట్టూ రాజకీయాలు తిరుగుతున్నాయంటే చంద్రబాబు వేసిన పునాదే కారణం' అని పయ్యావుల తెలిపారు.

బ్రాండ్ చంద్రబాబే శ్రీరామరక్ష

'సిగరెట్ పెట్టెల మీద హెచ్చరికలు ముద్రించినట్లు 'వైసీపీ సమాజానికి హానికరం' అని సమాజానికి పదేపదే చెప్పాల్సిన బాధ్యత మాపై ఉంది. సభకు రాకుండా దుమ్మా కొట్టిన ఆ పార్టీ ఎమ్మెల్యేలు బయట కూర్చొని విమర్శలు చేస్తున్నారు. వైసీపీ హానికరమనే విషయాన్ని ప్రజలు ఇప్పటికే గుర్తించారు. అందుకే ఆ పార్టీని 11 స్థానాలకు పరిమితం చేశారు. వైసీపీ హయాంలో 9శాతానికి పైగా వడ్డీ రేట్లు ఉన్న అప్పులు దాదాపు 141 ఉన్నాయి. ఇంకొన్ని 13.4 శాతం వడ్డీకి తెచ్చారు. ఏపీ పవర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా 13.4 శాతం వడ్డీకి అప్పులు తీసుకొచ్చారు. ఈ ఒక్క అప్పుపై వడ్డీ తగ్గించడానికి బ్యాంకర్లు ఒప్పుకుంటే రూ.6.76కోట్ల మేర భారం తగ్గుతుంది. ఈఏపీ ప్రాజెక్టులనూ గత ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఛిన్నాభిన్నం చేసేసింది. 11 పథకాలు దాదాపు రూ.27,250 కోట్ల కేటాయింపులతో ఉన్నాయి. ప్రభుత్వం వైపునుంచి సరైన చెల్లింపులు లేక ప్రపంచ బ్యాంకు, ఎన్‌డీబీ, ఏఐబీ, ఏడీబీ, జైకా, కేడబ్ల్యూఎఫ్ సహకారంతో చేపట్టిన ప్రాజెక్టులు ఆగిపోయాయి. తిరిగి వాటిని పట్టాలెక్కించే ప్రయత్నం చేస్తున్నాం. అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రం పరపతి పోగొట్టారు. బ్రాండ్ చంద్రబాబే శ్రీరామరక్షగా నిలుస్తోంది.'

సంక్షేమానికి లోటు లేకుండా ప్రణాళికలు

గతంలో పింఛన్లు రూ.200 నుంచి రూ.2,000కు, ఇప్పుడు రూ.4,000కి పెంచిన ఘనత మా ప్రభుత్వానిదే. ప్రతినెలా దాదాపు 63.36 లక్షల మందికి పెన్షన్లు పంపిణీ చేస్తున్నాం. ఏడాదికి రూ.32,520 కోట్లు పెన్షన్ల కోసం ఖర్చు చేస్తున్నాం. దేశంలో మన రాష్ట్రమే అత్యధికంగా పెన్షన్లు పంపిణీ చేస్తోంది. ఎన్ని ఇబ్బందులున్నా సంక్షేమానికి లోటులేకుండా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. సాకీ పథకం ద్వారా కేంద్రం అన్ని రాష్ట్రాలకు పెట్టుబడి వ్యయంచేసుకునే వెసులుబాటు కల్పించింది. ఈ వ్యయ ప్రతిపాదనలపై దీర్ఘకాలికరుణాలు ఇస్తోంది. ఇవి ఎఫ్‌ఆర్‌బీఎం పరిధిలోకి రావు, వీటిపై వడ్డీ ఉండదు. వీటిని 50 ఏళ్ల తర్వాత చెల్లించాలి. గత ప్రభుత్వం రూ.4,079 కోట్లు తెస్తే కూటమి ప్రభుత్వంలో 8నెలల్లోనే రూ7,203కోట్లు రుణంగా తీసుకున్నాం. గతప్రభుత్వం భవిష్యత్తు మద్యం ఆదాయాన్నీ తాకట్టు పెట్టేస్తే.. కూటమి ప్రభుత్వం మాత్రం 50ఏళ్ల వరకు వడ్డీ కట్టాల్సిన అవసరం లేనివిధంగా రుణాలను తీసుకొస్తోంది.' అని మంత్రి పయ్యావుల పేర్కొన్నారు.

ఈ బడ్జెట్ అభివృద్ధికి మైలురాయి

» వైసీపీ ఎమ్మెల్యేలు సభకు రాకపోవడం బాధ్యతారాహిత్యం

» బడ్జెట్‌పై చర్చ సందర్భంగా అసెంబ్లీలో ఎమ్మెల్యేలు

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): విధ్వంసకర పాలన తర్వాత కూటమి ప్రభుత్వం రూపొందించిన బడ్జెట్.. రాష్ట్ర అభివృద్ధికి మైలురాయి లాంటిదని ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చేవిధంగా బడ్జెట్ ఉందన్నారు. ఎమ్మెల్యే జగదీశ్వరి మాట్లాడుతూ వైసీపీ హయాంలో నీటిపారుదల రంగానికి ఇవ్వాల్సిన బిల్లుల బకాయిలను కూటమి సర్కార్ చెల్లించిందన్నారు. గత పాలకులతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారని, బడ్జెట్ సర్వజనులకు ఉపయోగకరంగా ఉందన్నారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేశ్ మాట్లాడుతూ వైసీపీ ఎమ్మెల్యేలు సభకు రాకపోవడం బాధ్యతారాహిత్యమన్నారు. చిన్న వ్యాపారులను ప్రోత్సహించేవిధంగా బడ్జెట్‌లో కేటాయింపులు ఇవ్వాలన్నారు. షేక్ షాజహాన్ బాషా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మైనారిటీలకు వ్యతిరేకంగా వ్యవహరించిందన్నారు. జగన్ ప్రభుత్వం మిగిల్చిన రోడ్లను పూడ్చేందుకు రూ.800 కోట్లు చాలలేదన్నారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ గత ప్రభుత్వ దాష్టీకంతో బీసీలు ఇబ్బందులు పడ్డారని, ఈ సర్కార్ రూ.46 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించి ఊరటనిచ్చిందన్నారు. యనమల దివ్య మాట్లాడుతూ చంద్రబాబు మహిళా పక్షపాతి అని, ఈ బడ్జెట్‌లో అది ప్రతిబింబిస్తోందన్నారు. మామిడి గోవింద రావు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల అమలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారని అన్నారు. బీజేపీ సభ్యులు ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ఖర్చు చేయాలన్నారు. జగన్ పోలవరానికి పుల్లపెట్టాడని, అమరావతికి అగ్గిపెట్టారని, పేదలకు ఇళ్లు కట్టించకుండా ఆయన మాత్రం ఇల్లు కట్టుకున్నారని ఆరోపించారు. నాసిక్ అహ్మద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం విధ్వంసకర పాలన సాగించి అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. ఆనందరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన తర్వాత.. కూటమి ప్రభుత్వం పెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తుందన్నారు.

రాష్ట్రాన్ని దివాలా తీయించిన వైసీపీ

» పేదల ఇళ్ల పేరుతో అడ్డగోలు దోపిడీ

» బడ్జెట్‌పై చర్చ సందర్భంగా కూటమి ఎమ్మెల్యేలు

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): 'గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం దివాలా తీసింది. పేదల ఇళ్ల పేరు చెప్పి అడ్డగోలుగా దోచుకున్నారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనను జగన్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది' అని కూటమి ప్రతినిధులు విమర్శించారు. మంగళవారం శాసనసభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడారు. 'గత జగన్ ప్రభుత్వం ఐదేళ్లపాటు ఆర్థిక విధ్వంసానికి పాల్పడి రాష్ట్రాన్ని దివాలా తీయించింది. జగన్ రాష్ట్రాన్ని లూటీ చేసి తన సొంత ఆస్తులు పెంచుకున్నారు. 2004లో తన ఆస్తులు రూ.2 కోట్లు మాత్రమేనని అఫిడవిట్‌లో పేర్కొన్న జగన్‌కు... ఇప్పుడు రూ.లక్షల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి? జగన్ హయాంలో చేసిన అప్పులకు ఇప్పుడు కూటమి ప్రభుత్వం ప్రతినెలా రూ.60వేల కోట్లు వడ్డీలు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది' అంటూ ప్రభుత్వ చీఫ్ విప్ ఆంజనేయులు మండిపడ్డారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ, 'గత వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీల్లో పేదలకు కట్టించిన ఇళ్లు పేకమేడల్లా ఉన్నాయి. చేత్తో తోస్తే పడిపోతున్నాయి. ఒక ఇంటికి వాడాల్సిన సిమెంటు, స్టీలును మూడు, నాలుగు ఇళ్లకు సరిపెట్టేశారు. అవి లబ్ధిదారులు నివసించడానికి పనికిరావు. అత్యంత నాసిరకంగా నిర్మించిన పునాదులపై ఇళ్లు నిర్మించినా నిలబడవు. కాబట్టి దీనిపై ప్రభుత్వం ఒక విధానపరమైన నిర్ణయం తీసుకోవాలి' అని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రమంతా దోచేశారు: ప్రత్తిపాటి పుల్లారావు

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ, 'పేదల ఇళ్లకు ఉచిత ఇసుక సరఫరా పేరుతో జగన్ ప్రభుత్వం రూ.వేల కోట్లు దోపిడీ చేసింది. అదే పేరుతో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ నేతలు దోచుకున్నారు. పాలకుడు అసమర్థుడు, అవినీతిపరుడు అయితే రాజ్యం ఎలా ఉంటుందో జగన్ పాలనలో చూశాం' అని అన్నారు. బీజేపీ శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ, 'జగన్ గత ఐదేళ్లు నియంత పాలన సాగించారు. రాష్ట్రాన్ని అన్నివిధాలా సర్వనాశనం చేశారు' అని అన్నారు.

రాష్ట్రాన్ని దివాలా తీయించింది: సుజనా

బీజేపీ ఎమ్మెల్యే సుజనాచౌదరి మాట్లాడుతూ... 'గత ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. రూ.81వేల కోట్ల అప్పులుచేసి రాష్ట్రాన్ని దివాలా తీయించింది. కూటమి ప్రభుత్వం ఖర్చులు తగ్గించుకుంటూ, ఆదాయాన్ని పెంచుకోవాలి. ఇది కష్టమైన పనైనా కూటమి ప్రభుత్వం అద్భుతమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది' అని అన్నారు. మాజీ ఎమ్మెల్యేలకు మంగళగిరి ఎయిమ్స్‌ను రిఫరల్ ఆసుపత్రిగా చేయాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు కోరారు. ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్ బాబు, తెనాలి శ్రవణ్ కుమార్, శంకర్, గౌరు చరితారెడ్డి మాట్లాడారు.

బెదిరించినట్టు ఎక్కడ ఉంది?

» వీసీల రాజీనామా లేఖల్లో ఆ పదం చూపించగలరా?

» మండలిలో బొత్సకు మంత్రి లోకేశ్ సవాల్

అమరావతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వీసీల రాజీనామా అంశంపై మంగళవారం మరోమారు శాసనమండలిలో వాడీవేడిగా చర్చ జరిగింది. వీసీలు సమర్పించిన రాజీనామా లేఖల్లో బెదిరించారనే పదం ఎక్కడ ఉందో చూపించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సవాల్ విసిరారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్లను బెదిరించారని శాసనమండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలపై లోకేశ్ సభాహక్కుల నోటీసును(ప్రివిలేజ్ మోషన్) ఇచ్చారు. దానిని సభాహక్కుల కమిటీకి పంపాలని మండలి చైర్మన్‌ను కోరారు. వీసీలు స్వచ్ఛందంగా రాజీనామా చేశారని, వారి రాజీనామాలను గవర్నర్ ఆమోదించారని లోకేశ్ తెలిపారు. కూటమి ప్రభుత్వంలో పారదర్శకంగా వీసీల నియామకం చేపట్టామని స్పష్టం చేశారు. వీసీల నియామకం అంశంపై వైసీపీ సభ్యుల తీరును లోకేశ్ దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం రాగానే 17 మంది వీసీలను బలవంతంగా రాజీనామా చేయించారనే అంశంపై ఆధారాలు సభ ముందు పెడుతున్నామని, దీనిపై విచారణ జరిపించాలని బొత్స డిమాండ్ చేశారు. బెదిరించకపోతే ఇంతమంది ఎలా రాజీనామా చేస్తారని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై లోకేశ్ అభ్యంతరం తెలిపారు. గతంలో రికార్డులు తీయాలని, ఆ రికార్డుల ఆధారంగా వీసీలను టీడీపీ ప్రభుత్వం బెదిరించినట్లు వైసీపీ సభ్యులు ఆరోపణలు చేశారా, లేదా గుర్తించాలని కోరారు. "బెదిరించి వీసీలతో రాజీనామా చేయించారని మీ సభ్యులు ఇదే సభలో అన్నారా? లేదా?" అంటూ బొత్సను లోకేశ్ నిలదీశారు. రాజీనామా చేసిన 17మందిలో 10మంది వ్యక్తిగత కారణాలతో కొందరు, ఏ కారణం చెప్పకుండానే ఇంకొందరు రాజీనామా చేశారనీ, మరో ఇద్దరు ప్రభుత్వానికి ఫ్రీహ్యాండ్ ఇవ్వాలని రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారనీ, ఐదుగురు తమకు అందిన మౌఖిక ఆదేశాల మేరకు రాజీనామా చేస్తున్నామని తెలిపారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఆనాడు నియమించిన వీసీలకు ఆరో తరగతిలో ఉండే బేసిక్ ఇంగ్లీష్ గ్రామర్ కూడా రాదని ఎద్దేవా చేశారు. రాజీనామా చేసిన ఒక వీసీ వైఎస్‌రాజారెడ్డి చెల్లెలి కోడలు అని, మరో వీసీ ప్రసాద్‌రెడ్డి వైసీపీ కార్యకర్తని, ఆయన వర్సిటీలో జగన్ బర్త్‌డే వేడుకలు నిర్వహించారని, వైసీపీ కోసం సర్వేలు చేయించిన ఘనత నాటి వీసీలకు ఉందని ధ్వజమెత్తారు. నాడు 117 జీవో తెచ్చి 12లక్షల మంది విద్యార్థులను బడికి దూరం చేశారని విమర్శించారు. వీటన్నింటిపై చర్చకు సిద్ధమా అని లోకేశ్ సవాల్ విసిరారు. వైసీపీ హయాంలో విద్యాశాఖను ఏటీఎంగా వాడుకున్నారని మండిపడ్డారు. వీసీల రాజీనామాలపై విచారణకు వైసీపీ సభ్యులు డిమాండ్ చేశారు. పోడియం వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య వాగ్వాదంతో మండలిని చైర్మన్ బుధవారానికి వాయిదా వేశారు.

ఎక్సైజ్‌లో రూ.3,113 కోట్లు దోచుకున్నారు: మంత్రి కొల్లు

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో మద్యంఅమ్మకాల్లో అక్రమాలకు పాల్పడి రూ.3,113 కోట్లు దోచుకున్నారని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అసెంబ్లీలో చెప్పారు. ఐఎఫ్ఎంల ద్వారా రూ.2,861 కోట్లు, బీర్ల మీద 250 కోట్లు దోచుకున్నట్లు ప్రాథమిక సమాచారం ఉందన్నారు. అసెంబ్లీలో మంగళవారం సభ్యుల ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. 2019-24 మధ్య కాలంలో మద్యం తయారీ ఆర్డర్లను తమకు నచ్చిన కంపెనీలకు ఇచ్చారని తెలిపారు. కొత్త బ్రాండ్స్ తీసుకొచ్చి కేవలం ఏడు కంపెనీలకే సరఫరా చేశారు. దాదాపు 63 శాతం పైగా ఆర్డర్లు కొన్ని కంపెనీలకే కట్టబెట్టారు. కేసుకు ఇంతని వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మద్యం అక్రమాలన్నింటిపై సీబీసీఐడీ విచారణ జరుగుతోంది. సిట్‌ను ఏర్పాటు చేసినరోజే తాడేపల్లి ప్యాలెస్‌లో ఫైల్స్ దగ్ధం అయ్యాయి. ఈ ప్రభుత్వం ఎవరినీ వదిలిపెట్టదు' అని మంత్రి హెచ్చరించారు. ఎక్సైజ్‌లో జరిగిన అవినీతిని వెలికితీయాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్ కోరారు.

ఎమ్మెల్యేలకు క్రీడా సాంస్కృతిక పోటీలు

» 18, 19, 20 తేదీల్లో నిర్వహణ: స్పీకర్ అయ్యన్న

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): 'ఈ నెల 18, 19, 20 తేదీల్లో.. ఎమ్మెల్యేలకు ప్రత్యేక క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తాం. సభ్యులందరూ పాల్గొనాలి. ఎమ్మెల్యేలకు కూడా ఆటవిడుపు ఉండాలనే ఉద్దేశంతో ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నాం' అని స్పీకర్ అయ్యన్న పాత్రుడు అన్నారు. మంగళవారం అసెంబ్లీలో మాట్లాడుతూ, 'పురుషులు, స్త్రీలకు వేరుగా వేరుగా పోటీలు ఉంటాయి. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నిస్, టెన్నికాయిట్, త్రో బాల్ తదితర ఆటలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నాం. పాటల, నాటకాల పోటీలు ఉంటాయి. 20న సాయంత్రం విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తాం. ప్రతి ఎమ్మెల్యే ఈ పోటీల్లో భాగస్వాములు కావాలి' అని స్పీకర్ విజ్ఞప్తి చేశారు.

ఎంఎస్‌ఎంఈలపైనే రాష్ట్ర భవిష్యత్తు: కొండపల్లి

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భవిష్యత్తు ఎంఎస్‌ఎంఈలపై ఆధారపడి ఉందని, బ్యాంకర్లతో సమన్వయం చేసుకుంటూ ఎంఎస్‌ఎంఈలను ఏర్పాటు చేయడానికి కృషిచేస్తామని ఎంఎస్‌ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు చెప్పారు. మంగళవారం అసెంబ్లీలో ఎమ్మెల్యేల ప్రశ్నలకు ఆయన సమాధానం ఇస్తూ.. కొత్త పారిశ్రామిక పాలసీ 4.0 కింద 2030 నాటికి ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఎంఎస్‌ఎంఈ ద్వారా ఉద్యోగాల సృష్టిపై అధ్యయనం చేయాలని ఎమ్మెల్యేలు కోరగా.. దీనిపై ప్రత్యేక దృష్టిపెడతామని చెప్పారు. ఎంఎస్‌ఎంఈ పార్క్‌లను ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేసేలా సర్వే చేస్తున్నామన్నారు. తొలుత ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర పథకాలు అనేకం ఉన్నాయని, వీటిపై ఎమ్మెల్యేలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఏపీఐఐసీని ప్రక్షాళన చేయాలని, భూముల రేట్లు తగ్గించాలని కోరారు. మిగతా రాష్ట్రాలతో పోలిస్తే ఏపీఐఐసీ భూముల ధరలు ఎక్కువగా ఉన్నాయని సభ్యులు అంటున్నారని, తమిళనాడుతో పోల్చితే మన రాష్ట్రంలో చాలా తక్కువ ధరకు భూమి ఇస్తున్నామని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ చెప్పారు. రూ.వెయ్యి కోట్లకు పైగా పెట్టుబడి పెడితే ప్రత్యేక జీవో ద్వారా భూమి రేటు ఇంకా తగ్గిస్తామన్నారు.

తెలుగులో మాట్లాడండి: స్పీకర్ అయ్యన్న

మంత్రులు, ఎమ్మెల్యేలూ సాధ్యమైనంత వరకూ అసెంబ్లీలో తెలుగులోనే మాట్లాడాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచించారు. ఎంఎస్‌ఎంఈలపై ప్రశ్నలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఇంగ్లీష్‌లో సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా స్పీకర్ కల్పించుకుని ప్రజలకు అర్థమయ్యేందుకు తెలుగులోనే మాట్లాడాలని సూచించారు. ఆతర్వాత ఎయిడ్స్ నివారణపై ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ కూడా ఇంగ్లీష్‌లో సమాధానం చెప్పాలని భావించినా.. స్పీకర్ సూచనలతో తెలుగులోనే మాట్లాడారు. జాతీయ స్థాయిలో ఎయిడ్స్ వ్యాప్తి తగ్గుతోందని, ఈ తగ్గుదల జాతీయ స్థాయిలో 79.26 శాతం ఉంటే మన రాష్ట్రంలో 86.26 శాతం ఉందని సత్యకుమార్ అసెంబ్లీలో చెప్పారు. హెచ్ఐవీ పాజిటివ్ రేటు 2010-11లో 4.13 శాతం ఉంటే 2023-24కు 0.78 శాతానికి తగ్గిందన్నారు. కాగా, విదేశాల్లో వైద్య విద్యను పూర్తి చేసిన విద్యార్థుల విషయంలో ప్రభుత్వం సానుకూల ధోరణితో ఉందని, కానీ నేషనల్ మెడికల్ కౌన్సిల్ మార్గదర్శకాలకు అనుగుణంగానే ఏపీఎంసీ ముందుకెళ్తోందని సత్యకుమార్ చెప్పారు. విదేశాల్లో చదివిన వైద్య విద్యార్థుల సమస్యపై ఎమ్మెల్యేలు ఇచ్చిన నోటీసుకు మంత్రి సమాధానం ఇచ్చారు. విదేశాల్లో వైద్య విద్యను పూర్తి చేసిన విద్యార్థులు.. జాతీయ పరీక్షల మండలి నిర్వహించే ఎఫ్ఎంజీ స్క్రీనింగ్ టెస్ట్‌లో ఉత్తీర్ణులవ్వాలని, ఆ తర్వాత ఏడాది పాటు ఇంటర్న్‌షిప్ చేశాకే వారికి శాశ్వత రిజిస్ట్రేషన్ వస్తుందన్నారు.



అసెంబ్లీలో నిర్వహించిన కమిటీల సమావేశంలో స్పీకర్ అయ్యన్న, డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు, వివిధ కమిటీల చైర్మన్‌లు

అసెంబ్లీ కమిటీలు చురుగ్గా ఉండాలి

» నెలలో కనీసం రెండుసార్లు సమావేశమవ్వాలి: స్పీకర్

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): శాసనసభ ఆర్థిక కమిటీలు నెలలో కనీసం రెండు సార్లు సమావేశం కావాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సూచించారు. మంగళవారం అసెంబ్లీ భవనంలో శాసనసభ ప్రజాపద్దుల కమిటీ, అంచనాల కమిటీ, ప్రభుత్వ సంస్థల కమిటీల ప్రాథమిక సమావేశాన్ని స్పీకర్ అధ్యక్షతన నిర్వహించారు. స్పీకర్ మాట్లాడుతూ కమిటీల ఏర్పాటులో ఇప్పటికే చాలా ఆలస్యమైందని, కమిటీ మెంబర్లు చాలా చురుగ్గా ఉండాలని సూచించారు. తద్వారా అసెంబ్లీ ప్రొసీడింగ్‌లోగానీ, అసెంబ్లీని నడిపించడంగానీ ఎంతో సులభమవుతుందన్నారు. ఏ రాష్ట్రమైనా సరే అసెంబ్లీ సమావేశాలను సంవత్సరానికి కనీసం 60 రోజులు జరపాలని ఢిల్లీలో నిర్వహించిన అన్ని రాష్ట్రాల స్పీకర్ల సమావేశంలో తీర్మానం చేసినట్టు తెలిపారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ కమిటీల సమావేశాలను గతంలో ఎన్నడూ లేని విధంగా నిర్వహించి మంచి పేరు తీసుకురావాలన్నారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ పార్టీలకతీతంగా పారదర్శకంగా, వివేకవంతంగా తమ కమిటీ పనిచేస్తుందన్నారు.

పోలవరం ఎత్తు తగ్గింపు అవాస్తవం

» 45.72 మీటర్ల ఎత్తులోనే నిర్మించి తీరుతాం: మంత్రి నిమ్మల



అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించేస్తున్నారంటూ వైసీపీ నేతలు చేస్తున్న విష ప్రచారానికి రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు శాసనమండలిలో ఘాటుగా సమాధానం చెప్పారు. పోలవరం ఎత్తు తగ్గింపు అవాస్తవమని, 45.72 మీటర్ల ఎత్తులోనే నిర్మించి తీరుతామని, ప్రాజెక్టు పూర్తిచేస్తామని స్పష్టం చేశారు. 2014-19 మధ్య కాలంలో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఫేజ్1, ఫేజ్-2 అని గానీ, 41.15 మీటర్లు, 55.72మీటర్లు అని గానీ లేవని తేల్చిచెప్పారు. అలాంటిదేమైనా ఉంటే వైసీపీ సభ్యులు చూపించాలని సవాల్ విసిరారు. ఎత్తుకు సంబంధించి ఫేజ్-1, ఫేజ్-2లు తెచ్చింది కూడా 2019 తర్వాత వైసీపీ ప్రభుత్వమేనన్నారు. 2020లో జగన్ పోలవరం కుడికాలువ నీటి సామర్థ్యాన్ని 17,560 నుంచి 11,650 క్యూసెక్కులకు, ఎడమ కాలువ సామర్థ్యాన్ని 17,500 నుంచి 8122 క్యూసెక్కులకు తగ్గించి ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ద్రోహం చేశారన్నారు. టీడీపీ ప్రభుత్వం 72 శాతం పనులు పూర్తి చేసిందని, వైసీపీ ప్రభుత్వం రెండు శాతం మాత్రమే చేసిందని తెలిపారు. ఈ ఏడాది జూన్ కల్లా ఎడమ కాలువ పనులు పూర్తి చేసి జూలై నాటికి ఉత్తరాంధ్రకు గోదావరి వరద జలాలు తీసుకెళ్లే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. కాగా, పోలవరం ప్రాజెక్టు అంటే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గుర్తుకు వస్తారని, పోలవరంపై హక్కు తమదేనని శాసనమండలిలో వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. పోలవరం ఎత్తు తగ్గిస్తోందా? లేదా? ప్రభుత్వం చెప్పాలన్నారు. దీనిపై మంత్రి నిమ్మల స్పందిస్తూ.. 72 శాతం పూర్తయిన ప్రాజెక్టును గత ఐదేళ్లలో ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద వైసీపీ ఎమ్మెల్సీలతో కలిసి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ ఎత్తు విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదన్నారు. 'పోలవరం ప్రాజెక్ట్ ఎత్తు తగ్గిస్తే పవర్ ప్లాంట్ రాదు. ఉత్తరాంధ్ర, రాయలసీమకు నీళ్లు రావు' అన్నారు.



సీతాకోకచిలుక పూలు

పెదవాల్తేరులోని జీవ వైవిధ్య ఉద్యానవనం భిన్న జాతులకు చెందిన మొక్కలకు ప్రసిద్ధి. ఇక్కడున్న ప్రతి మొక్క ఒక ప్రత్యేకతను కలిగి ఉంటుంది. అటువంటి వాటిలో మాత్ ఆర్కేడ్ ఒకటి. దీని శాస్త్రీయ నామం ఫాలెనోప్సిస్. ఈ మొక్కకు పూచే పూలు సీతాకోక చిలుక ఆకారంలో ఉంటాయి. అడవుల్లో మాత్రమే ఉండే ఈ మొక్కలను ప్రత్యేక పద్ధతుల్లో ఇక్కడ పెంచుతున్నారు. గ్రీన్ హౌస్ ఏర్పాటుచేసి చెట్టు బెరడు, బొగ్గు, ఇతర పదార్థాలను కలిపి మొక్కకు ఎరువుగా వేస్తారు. ఈ మొక్కకు నిరంతరం తేమ అందించాల్సి ఉంటుంది. వీటికి పూచే పూలు అత్యంత ఖరీదైనవి. సంపన్నుల ఇళ్లల్లో నిర్వహించే పంక్షన్లలో ఈ పూలను అలంకరణకు వినియోగిస్తుంటారని జీవ వైవిధ్య ఉద్యానవనం నిర్వాహకులు రామమూర్తి తెలిపారు.

- విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

ఆదుకోండి





ఈ యువకుడి పేరు చల్లా నాగరాజు. పశ్చిమగోదావరి జిల్లా గోపాలపురానికి చెందిన ఇతనికి 2015లో కరెంట్ షాక్ తగలడంతో కాలు, చెయ్యి తొలగించాల్సి వచ్చింది. ప్రస్తుతం తల్లిదండ్రులకు తనే ఆధారం. తనకు తెలుగుదేశం అంటే వీరాభిమానం అని, సీఎంను కలిసి తన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరేందుకు ఇక్కడకొచ్చానని చెబుతున్నాడు నాగరాజు. సీఎం చంద్రబాబును, డిప్యూటీ సీఎం పవన్‌ను కలిసే అవకాశం కల్పించాలని వేడుకుంటూ రాసి ఉన్న పేపరును చేతిలో పట్టుకుని అసెంబ్లీ వద్ద మంగళవారం ఇలా నిలబడి కనిపించాడు.

రాజ్యసభకు నాగబాబు!

(మొదటి పేజీ తరువాయి)

నాగబాబుకు ఖాయమని తొలుత అనుకున్నారు. కానీ ఆయన రాజ్యసభ వైపు మొగ్గు చూపడంతో ఆ ఎమ్మెల్సీ స్థానాన్ని ఎవరితో భర్తీ చేస్తారన్నది ఆసక్తిగా మారింది. కాగా.. వైసీపీ నేత విజయసాయిరెడ్డి రాజీనామా చేయగా ఖాళీ అయిన స్థానానికి జరిగే ఉప ఎన్నికలో నాగబాబును నిలపాలని పవన్ కల్యాణ్, చంద్రబాబు భావిస్తున్నట్లు సమాచారం. అయితే ఆ స్థానంలో బీజేపీ తన అభ్యర్థిని నిలుపుతుందన్న ప్రచారం ఉంది. ఒకవేళ ఆ సీటును నాగబాబుకు ఇచ్చేపక్షంలో.. ఆయనకు కేటాయిద్దామనుకున్న ఎమ్మెల్సీ స్థానాన్ని బీజేపీ అడిగే అవకాశాలు ఉన్నాయి.

టీడీపీలో పోటాపోటీ

మండలి రేసులో బుద్ధా వెంకన్న, బీద రవిచంద్ర, కొమ్మాలపాటి, దేవినేని, రెడ్డి సుబ్రహ్మణ్యం, ఏరాసు, లింగారెడ్డి, జంగా తదితరులు

ఎమ్మెల్సీ పదవులు ఆశిస్తున్న టీడీపీలోని ఆశావహులు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ను కలిసి వెళ్తున్నారు. మంగళవారం లోకేశ్‌ను కలిసినవారిలో మాజీ ఎమ్మెల్సీలు బుద్ధా వెంకన్న, బీద రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ ఎంపీ ఏరాసు ప్రతాపరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి, ప్రస్తుతం రిటైరవుతున్న ఎమ్మెల్సీలు బీటీ నాయుడు, దువ్వారపు రామారావు, పర్చూరి అశోక్‌బాబు ఉన్నారు. వీరితోపాటు మాజీ మంత్రి దేవినేని ఉమ, మాజీ రాజ్యసభ సభ్యుడు కేఎం సైపుల్లా తనయుడు జియావుల్లా కూడా ఎమ్మెల్సీ రేసులో ఉన్నారు. మైనారిటీలకు అవకాశం ఇస్తే తన పేరు పరిశీలించాలని ఆయన కోరుతున్నారు. ఇదే కోటాలో విశాఖకు చెందిన మహమ్మద్ నజీర్ కూడా ఆశిస్తున్నారు. బుద్ధా వెంకన్న ఇప్పటికే విజయవాడ ఎంపీ కేశినేని చిన్నితోపాటు వెళ్లి చంద్రబాబును కలిశారు. తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బలంగా గళం వినిపించానని, తనపై 37 కేసులు పెట్టారని అధినేత దృష్టికి తీసుకెళ్లారు. వైసీపీ అధికారంలో ఉండగా చంద్రబాబు ఇంటిపై జోగి రమేశ్ దాడికి వచ్చినప్పుడు గట్టిగా ప్రతిఘటించడం... స్థానిక ఎన్నికల సందర్భంగా పల్నాడులో తనపై జరిగిన దాడి... ఇతర సందర్భాల్లో పార్టీ తరఫున చేసిన పోరాటాల గురించి గుర్తుచేశారు. బీసీ (గవర) కోటాలో తనకు ఎమ్మెల్సీ ఇస్తే ఉమ్మడి కృష్ణాతోపాటు విశాఖ జిల్లాలోని నియోజకవర్గాలపైనా ప్రభావం ఉంటుందని తెలియజేశారు. తమకు మరోసారి అవకాశం ఇవ్వాలని అశోక్‌బాబు, బీటీ నాయుడు, దువ్వారపు కోరుతున్నారు. బీసీ కోటాలోనే బీద రవిచంద్ర కూడా ఆశిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు వైసీపీ ఎమ్మెల్సీగా ఉన్న జంగా కృష్ణమూర్తి ఆ పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి టీడీపీలో చేరిన సంగతి విదితమే. ఆ సమయంలోనే ఆయనకు ఎమ్మెల్సీ ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చినట్లు సమాచారం. దీంతో ఆయనా రేసులో ఉన్నారు. జనసేనాని కోసం తన సీటు త్యాగం చేసిన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ వర్మకు ఎమ్మెల్సీ ఇవ్వడం దాదాపు ఖాయమని చెబుతున్నారు.

పిల్లల కిట్లలోనూ కొట్టేశారు

(మొదటి పేజీ తరువాయి)

ఆదా అయ్యాయి. 35.94 లక్షల కిట్ల కొనుగోలులోనే ఇంత వ్యత్యాసం వస్తే... గత ప్రభుత్వం 45లక్షల వరకు కిట్లు కొనుగోలు చేయగా, అప్పట్లో ఇంకెంత మేర అప్పనంగా చెల్లించారో అర్థమవుతోంది.

పారదర్శకంగా టెండర్ల విధానం

గత ప్రభుత్వం విద్యాకానుక టెండర్లను ఇష్టారాజ్యంగా మార్చడంతో ఈ ఏడాది ప్రభుత్వం అప్రమత్తమైంది. కాంట్రాక్టర్లతో దశలవారీగా చర్చలు జరిపి పారదర్శకమైన ధరలతో టెండర్లు నిర్వహించేలా చూసింది. ముఖ్యంగా 'ఎవరికీ కమీషన్లు ఇవ్వాల్సిన అవసరం లేదు' అనే మాట బాగా పనిచేసింది. వాస్తవంగా కిట్ల ఉత్పత్తికి అయ్యే ఖర్చు మాత్రమే కాంట్రాక్టర్లు కోట్ చేశారు. గతంలో కమీషన్లు సమర్పించుకోవాల్సి రావడంతో అవి కూడా కలిపి లెక్కలేసుకున్న తర్వాత అదనపు ధరలకు కోట్ చేసేవారు. ఈసారి కమీషన్ల బెడద లేకపోవడంతో వాస్తవ ఉత్పత్తి ధరపై కొంత లాభం చూసుకుని కిట్లు సరఫరా చేసేందుకు కంపెనీలు ముందుకొచ్చాయి. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్‌లో విద్యార్థులకు బ్యాగులు, బూట్లు, బెల్టులు, యూనిఫాం క్లాత్, నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు ఇస్తారు. పాఠ్యపుస్తకాల టెండర్లను పాఠశాల విద్యాశాఖ విడిగా చేపడుతోంది. మిగిలిన వస్తువులకు టెండర్లు సమగ్రశిక్ష పిలిచింది. కాంట్రాక్టర్ల మధ్య పోటీ పెంచడం, సకాలంలో కిట్లు అందేలా చూడటం కోసం ఎక్కువ మంది కాంట్రాక్టర్లను ఎంపిక చేసింది. గతేడాది 16 మంది వెండర్లు కిట్లు సరఫరా చేయగా, ఈ ఏడాది 27 మంది ఎంపికయ్యారు. వీరిలో మొత్తం 138 కంపెనీలు టెండర్లలో పాల్గొనగా, 114 కంపెనీలు అర్హత సాధించాయి. అందులో 27 కంపెనీలు ఎల్1గా నిలిచాయి. ఆ కంపెనీల్లో 9 కంపెనీలు కొత్తగా వచ్చాయి.

ధరల్లో వ్యత్యాసం ఇలా....

ధరల్లో వ్యత్యాసం (రూపాయల్లో)

వస్తువు	అప్పటి ధర	ఇప్పుడు ధర	నిధుల ఆదా
బెల్టు	34.5	24.93	2,39,20,215
నోట్ పుస్తకం	52	35.64	35,57,43,553
బ్యాగ్	272.92	250	8,23,96,252
బూట్లు	187.48	159.09	10,20,72,714
యూనిఫాం	1081.98	1061.43	7,38,55,217

2024-25 విద్యా సంవత్సరానికి ఎలాంటి టెండర్లు లేకుండానే అప్పటి వైసీపీ ప్రభుత్వం పాత కంపెనీలకు కాంట్రాక్టు కట్టబెట్టింది. ఆ ఏడాదికి 35.94లక్షల కిట్లు కొనుగోలు చేయగా, వచ్చే విద్యా సంవత్సరానికి కూడా అంతే సంఖ్యలో కిట్లు కొనుగోలు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఒక్కో బెల్టుకు రూ.34.5 ధర చెల్లించగా, ఇప్పుడు రూ.24.93కే సరఫరా చేసేందుకు కంపెనీలు ముందుకొచ్చాయి. నోట్ పుస్తకానికి అప్పట్లో రూ.52 చెల్లించగా ఇప్పుడు ఏకంగా 36.5శాతం ధర తగ్గి, రూ.35.64కే రానుంది. బ్యాగును వైసీపీ ప్రభుత్వం రూ.272.92 ధరతో కొనుగోలు చేయగా, అదే బ్యాగును ఇప్పుడు రూ.250కు ఇచ్చేందుకు కంపెనీలు అంగీకరించాయి. బూట్లకు అప్పుడు రూ.187.48 చెల్లించగా, ఇప్పుడు రూ.159.09 ధర ఖరారైంది. యూనిఫాం క్లాత్ ఒక్కో విద్యార్థికి మూడు జతలకు గతంలో ధర రూ.1081.98 అయితే, ఇప్పుడు రూ.1061.43గా నిర్ణయించారు. పైగా ఈసారి యూనిఫాం క్లాత్ డిజైన్ మార్చడంతో పాటు మరింత నాణ్యమైన క్లాత్‌ను ఎంపిక చేశారు. నాణ్యత పెరిగినా ధర తగ్గడాన్ని బట్టి గత పాలకులు ఎలా దోపిడీ చేశారో గ్రహించిన విద్యాశాఖ వర్గాలు అవాక్కవుతున్నాయి. ఇవే కిట్లను గత ప్రభుత్వం రూ.676.12 కోట్లతో కొనుగోలు చేయగా, కూటమి ప్రభుత్వం రూ.612.32 కోట్లు మాత్రమే వెచ్చించింది.

గత జగన్ ప్రభుత్వంలో విద్యా కానుకలో కమీషన్ల భయం కాంట్రాక్టర్లను వెంటాడింది. ఏటా దాదాపు రూ.వెయ్యి కోట్ల టెండర్లు కావడంతో అందులో రాజకీయ జోక్యం భారీగా ఉండేది. ఏటా కొన్ని కంపెనీలకే ఉద్దేశపూర్వకంగా టెండర్లు కట్టబెట్టారు. కొత్త కంపెనీలు రాకుండా అలవికాని నిబంధనలు విధించారు. దీంతో ప్రభుత్వ పెద్దలకు ఇష్టమైన కంపెనీలు మాత్రమే ఎంపికై, ధరల విషయంలో ఎప్పుడూ పోటీ కనిపించలేదు. ఈసారి అందరికీ అవకాశం ఇవ్వడంతో కంపెనీలు పోటీ పడి తక్కువకు ఇచ్చేందుకు ముందుకొచ్చాయి. ఇక 2024-25 విద్యా సంవత్సరానికి అయితే అసలు టెండర్లే లేకుండా కాంట్రాక్టు కట్టబెట్టారు. రూ.700 కోట్ల కాంట్రాక్టును నామినేషన్ విధానంలో ఇచ్చేశారు. అలాగే మొదటి ఏడాది టెండర్లను జ్యుడీషియల్ కమిషన్ పరిశీలనకు పంపగా, ఆ తర్వాత జ్యుడీషియల్ కమిషన్‌ను తప్పించి నేరుగా కట్టబెట్టారు. చివరికి చిన్న ప్రింటర్లను కూడా పిలిపించుకుని పాఠ్యపుస్తకాలకు కమీషన్లు డిమాండ్ చేశారు.

క్యూసీఐతో నాణ్యత పరిశీలన

"పలుమార్లు కాంట్రాక్టర్లతో చర్చలు జరిపి సకాలంలో బిల్లులు చెల్లిస్తామనే హామీ ఇచ్చాం. ఈసారి యూనిఫాం క్లాత్ నాణ్యత పెరిగింది. కిట్ల సరఫరాలో జాప్యం లేకుండా చేసేందుకు ఎక్కువ ప్యాకేజీలతో టెండర్లు పిలిచాం. మొత్తం 27 ప్యాకేజీల్లో 9 కంపెనీలు కొత్తగా వచ్చాయి. ఎక్కువ ప్యాకేజీలు పెట్టడం వల్ల కొత్తవారు రావడానికి అవకాశం ఏర్పడింది. అలాగే కిట్ల నాణ్యతను క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో పరిశీలన జరిపిస్తాం. ఉత్పత్తి చేసిన ప్రాంతంతోపాటు డెలివరీ చేసిన ప్రాంతంలో కూడా నాణ్యత పరిశీలన చేస్తాం. నాణ్యతలో ఎక్కడా రాజీ ఉండదు. 9.44 శాతం నిధులు ఆదా అయ్యాయి"

- బి.శ్రీనివాసరావు, సమగ్రశిక్ష ఎస్పీడీ

15 ఏళ్లకే.. 175 సర్టిఫికెట్ కోర్సులు

- పదో తరగతి విద్యార్థిని ప్రవల్లిక ఘనత
- ప్రత్యేక ఇంటర్వ్యూ చేసిన డిస్నీ హాట్ స్టార్





భీమునిపట్నం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): చదివేది పదో తరగతి.. అయితేనేం 15 ఏళ్ల వయసులోనే 175 సర్టిఫికెట్ కోర్సులు చేసి ఔరా అనిపించింది. అందుకే ప్రముఖ టెలివిజన్ డిస్నీప్లస్ హాట్‌స్టార్ ఆ విద్యార్థినిని వెతుక్కుంటూ వచ్చి ఇంటర్వ్యూ తీసుకుంది. విశాఖపట్నం జిల్లా భీమిలి మండలంలోని గొల్లలపాలెం కస్తూర్బా గాంధీ విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న బండారు ప్రవల్లికను.. డిస్నీ ప్లస్ హాట్ స్టార్ ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేసిందని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ గంగాకుమారి మంగళవారం తెలిపారు. ఇన్ఫోసిస్ ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్ అయిన స్ప్రింగ్ బోర్డులో ప్రవల్లిక టైమ్ మేనేజ్‌మెంట్, ఎలక్ట్రానిక్స్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, డ్రోన్, రోబోటిక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా బేసిస్ వంటి అనేక అంశాలపై 175 సర్టిఫికెట్ కోర్సులు చేసిందని చెప్పారు. చిన్న వయసులోనే ఇన్ని సర్టిఫికెట్ కోర్సులు చేసిన ఆమెను ఢిల్లీ నుంచి వచ్చిన హాట్‌స్టార్ టీమ్ కలిసిందని, ఆమె అనుభవాలను అడిగి తెలుసుకుందని పేర్కొన్నారు. ఈ ఇంటర్వ్యూ త్వరలోనే డిస్నీ హాట్‌స్టార్‌లో ప్రసారమవుతుందని తెలిపారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం కోనెంపాలేనికి చెందిన ప్రవల్లిక తల్లి పాప బ్రాండిక్స్ కంపెనీలో పనిచేస్తున్నారు. తండ్రి కొవిడ్ సమయంలో చనిపోయారు.

దేవదాయ శాఖ ఏసీ శాంతిపై విచారణ

- ఆరోపణలను తోసిపుచ్చిన అధికారిణి

విశాఖపట్నం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వివాదాస్పద అధికారిణిగా ముద్రపడిన దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్(ఏసీ) కాళింగిరి శాంతి మంగళవారం విశాఖపట్నంలో విచారణకు హాజరయ్యారు. ఆమె ఇక్కడ ఏసీగా పనిచేసినప్పుడు ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆమెను సస్పెండ్ చేసిన ప్రభుత్వం.. విచారణకు ఆదేశించింది. విశాఖలోని కనకమహాలక్ష్మి దేవస్థానం ఈవో శోభారాణిని విచారణాధికారిగా నియమించారు. ఈ క్రమంలో శాంతి విచారణకు హాజరయ్యారు. ఆమెపై ఎక్కడెక్కడ ఆరోపణలు ఉన్నాయో(విశాఖపట్నం, అనకాపల్లి, కృష్ణా జిల్లా) ఆయా జిల్లాల అధికారులను కూడా రప్పించారు. కాగా, విచారణ సందర్భంగా శాంతి తనపై వచ్చిన ఆరోపణలన్నింటినీ తోసి పుచ్చారు. తాను ఎలాంటి తప్పులూ చేయలేదన్నారు. తనపై వచ్చిన ఆరోపణలకు సంబంధించిన ఫైళ్లను ఇస్తే.. వాటిని పరిశీలించి తగిన సమాధానం చెబుతానని తెలిపారు. తాను దేవదాయ శాఖ భూములు కాపాడానని, ఆదాయం పెంచానని చెప్పుకొన్నారు. విశాఖలో ఏసీగా పనిచేసినప్పుడు శాంతి తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. తన పరిధిలోలేని ఆలయాల వ్యవహారాల్లో తలదూర్చి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆమెకు వ్యతిరేకంగా ఉద్యోగులంతా ధర్నాలు చేశారు. నాడు రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డితో ఉన్న పరిచయాలను ఉపయోగించుకొని ఆమె అందరినీ బెదిరించి దారికి తెచ్చుకున్నారు. ఒకే సమయంలో మూడు పోస్టుల్లో పనిచేశారు. ఈ క్రమంలో ఆమె లంకెలపాలెంలో పరదేశమ్మ ఆలయానికి చెందిన భూమిని ఆక్రమించుకున్న వారికే లీజుకు ఇచ్చారు. అందుకు భారీగా ముడుపులు అందుకున్నారని ఆరోపణలున్నాయి. ఏసీ పోస్టుకు సరైన అర్హత లేకుండానే విధుల్లో చేరారనే ఆరోపణలు వచ్చాయి.

పూర్తి వివరాలతో కౌంటర్ వేయండి

- 'టోల్‌గేట్ వీడియో' ప్రేమ్‌కుమార్ అరెస్టుపై పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ప్రేమ్‌కుమార్ అరెస్టుకు సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్ వేసేందుకు పోలీసులకు హైకోర్టు మరికొంత సమయం ఇచ్చింది. విచారణను 11వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రఘునందనరావు నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు ఇచ్చింది. రోడ్లు వేసినందుకుగాను టోల్‌గేట్లు పెట్టి కూటమి ప్రభుత్వం వాహనదారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తోందంటూ ప్రేమ్‌కుమార్ తన అనుచరులతో ఓ వీడియోను చిత్రీకరించి సామాజిక మాధ్యమాలలో పోస్టు చేయడమే కాకుండా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. కర్నూలు ఐటీడీపీ అధ్యక్షుడు గట్టు తిలక్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కర్నూలు పోలీసులు కేసు నమోదు చేసి ప్రేమ్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. తన తండ్రిని పోలీసులు అక్రమంగా నిర్బంధించారని, కోర్టు ముందు హాజరుపర్చేలా పోలీసులను ఆదేశించాలని కోరతూ కొరిటిపాటి అభినయ్ దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్ మంగళవారం మరోసారి హైకోర్టులో విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున న్యాయవాది మహేశ్వరరెడ్డి వాదనలు వినిపిస్తూ నిందితులను అరెస్ట్ చేసే విషయంలో పోలీసులు చట్టనిబంధనలను అనుసరించడం లేదన్నారు.

విడదల రజనీపై ఏసీబీ కేసు!



- ఎమ్మెల్యే హోదాలో వ్యాపారికి బెదిరింపులు
- ఐపీఎస్ పల్లె జాషువా మెడకూ ఉచ్చు!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు విడదల రజనీపై ఏసీబీ కేసు నమోదుకు మార్గం సుగమమైంది. జగన్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన విడదల రజనీని చిలకలూరిపేటకు చెందిన లక్ష్మీ బాలాజీ స్టోన్ క్రషర్ యజమాని చలపతిని బెదిరించి రూ.2కోట్లు వసూలుచేసిన పాపం వెంటాడింది. కృష్ణా, చిత్తూరు జిల్లాల మాజీ ఎస్పీ పల్లె జాషువాకు ఈపాపంలో వాటా ఉన్నట్లు ఫిర్యాదు అందడంతో ఎట్టకేలకు ఎఫ్ఐఆర్ నమోదు అవుతోంది. అవినీతి నిరోధక చట్టం 17(ఏ) ప్రకారం ఎవరిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలన్నా వారిని నియమించే వారి నుంచి అనుమతి తప్పనిసరి. మంత్రిగా పనిచేసినవారిపై విచారణ చేపట్టాలంటే మంత్రిని నియమించిన గవర్నర్ నుంచి.. ఐపీఎస్ అధికారిపై చర్య తీసుకోవాలంటే వారికి పోస్టింగ్ ఇచ్చే సీఎస్ నుంచి అనుమతి కోరుతూ ఏసీబీ లేఖ రాస్తుంది. తాజా వ్యవహారంలో ఐపీఎస్ అధికారి పల్లె జాషువాపై సీఎస్ అనుమతి తీసుకున్న ఏసీబీకి మాజీ మంత్రి విడదల రజనీపై చర్య తీసుకోవడానికి గవర్నర్ అనుమతి లభించాలి. ఇదిలావుంటే, న్యాయ నిపుణులు మాత్రం గవర్నర్ అనుమతి అవసరం లేదని తేల్చినట్లు సమాచారం. స్టోన్ క్రషర్ యజమాని వద్దకెళ్లి మొదట డబ్బు డిమాండ్ చేసే నాటికి(2020 సెప్టెంబరు 4న) ఆమె స్థానిక ఎమ్మెల్యే మాత్రమేనని వారు గుర్తుచేస్తున్నారు. ఆ తర్వాత గుంటూరు విజిలెన్స్ ఆర్‌వీఈవోగా ఉన్న జాషువా స్టోన్ క్రషర్‌లో తనిఖీలు చేసి బెదిరించినప్పుడు, ఒత్తిళ్లకు లొంగి ఆయన డబ్బులు అందజేసినప్పుడు(2021 మార్చి 4న) కూడా ఆమె ఎమ్మెల్యేనే. ఈ విషయాన్ని గుర్తించిన న్యాయ నిపుణులు గవర్నర్ అనుమతి లేకుండా నేరుగా ఏసీబీ అధికారులు కేసు నమోదు చేయవచ్చని సూచించినట్లు తెలిసింది. విడదల రజనీ పనిచేసిన మంత్రిత్వశాఖలో అవినీతికి అప్పట్లో ఆమె పాల్పడినట్లు ఆరోపణలు వస్తేనే, గవర్నర్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసినట్లు సమాచారం. ఎమ్మెల్యే హోదాలో చేసిన దందాపై పోలీసులు సైతం కేసు నమోదు చేయవచ్చని వివరించినట్లు తెలిసింది. దీంతో ఏసీబీ అధికారులు ఎఫ్ఐఆర్ నమోదుకు సిద్ధమయ్యారు. అయితే, ఇప్పటికే గవర్నర్ అనుమతి కోసం రాసినందున ఆయన నుంచి స్పష్టత వచ్చిన తర్వాత కేసు పెట్టనున్నారు. ఈ కేసులో మరో నిందితుడైన జాషువా మెడకూ ఏసీబీ ఉచ్చు బిగిస్తోంది.

బిహార్ నమూనాలో బీభత్సం..

సకలశాఖల మంత్రిగా పేరున్న నేత అండదండలతో విడదల రజనీ రెచ్చిపోయారు. ఎవరు వ్యాపారాలు చేసుకోవాలన్నా కప్పం కట్టి తీరాల్సిన బిహార్ నమూనాకు తెరతీశారు. ఎమ్మెల్యేగా ఉండగానే అక్రమ ఆదాయాలపై దృష్టి పెట్టారు. తన వ్యక్తిగత సహాయకుడు రామకృష్ణ ద్వారా స్టోన్ క్రషర్ యజమాని చలపతిని రూ.5 కోట్లు డిమాండ్ చేశారు. తనిఖీల పేరుతో అదే పనిగా వేధించడంతో చేసేది లేక రూ.2 కోట్లు ఇచ్చేందుకు రజనీ మరిది గోపీతో ఒప్పందం చేసుకున్నారు. చిలకలూరిపేటలోని రజనీ ఇంటికి రూ.2 కోట్లు తీసుకెళ్లి 2021 మార్చి 4న అందజేసినట్లు కూటమి ప్రభుత్వానికి ఇచ్చిన ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నారు. ఈ విషయమై ప్రాథమిక దర్యాప్తు చేయించిన ప్రభుత్వం విడదల రజనీ రూ.2 కోట్లతోపాటు విజిలెన్స్ ఎస్పీ హోదాలో బెదిరించిన పల్లె జాషువా పది లక్షలు, ఎమ్మెల్యే మరిది గోపీ పది లక్షలు కలిపి మొత్తం 2.20 కోట్లు వసూలు చేసినట్లు తేలింది.

సిట్ కస్టడీలో 'కల్తీ నెయ్యి' నిందితులు

తిరుపతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూకు కల్తీ నెయ్యి కేసులో ఇద్దరు నిందితులను సిట్ అధికారులు మంగళవారం తమ కస్టడీలోకి తీసుకున్నారు. ఏ3 పొమిల్ జైన్, ఏ5 అపూర్వ వినయ్‌కాంత్ చావడాలను 3 రోజుల సిట్ కస్టడీకి అప్పగించేందుకు సోమవారం తిరుపతి 2వ ఏడీఎం కోర్టు అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. మంగళవారం తిరుపతి సబ్ జైలు నుంచి ఆ ఇద్దరినీ సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారికి రుయా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి సిట్ కార్యాలయానికి తీసుకెళ్లారు. గురువారం వరకూ వీరు సిట్ అదుపులో ఉంటారు. వారిని సిట్ కార్యాలయంలో విశాఖ సీబీఐ డీఐజీ మురళీ రాంబా విచారిస్తున్నారు. పలుకోణాల్లో సమాచారం రాబట్టేందుకు సిట్ అధికారులు ప్రయత్నిస్తున్నారు.

వంశీకి బెయిల్ ఇవ్వొద్దు

- బయటకు వస్తే సాక్షులను బెదిరిస్తారు
- కేసులో కీలక వ్యక్తులు పరారీలో ఉన్నారు
- కస్టడీలో ఆయన విచారణకు సహకరించలేదు
- బెయిల్ పిటిషన్‌పై పోలీసుల కౌంటర్



విజయవాడ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): బెయిల్ కోసం గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ దాఖలు చేసిన పిటిషన్‌పై పోలీసులు కౌంటర్ వేశారు. వంశీకి ఎట్టి పరిస్థితుల్లోను బెయిల్ మంజూరు చేయవద్దని విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ న్యాయస్థానంలో దాఖలు చేసిన ఆ కౌంటర్‌లో విజ్ఞప్తి చేశారు. బెయిల్‌పై వంశీ బయటకు వస్తే ఫిర్యాదుదారుడిని, సాక్షులను బెదిరిస్తాడని పేర్కొన్నారు. వంశీపై గతం లో 16 కేసులు నమోదయ్యాయని వివరించారు. వంశీ ప్రణాళిక ప్రకారమే ఆయన అనుచరులు ముదునూరి సత్యవర్ధన్‌ను బెదిరించి, కిడ్నాప్ చేసి గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసు నుంచి తప్పుకునేలా చేశారని వెల్లడించారు. సత్యవర్ధన్ కేసులో కీలకంగా పనిచేసిన కొమ్మా కోట్లు, ఓలుపల్లి మోహనరంగారావు, ఎర్రంశెట్టి రామాంజనేయులు ఇప్పటికీ పరారీలో ఉన్నారని తెలిపారు. తనకు మూడు ఫోన్లు ఉన్నాయని వంశీ అంగీకరించినప్పటికీ వాటి ఆచూకీ చెప్పలేదన్నారు. ఈ ఫోన్లను, సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసిన కారును వంశీ చాలా తెలివిగా మాయం చేశారని తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకోవాల్సి ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇటువంటి పరిస్థితుల్లో వంశీకి బెయిల్ ఇవ్వరాదన్నారు. కాగా, తనను సత్యవర్ధన్ తరఫున వాదించే న్యాయవాదిగా గుర్తించాలని న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ న్యాయస్థానంలో మంగళవారం వకాల్తా దాఖలు చేశారు. మూడు రోజులపాటు పోలీసు కస్టడీలో వంశీ విచారణకు సహకరించలేదని కౌంటర్‌లో పోలీసులు పేర్కొన్నారు. ఆయన్ని మరోసారి కస్టడీకి ఇవ్వాలని కౌంటర్‌లో కోరారు. కాగా, బెయిల్ పిటిషన్‌పై వాదనలను గురువారానికి వాయిదా వేశారు.

వంశీ ప్రణాళికనే అమలు చేశాం

- పోలీసు కస్టడీలో ఇద్దరు నిందితుల వాంగ్మూలం

సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో మరో ఇద్దరు నిందితులను పోలీసులు మంగళవారం కస్టడీకి తీసుకున్నారు. విజయవాడలోని జిల్లా జైలు నుంచి గంటా వీర్రాజు, వేల్పూరి వంశీబాబులను కస్టడీలోకి తీసుకుని వైద్య పరీక్షల అనంతరం పటమట పోలీస్‌స్టేషన్‌లో విచారించారు. వారు తమకేమీ తెలియదని చెబుతూనే.. వంశీ ఏం చెబితే అదే చేశామని చెప్పినట్టు తెలిసింది. వంశీ ప్రణాళిక ప్రకారం ఎవరెవరు ఏమేమి పనులు చేయాలో ఆయనకి పీఏగా వ్యవహరించిన గంటా వీర్రాజు నిర్దేశించాడు. దీనిపై పోలీసులు ప్రశ్నించగా డొంకతిరుగుడు సమాధానం చెప్పాడని తెలిసింది.

పీటీ వారెంట్‌పై కర్నూలుకు పోసాని

- ఆదోనిలో గత నవంబరు 14న కేసు నమోదు



కర్నూలు/అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లపై అసభ్యపదజాలంతో విరుచుకుపడ్డ సినీ నటుడు పోసాని కృష్ణమురళిని కర్నూలు జిల్లా ఆదోని త్రీటౌన్ పోలీసులు పీటీ వారెంట్‌పై గుంటూరు జిల్లా జైలు నుంచి మంగళవారం కర్నూలుకు తరలించారు. వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకుడుగా పోసాని జుగుప్సాకర వ్యాఖ్యలు చేశారు. దీంతో జనసేన పార్టీ కర్నూలు జిల్లా ఆదోని పట్టణ అధ్యక్షుడు మలిశెట్టి రేణువర్మ గత ఏడాది నవంబరు 14న త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు గురించి జగన్ మీడియాలో అసభ్యకరంగా దూషించారని, కృష్ణమురళి మాట్లాడిన మాటలకు కొన్ని వర్గాల్లో విద్వేషాలు రగిలి శాంతి భద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. గుంటూరు జిల్లా జైల్లో ఉన్న పోసానిని పీటీ వారెంట్‌పై ఆదోని త్రీటౌన్ సీఐ రామలింగమయ్య ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడ నుంచి తీసుకువచ్చారు. అనంతరం.. ఆదోని ఏజేఎఫ్‌సీఎం కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి అపర్ణ నివాసం వద్ద అర్ధరాత్రి సమయంలో హాజరుపరిచారు.

నాపై కేసులు కొట్టివేయండి.. హైకోర్టుకు పోసాని

"సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహా వారి కుటుంబ సభ్యులు, మీడియా సంస్థలు, కమ్మ సామాజికవర్గాన్ని దూషించానంటూ రాష్ట్రంలోని 4 పోలీస్ స్టేషన్లలో నమోదు చేసిన కేసులను కొట్టివేయండి." అని అభ్యర్థిస్తూ సినీ నటుడు పోసాని కృష్ణమురళి మంగళవారం హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. సంబంధిత పోలీస్ స్టేషన్లలో నమోదైన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా తదుపరి చర్యలను నిలువరించాలని అభ్యర్థించారు. "పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు నాకు వర్తించవు. నా వ్యాఖ్యలతో సమాజ శాంతికి భంగం కలగనందున బీఎన్ఎస్ సెక్షన్ 353(2) వర్తించదు. పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు ఏడేళ్లలోపు శిక్షకు వీలున్నవే. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని నాపై నమోదు చేసిన కేసులను కొట్టివేయండి." అని పిటిషన్‌లో పేర్కొన్నారు.

సజ్జల కేసు వివరాలివ్వండి

- ముందస్తు బెయిల్ పిటిషన్‌పై పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): తామిచ్చిన స్క్రిప్టు, ప్రోత్సాహంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, వారి కుటుంబ సభ్యులు, కమ్మ సామాజికవర్గాన్ని అసభ్య పదజాలంతో దూషించానని సినీనటుడు పోసాని కృష్ణ మురళి ఇచ్చిన నేర అంగీకార వాంగ్మూలం ఆధారంగా ఓబుళవారిపల్లె పోలీసులు తమను అరెస్టు చేస్తారని భయంగా ఉందని, ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సజ్జల రామకృష్ణారెడ్డి, ఆయన కుమారుడు భార్గవ్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం విచారణ జరిపిన హైకోర్టు.. కేసుకి సంబంధించి పూర్తి వివరాలు తమ ముందు ఉంచాలని పోలీసులను ఆదేశించింది. విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. ఈమేరకు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు ఉత్తర్వులు జారీ చేశారు.

'దువ్వాడ'పై పోలీసులకు జనసైనికుల ఫిర్యాదు

కొవ్వూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అసెంబ్లీ ప్రాంగణంలో చేసిన అనుచిత వ్యాఖ్యలను జనసేన నాయకులు తీవ్రంగా ఖండించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, జనసేన కార్యకర్తలపై దువ్వాడ శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలకు గాను ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్‌కు స్థానిక జనసేన నాయకుడు పోలిశెట్టి శివ, జనసైనికులు ఫిర్యాదు అందజేశారు. గత నెల 24న అసెంబ్లీ ప్రాంగణంలో పవన్ కల్యాణ్‌పై చేసిన అసత్య ఆరోపణలను ఖండించారు. దువ్వాడ బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.